ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి  గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ | సజల శ్రద్ధ


సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డాక్టర్ ప్రణవ్ పండ్యా**
సంపాదక మండలి
కందర్ప రామచంద్రరావు
డాక్టర్ మారెళ్ళ శ్రీరామకృష్ణ
పొన్నూరు హైమవతీశాస్త్రి
ముక్కామల రత్నాకర్
డి.వి.ఆర్.మూర్తి
సాధన నరసింహాచార్య

సంపుటి 15 - సంచిక 11
**ఏప్రిల్ 2011**
**విడిప్రతి రూ॥ 12.00**
**సం॥ చందా రూ॥ 120**
**3 సం॥ చందా రూ॥ 350**
**10 సం॥ చందా రూ॥ 1116**

*Please send Drafts & Money Orders in favour of*
**"SRI VEDAMATA GAYATRI TRUST"**
**GAYATRI CHETANA KENDRAM**
H.P. Road, Moosapeta,
Near Aswini House, Hyderabad-18.


## దుఃఖము కూడా ఉపయోగకరమే

దుఃఖాన్ని గురించి ఊహించుకుంటేనేచాలు శరీరంలో వణుకు ప్రారంభమౌతుంది. దీనిని అనుభవించినప్పుడు మనస్సు వికలం, విహ్వలం అయ్యి నిస్సహాయంగా మిగిలిపోతుంది. ఇలాంటి దుఃఖసమయంలో కలిగే బాధ గురించి ఎంతని చెప్పగలము? అందుచేతనే కాబోలు అందరూ దుఃఖమునుండి దూరంగా పారిపోవాలనీ, దుఃఖాన్ని తమ జీవితంనుండి తరిమికొట్టాలనీ ఆలోచిస్తారు. ఇది సామాన్యజనానికి చెందిన సర్వసాధారణ విషయము. ఐతే సాధకులకూ, సత్యాన్వేషకులకూ, భగవద్భక్తులకూ దుఃఖం గురించి ఆలోచించే తీరు వేరుగా ఉంటుంది. ఇటువంటివారు దుఃఖము నుండి పారిపోవటమనే పనిని చెయ్యరు, వారు దుఃఖంలోనే అప్రమత్తులైవుంటారు.

దుఃఖం వారికి ఏడుపును, వేదననూ కలిగించదు. భగవంతునిద్వారా ప్రేరేపించబడి, ఆయన చేతనే అప్రమత్తతగా ప్రసాదించబడే సందర్భంగా ఉపయోగపడుతుంది. దుఃఖపూరితమైన క్షణాలలోనే వారి అంతశ్చేతనలో సంకల్పము, సాహసము, సంవేదన, పురుషార్థమునకు చెందిన ప్రఖరత, ప్రజ్ఞ యొక్క పవిత్రతలను మేల్కొల్పుతుంది. వారి ఆత్మచేతనత్వంలో అనుభూతులతో నిండిన క్రొత్తగవాక్షములు తెరువబడతాయి. వరదానములతో కూడిన క్రొత్తక్రొత్త సందర్భములు వస్తుంటాయి. అందుచేత తాపసులు దుఃఖమును దేవుని చేతిలోని ఆయుధంగా వర్ణించారు. ఆ ఆయుధము మానవుని చేతనత్వ అభివృద్ధికి క్రొత్త సోపానాలను నిర్మిస్తుంది. అభివృద్ధికి, సంస్కరణలకూ క్రొత్త క్రొత్త ద్వారములను తెరుస్తుంది.

అందుచేతనే సాధుసన్యాసులు, ఫకీరులు, మతప్రవక్తలు, భగవంతుని ఎల్లప్పుడూ దుఃఖమును ప్రసాదించమని కోరతారు. బద్ధకస్థులు, విలాసవంతులుమాత్రమే సుఖాలను కోరుకుంటారు. సుఖభోగాల నడుమ పుట్టిపెరిగినవారి చేతనత్వము నిరంతరము సుషుప్తి వైపే ఆకర్షింపబడుతుంది. వారి జీవితంలో మంచి సంస్కారములు, పవిత్రతలకు తావెక్కడ ఉంటుంది? బాధలను సహించి, దుఃఖపు నీడలో కూడా సంతోషంగా జీవితము గడపగలిగిన వారికే అవి లభిస్తాయి. అవమానపు రోజులలో కూడా భగవద్భక్తిలో జీవించగల్గటము, దారితప్పి అంధకారంలో కొట్టుమిట్టాడే సమయంలో కూడా భగవంతుడిని స్మరిస్తూ మరణించగలిగినవారికే 'భగవంతునితో కలయిక' అనే అనంతమైన సౌభాగ్యము లభిస్తుంది!


పత్రిక అందనివారు ఈ క్రింది నంబరును సంప్రదించగలరు.
**9949111175**

పత్రికకు సూచనలు, సలహాలు ఇవ్వదలచినవారు క్రింది నంబర్‌ను సంప్రదించగలరు. **9989659905**


మౌనంగా ఉంటే కలహం దూరం.

# విషయ సూచిక

1. **సంపాదకీయం :** దుఃఖం కూడా ఉపయోగకరమే 1
2. **విషయసూచిక-సద్గురు వచనామృతం :** అడ్డుకో ఈ రాక్షస సంస్కృతిని 2
3. **వేదమంత్రం :** సుఖము భౌతికమైనది-సంతోషం మానసికమైనది 3
4. **గాయత్రీ విద్య-6 :** గాయత్రి సాధనతో దివ్య దృష్టి జాగరణ 4
5. **బాలల భవితకు బంగారు బాట-18 :** ఆపదలు - వివేకం 6
6. **ధారావాహిక ప్రజ్ఞోపనిషద్ : ప్రథమ మండలం - 5వ అధ్యాయం :** ఉదారభక్తి భావనా ప్రకరణం 7
7. **యుగ గీత-8 : రెండవ అధ్యాయం-సాంఖ్య యోగము :** ఆసక్తి నుండి ఎలా విముక్తి పొందాలి? 8
8. **సూర్య విజ్ఞానం - 7 :** ప్రాణతత్త్వ మహా సాగరం - సవితా దేవత 11
9. **జన్మ శతాబ్ది ప్రత్యేకం :** ఎన్నటికీ ఆరిపోకుండా జ్వలించే అగ్నిని నేను 15
10. **జన్మ శతాబ్ది ప్రత్యేకం :** పరివర్తనం - ఒక సమయ సాధ్య ప్రక్రియ 18
11. **జన్మ శతాబ్ది ప్రత్యేకం :** జీవితమే ఒక ప్రత్యక్ష దైవం 21
12. **గాయత్రీ 24 శక్తి ధారలు (23) :** పయశ్విని 24
13. **ఆదిశక్తి లీలా కథలు-10 :** మూర్తి రహస్యములను తెలుసుకొని ఉన్నతస్థాయి సాధకులు కండి 25
14. **బ్రహ్మవర్చస్ :** దేవసంస్కృతి పరిశోధనా సారాంశం 27
15. **పూజ్య గురుదేవుల అమృత వాణి :** పంచశీలములు పాటించండి - 3 29
16. **ప్రాణ విద్య :** మానవ శరీరంలో అయస్కాంతశక్తి సాగరం 31
17. **బోధ కథ :** లోభగుణమే గ్రుడ్డితనం 34
18. **నా వారితో నా మాట :** ఇక వరదానములు వర్షించబోతున్నాయి 36
19. **ఆరోగ్యమే మహాభాగ్యం-5 :** హోమియో వైద్య సేవ 39
20. **వేమన వేదం-జీవన నాదం - 6** 42
21. **లక్ష్మీపురం గ్రామంలో గాయత్రీ మాతా విగ్రహ ప్రతిష్ఠ** 44
22. **వార్తలు** 46
23. **అక్షరాల ఆట :** పదగాయత్రి-6 48



# సద్గురు వచనామృతం

## అడ్డుకో ఈ రాక్షస సంస్కృతిని

ప్రమాదం ముంచుకు వస్తున్నది. విపత్కర ఘడియ దూరంగా లేదు. మానవుడు సభ్యత యొక్క గోడలను కూల్చాలని చూస్తున్నాడు. ఈ ధోరణి సాగుతూపోతే నైతిక ఆదర్శాలు నశించిపోయి, మనుషులు ఒకరినొకరు చంపుకుతినే తోడేళ్ళు అయిపోతారు. దైవత్వంపై, మానవీయ సహకారంపై కొంత నమ్మకం, శ్రద్ధ, మమత కలవారికి నిర్ణాయాత్మకమైన పరీక్షా సమయం ఆసన్నమైనది. దైవ సంస్కృతి అధఃపతనాన్నీ, రాక్షస సంస్కృతి విజయ ఘోషనూ వారు ఉదాసీనతతో ప్రేక్షకుల వలె చూస్తూ కూర్చోలేరు. వారు ఏదో ఒకటి చెయ్యాలి. భగవంతుడు మనకిచ్చిన బలాన్నీ, సాహసాన్నీ, వివేకాన్నీ, పురుషార్థాలన్నీ, ఉత్తమోత్తమంగా ఉపయోగించటానికి సరైన సమయం ఇదే. ప్రభుత్వం ఇచ్చిన తుపాకీని సరైన సమయంలో ఉపయోగించని సైనికుడు కర్తవ్యాన్ని విస్మరించిన అపరాధి అవుతాడు. నైతిక పునరుద్ధరణ యొక్క పునాదిని బలోపేతం చేయటానికీ, కూలిపోతున్న మానవతా ఆదర్శాల గోడలను తిరిగి నిర్మించటానికై మనలోని పలువురు ఇటుకలుగా, సున్నంగా మారవలసి ఉంటుంది. సమయం ఇస్తున్న పిలుపు ఇదే. సభ్యత ఇస్తున్న పిలుపు ఇదే. రండి. ఈ సవాలును స్వీకరించండి.

*- అఖండజ్యోతి, ఫిబ్రవరి 1955*

*అనువాదం : శ్రీ ఊటుకూరి సత్యన్నారాయణ గుప్త*

## పండుగలు

**ఏప్రిల్ 2011**

| | |
|---|---|
| 04-04-2011 | ఉగాది |
| 12-04-2011 | శ్రీరామ నవమి |
| 22-04-2011 | గుడ్ ఫ్రైడే |
| 30-04-2011 | మహావీర జయంతి |

**సజ్జనుల సంపద పరోపకారానికి వినియోగం అవుతుంది.**

వేద మంత్రం

# సుఖము భౌతికమైనది - సంతోషం మానసికమైనది

**ఉదుత్తమం ముముగ్దినో వి పాశం**
**మధ్యమం చృత అవాద్యమాని జీవసే ॥**

**– (ఋగ్వేదం 1/25/21)**

**భావార్థం :** పుత్రేషణ, విత్తేషణ, లోకేషణ మనలను పతితులని చేసి దుఃఖం కలిగిస్తాయి. అందుకే వీటి నుండి విముక్తి పొందాలి.

**సందేశం :** ప్రపంచంలోని ప్రాణులన్నీ సుఖాన్నే కోరుకుంటాయి, సుఖాన్ని దినదినాభివృద్ధి చేసుకోవాలని ప్రయత్నిస్తుంటాయి. ఎక్కువ సౌకర్యాలు ఉంటే ఎక్కువ సుఖంగా ఉంటామని భావిస్తారు.

నీతితోగాని, అవినీతితోగాని, ఉచితానుచితాలు పట్టించుకోక ప్రపంచంలో తనకు కావలసినవన్నీ పొందాలనుకుంటున్నారు. వివేకహీనుడై భోగవిలాసాలలో మునిగి డొల్లఅయిపోయి సుఖాన్ని అనుభవించగలిగే సామర్థ్యాన్ని పోగొట్టుకుంటున్నారు.

భారతీయ ఆధ్యాత్మిక సంస్కృతి సుఖానికన్నా సంతోషానికి, ఆనందానికి ప్రాముఖ్యతను ఇస్తుంది. సుఖం, సంతోషములలో ఆకాశ పాతాళాలంత అంతరమున్నది. సుఖము భౌతికపరమైనది. సంతోషం ఆధ్యాత్మికమైనది, అనుభూతిపరమైనది. మనిషి ఎల్లప్పుడూ ఆత్మ సంతోషాన్ని, ఆనంద ప్రాప్తిని కోరుకోవాలి. ఒక్కొక్కసారి తన సుఖాన్ని త్యాగం చేసి ఓ రోగి సేవలో రాత్రింబవళ్ళు కష్టపడితే, దానివలన కలిగే ఆత్మ సంతోషాన్ని వర్ణించలేము. సంతోషం మనఃస్థితిమీద ఆధారపడి ఉంటుంది, వస్తువుల మీద కాదు. ఒక్కొక్కసారి అత్యంత సంపన్నుడు దుఃఖాలతో పడికొట్టుంటుంటే ఒక పేదవాడు సుఖంగా, సంతోషంగా ఉండటం మనం చూస్తున్న విషయమే.

ఈనాడు అనేకమంది వ్యక్తులు ఈ మాయాజాలంలో ఇరుక్కుని సుఖంకొరకు చేయకూడని పనులు చేస్తున్నారు. ఇటువంటివారు ఇతరులను లెక్కచేయరు, ఇతరులకు దుఃఖాన్ని మిగులుస్తుంటారు. ప్రపంచంలో వస్తువులు పరిమితంగానే ఉంటాయి. స్వార్థపరులు, బలవంతులు బలహీనులను దోచుకుంటారు. ఇలాచేసేవారిని అవినీతిపరులు, అవకాశవాదులు సమాజ పీడకులని అనవచ్చు. ఇటువంటివారు చాలా సుఖంగా ఉన్నట్లు కనపడవచ్చు. అన్ని సుఖ సౌకర్యాలు ఉన్నప్పటికీ వారు సుఖాన్ని ఆస్వాదించలేకపోతారు. వారి పిల్లలు, కుటుంబ సభ్యులు వంచితులవుతారు. చివరికి నలువైపులా అపకీర్తి మాత్రమే మిగులుతుంది.

ప్రతివ్యక్తికి తన ప్రతిభ, సామర్థ్యాలనుసారం సుఖ సౌకర్యాలను పెంచుకునే స్వాతంత్ర్యం ఉండాలి. అప్పుడు అది ఆదర్శ సమాజమవుతుంది. ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా వ్యక్తి ఎదగాలి, ఇతరులకు సాయపడగలగాలి. ఇలా జీవించేవాడి జీవితం ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్తుందో! ఆత్మబలమే ఇలా ప్రేరేపించగలదు. ఎవరు ఎక్కువ ఎంత ఆత్మ శక్తి కలిగి ఉంటారో అంతగా మాయమోహభవబంధనాలను త్రెంపి వేయగలుగుతారు.

★★★

## మూర్ఖుల శ్రమ-తెలివైన వారి లాభం

*ప్రఖ్యాత విజ్ఞానవేత్త న్యూటన్ తన ఇంట్లో, దైనందిన జీవితంలో తన తెలివితేటలని ఉపయోగించుకుని అన్వేషణలు, ఆవిష్కరణలు చేస్తుండేవాడు. ఒక రోజు గాలి వీచే పంఖా తయారుచేశాడు. దానిని త్రిప్పటానికి శక్తి ఎలా వస్తుందనే ప్రశ్న వచ్చింది. పంఖాతో ఒక గిలకను ఏర్పాటు చేసి, క్రింద రెండు ఎలుకలను ఉంచి పైన గోధుమలను ఉంచాడు. గోధుమలను తినటానికి ఎలుకలు గిలకమీదుగా పైకి ఎక్కటానికి ప్రయత్నించేవి. గోధుమలు ఎత్తుమీద ఉండటం వలన అందక ఎలుకలు ఎక్కుతూ, క్రింద పడసాగాయి. ఈ విధంగా వాటి శ్రమ ఫలితంగా పంఖా తిరగసాగింది. న్యూటన్ పంఖా నుంచి వీస్తున్న గాలిని ఆనందించాడు. ఆయన ఈ సాఫల్యం గురించి వివరిస్తూ మూర్ఖుల శ్రమ వలన తెలివైన వ్యక్తులు ఏ విధంగా లాభాన్వితులు కాగలరో ఈ సంఘటన తెలియజేస్తుందని, అలాగే దురాశాపరులైన వ్యక్తుల నిరర్థకమైన శ్రమ ఈ విధమైన ప్రయత్నంతో పోల్చవచ్చని చెప్పాడు.*

– ప్రజ్ఞా పురాణం నుండి

**శీలమే అన్నింటికి పునాది రాయి.**

గాయత్రీ విద్య-7

# గాయత్రి సాధనతో దివ్య దృష్టి జాగరణ

గాయత్రి ఉపాసన చేసే సమయంలో రెండు నేత్రముల మధ్య ఉన్న భృకుటిపై ధ్యానం చేయబడుతుంది. అక్కడ ఒక రేగు పండు ఆకారంలో ఒక గ్రంథి ఉన్నది. దీనినే ఆజ్ఞాచక్రమంటారు (పీనియల్ గ్రంథి). డాక్టర్లు ఇది చేసే పనిని, దీనివల్ల ప్రయోజనమును ఇప్పటివరకు పూర్తిగా అర్థం చేసుకోలేకపోయారు. కాని ఆత్మ విద్యా అన్వేషకులకు దీని యొక్క మహత్వపూర్ణమైన పనిని గురించి ఎప్పుడో తెలుసు. దీనినే మూడవ నేత్రమంటారు. దివ్య నేత్రమంటారు. దివ్యదృష్టి ఇక్కడ నుండే జరుగుతుంది.

వెలుగు సహాయంతో మనం వస్తువులను చూడగలుగుతాము. మన లోపల ఉన్న జీవాణువులలో కూడా వెలుగు ఉంటుంది. అక్కడ నుండి వెలువడే కిరణములు లోపల ప్రకాశవంతం చేయడమేగాక బయట కూడా తేజస్వితం చేస్తాయి. కనులలో వెలుగు ఉంటుంది. ఆజ్ఞాచక్రం యొక్క ప్రకాశం ఊర్జా (శక్తి) రూపంలో కూడా వికసింపజేసుకోవచ్చు. దానిని టెలివిజన్ లాగా ఉపయోగించుకోవచ్చు. ఇతరులతో మాట్లాడవచ్చు. ఈ ఊర్జతో ఇతర వస్తువులను, వ్యక్తులను ప్రభావితం చేయవచ్చు.

భ్రూ-మధ్య భాగంలో ఉన్న ఆజ్ఞాచక్రమును తృతీయ నేత్రంగా చెప్తారు. శివపార్వతుల చిత్రాలలో వారి తృతీయ నేత్రం కూడా చూపిస్తారు. శివుడు ఈ తృతీయ నేత్రాన్ని తెరచి దాని నుండి వెలువడే అగ్నితో కామదేవుని భస్మం చేసిన కథ అందరికి తెలిసినదే. దివ్యదృష్టి కేంద్రం కూడా ఇదే. దీనిని టెలివిజన్‌లాగా పనిచేయించుకోవచ్చు. దూరదర్శనం యొక్క దివ్యమైన యంత్రం ఇదే. మహాభారత యుద్ధ సమయంలో సంజయుడు దీని ద్వారానే ఎక్కడో జరుగుతున్న యుద్ధాన్ని రాజభవనంలోనుండే చూస్తూ ధృతరాష్ట్రునికి యుద్ధ సంఘటలను వివరించాడు.

సూక్ష్మ కారణ శరీరముల దివ్యదృష్టి క్షమత చాలా ఎక్కువ. దీనిని యోగాభ్యాసం ద్వారా వికసింపచేసుకొని ప్రయోగించవచ్చు. కాని స్థూల శరీరంలో కూడా ఈ శక్తి ఉన్నది. కన్నులలో మాత్రమే చూడగలిగే సామర్థ్యం లేదు. ఇతర అంగములలో కూడా చూడగలిగే సామర్థ్యం ఉన్నది. మస్తిష్కము నేత్రాలను కెమెరాలాగా ప్రయోగిస్తుంది. కంటిలోని లెన్సు ద్వారా చూచిన చిత్రాలు మస్తిష్కంలో జమ అవుతాయి. మస్తిష్కంలోని రూపమును చూసే కేంద్రమున్నది. దీని ద్వారానే చూచిన వస్తువు యొక్క రూపాన్ని గ్రహించగలుగుతాము. మస్తిష్కంలోని రూపమును చూచే కేంద్రముతో నేత్రముల నరాలతో (optic nerve) నేరుగా దగ్గర సంబంధం ఉన్నది. అందువల్ల కన్నులతోనే చూడడం అనే పని చేస్తుంటాము. మస్తిష్కం దీని ఆధారం పైనే తన పని చేసుకుంటుంది. కాని చూడగలిగే శక్తి కేవలం కన్నులకు మాత్రమే కలదని అనుకోకూడదు. అన్య అంగములు మస్తిష్కంతో జోడింపబడిన నాడులను వికసింపజేసుకుని కూడా ఈ చూచేపనిని చాలా వరకు చేసుకొనవచ్చు. విశ్వంలోని ప్రతి ఒక్క పదార్థము వేడి, ప్రకాశం యొక్క విద్యుత్ కిరణాలతో నిండి ఉంటుంది. వాటి కంపనముల తరంగాలు ఈ నిఖిల విశ్వంలో తన ప్రవాహములను వెదజల్లుతుంది. అవి ఈథర్ తత్వం ద్వారా చాలా దూరం వెళ్తాయి. వాటిని పట్టుకోగలిగితే చాలా దూరంలో ఉన్న వస్తువులను, జరుగుతున్న సంఘటలను ఎదురుగా ఉన్న వస్తువుల వలె చూడవచ్చు. కన్నులు దగ్గరగా ఉన్న వస్తువులను చూడగలవు. కాని పృథ్వీమీద ఎక్కడో దూరంలో జరుగుతున్న సంఘటనలు చూడటానికి తృతీయ నేత్రం అవసరం ఉన్నది. ఇది భ్రూ-మధ్యంలోని ఆజ్ఞ చక్రంలో ఉన్నది. రూపతత్వ సంబంధం కేవలం నేత్రములతో మాత్రమే సంబంధం ఉన్నదని భావించకూడదు. అగ్నితత్వం వల్ల "రూపం" యొక్క కంపనలు ఉత్పన్నమవుతాయి. శరీరంలో అగ్నితత్వ ప్రాతినిధ్యం కన్నులు చేస్తాయి. కాని శరీరంలోని ఇతర అంగములతో అగ్నితత్వానికి సంబంధం లేదని భావించరాదు. ఎక్కడెక్కడ అగ్నితత్వం ఉన్నదో అక్కడక్కడ రూపం ఉంటుంది. శరీరం పంచతత్వాలతో నిర్మించబడింది. **ఇతర అంగములలోని అగ్నితత్వాన్ని సాధనాత్మక ప్రయోగం ద్వారా వికసింపజేసుకొన్నట్లయితే, కన్నులు చేసే పనిని ఆ అంగముల ద్వారా కూడా చేసుకొనవచ్చు.** ఈ విధంగా ఇతర జ్ఞానేంద్రియముల కార్యము కొంతవరకు ఇతర అంగములు కూడా చేయగలవు. **పహరిబాబా** గాలి మాత్రమే పీల్చుకునేవారు, అన్నం, నీరు తీసుకొనేవారు కాదు. కాని శరీరం యొక్క ఇతర అంగముల ద్వారా అదృశ్యజగత్తు నుండి సూక్ష్మ ఆహారం అందుతూనే ఉన్నది. ఇది లేకుండా జీవించి ఉండటం సాధ్యం కాదు.

సాహసవంతులే విజయాన్ని సాధించగలరు.

ఒకప్పటి రష్యాలో ఇజ్ వెస్టియా అనే పత్రికలో ప్రచురింపబడిన వార్తానుసారం నిఝూని తాగిల్ రోజా అనే పేరుగల యువతి పుస్తకంలోని పంక్తులను వేళ్ళతో స్పృశిస్తూ పుస్తకములు చదువగలిగేది. ఇంతేగాక పుస్తకంలో ప్రచురింపబడిన ఫోటోపై వేలుపెట్టి అది మహాత్మాగాంధీయా, అబ్రహం లింకనో అని చెప్పగలిగేది. ఆ ఫోటో ఆమెకు తెలియని వారిదయితే వారి వర్ణన ఇచ్చేది. వారి మీసాలు ఎలా ఉన్నాయి, చెవులు ఎలా ఉన్నాయి. ఎలాంటి దుస్తులు ధరించారో వర్ణించగలిగేది.

పాము అలా పడి ఉంటుంది. తన అవయవాలతో ఎక్కడ ఏ దిశలో తన ఆహారం ఉన్నదో తెలుసుకోగలదు. అంతే దానిపై దాడిచేసి పట్టుకుంటుంది. అనేక రకాల పక్షుల మెదడులో వేలాది మైళ్ళు ప్రయాణం చేయడానికి కావలసిన రికార్డు ఉంటాయి. అందుచేత పది సంవత్సరాల తరువాత కూడా ఆ పక్షులు ఎక్కడ నుంచి వచ్చాయో తిరిగి అక్కడకు వెళ్ళగలవు. కప్ప యొక్క కన్నులకు, మస్తిష్కానికి మధ్య ఇటువంటి నాడులు ఉన్నాయి. వాటితో అవి తమ శత్రువులు దాడిచేయబోతున్నాయి అని తెలుసుకోగలవు. ఆక్రమణ జరుగక ముందే తప్పించుకోగలవు.

ఇటువంటి ఆధారంతో వైజ్ఞానికులు రోజాను విచారించారు. ఆమె ఇన్‌ఫ్రారెడ్ కిరణాలను వాటితోపాటు ఒక కాగితం మీద పడుతున్న అక్షరాలను చదివింది. మానవ నేత్రం ఇన్‌ఫ్రారెడ్ కిరణాలను చూడలేవు, గుర్తించలేవు. ఇందువల్ల వైజ్ఞానికులు కళ్ళలోనేగాక శరీర ఇతర అంగములలో కూడా దృష్టితత్వం ఉందని గ్రహించారు. రోజా చేతులలోనే ఇలాంటి తత్వం ఉందనుకోవక్కరలేదు. వీనిపై ప్రయోగాలు చెయ్యవలసిన అవసరం ఉన్నది. వెలుగును చూడగలిగే తత్వములు వేళ్ళలోకి ఎలా వచ్చాయి? ప్రకాశకిరణాలను ఆకర్షించుకొని శరీరంలో అతీంద్రియ జ్ఞానం (extraordinary sense perception) పొందే క్షమత పొందగలగాలి. ఇది భారతీయ యోగుల విజ్ఞాన సమ్మతమైనదే.

గాయత్రీ ఉపాసనతో భృకుటి మధ్య ఆజ్ఞా చక్రస్థానంలో ధ్యానం చెయ్యటం యొక్క ఉద్దేశ్యం లోపల ఉన్న ప్రకాశ సత్తా వికసింపజేసుకోవడమే. దానిని వికసింపజేసుకున్నట్లయితే దివ్యమైన సామర్థ్యములు జాగృతమవుతాయి. బల్బు వెలిగినపుడు దాని కాంతిలో ఇతర వస్తువులు కనిపిస్తాయి. ఆకాశంలో మిణుకుమిణుకు మంటున్న నక్షత్రాలు కూడా రాత్రి వేళలోని చిమ్మచీకటిని తగ్గిస్తాయి. ఆ పరిస్థితిలో దగ్గరగా ఉన్న వస్తువులను కొంతవరకు చూడవచ్చు. మనలో ఉన్న ప్రకాశకిరణములు కొంచెం ఎక్కువగా వెలిగితే ప్రపంచంలోని ఇతర ప్రదేశాలలో జరిగే సంఘటనలు కూడా చూడవచ్చు. అర్థం చేసుకోవచ్చు.

ఇంతేగాక ఆజ్ఞాచక్ర జాగృతివల్ల అనేక దివ్యమైన లాభాలు ఉన్నాయి. ఆజ్ఞాచక్ర జాగృతి వలన అనేక శక్తులు, దైవీ విభూతులు ప్రాప్తించుకోవచ్చు. గాయత్రీ సాధన సాధకునికి అనేక దివ్యమైన లాభాలతోపాటు ఆత్మకళ్యాణ మార్గంపై లక్ష్యాన్ని చేరుస్తుంది.

*– అఖండజ్యోతి, జూన్ 2005*

*అనువాదం : శ్రీమతి లక్ష్మీ సుందరి*

## కదిలించే కళ్లు

45 సీ॥ *స్వాతంత్ర్య సమరాన సైనిక పాత్రలో*
*సమరంబు సాగించి సాగవలయు*
*ఇంతలో నీవింక కొంత కొంత జపము*
*పూర్తి చేయుచునుండ నార్తి లేక*
*హింసను విడనాడి యింగ్లీషు వారును*
*ఇంటిముఖము పట్టి యేగగలరు*
*స్వాధ్యాయరంగాన సాధించి విజయంబు*
*యుగము మార్చుదునంచు యుక్తితోడ*

తే॥ ప్రజలలోనను తిరుగుచూ ప్రగతి చూపి
ముందు కానడి పింతువనుచు మురియు విధము
మానవాళికి దెలుపుట మరువకనుచు
కవిని కదిలించె గురుదేవు కంటిచూపు

46 సీ॥ *లక్షలు వెచ్చించి లక్ష్యంబు సెడకుండ*
*ధైర్యంబుతో నీవు తగిన విధము*
*పూర్ణాహుతియనుచు పూర్తిగా శ్రమియించి*
*ఇరువదినాల్గును మరువకుండ*
*లక్షల సంఖ్యలో లక్షణయుతముగా*
*ఆహుతులందించి యాదరమున*
*సాధనయందించు సాధ్యంబు దెలుపుచు*
*సాధకుండననుచు చాటవలయు*

తే॥ అని తెలుపుచున్నట్టి పలుకు లాలకించి
పట్టు వీడక నేనంత వరలు విధము
మానవాళికి దెలుపుట మరువకనుచు
కవిని కదిలించె గురుదేవు కంటిచూపు

*రచన–మధుర కవయిత్రి*
*పొన్నూరు హైమవతీ శాస్త్రి*

**సదాశయం మనిషికి ఆరోగ్యాన్ని ఆనందాన్ని ఇస్తుంది.**



## బాలల భవితకు బంగారు బాట-18

# ఆపదలు - వివేకం

"ఆపదలు వచ్చిపడ్డప్పుడు వివేకం లోపిస్తూ ఉంటుంది. కానీ అలాంటప్పుడే కొంతలో కొంత వివేకాన్ని వినియోగించాలి. అదే విజ్ఞత అనిపించుకుంటుంది" అంటూ యోగానందుల వారి ప్రవచనం సాగిపోతూ ఉంది. ఉపన్యాసాన్ని శ్రద్ధగా విన్న శారదుడు అనే శిష్యుని మనస్సులో ఒకటే ఆలోచన. వివేకం లోపిస్తుంది అంటూనే దాన్ని ఉపయోగించాలి అనడంలో ఆంతర్యం ఏమిటి? ఆగబట్టలేక అదే సాయంకాలం అడిగేశాడు గురువుగారిని. గురుదేవులు రెండు ఉదాహరణలు చెప్పారు.

(1) "నేను గురుకులంలో చదువుకుంటూ ఉండగా రుద్రుడు అనే సహపాఠి ఉండేవాడు. అతడు ఒకసారి సమిధల కోసం అడవికి వెళ్ళాడు. ఎదురుగా పెద్ద పులి వస్తోంది. అడుగులు ముందుకు వేసినా, వెనుదిరిగిపారిపోయినా పులికి ఆహారం అవడం తథ్యం. పులివేగం ముందు తన పరుగెంత? తానెంత? వేగంగా ఆలోచించాడు. భయంతో శరీరం చెమటలు పట్టిపోతోంది. మృత్యు భయం ఎంత భయంకరమైందో అప్పుడే అర్థం అయింది. "బ్రతికినా నవ్వుతూ బ్రతకాలి. చచ్చినా నవ్వుతూ చావాలి" అని గురువు గారు ఒకసారి ప్రవచనంలో చెప్పిన మాట గుర్తుకు వచ్చింది. చావు ఎట్లాగూ తప్పదు. నవ్వుతూనే చస్తాను అని నిర్ణయించుకున్నాడు. పెద్దగా నవ్వుతూ ముందుకు నడుస్తున్నాడు. భయంతో కూడిన నవ్వు కదూ! వికటాట్టహాసంగా రూపుదిద్దుకుంది. పులికి ఇదంతా వింతగా అనిపించింది. తాను పుట్టి పెరిగాక ఇంతవరకూ ఎవ్వరూ తనకు ఎదురుగా నడచిరాలేదు. పైగా ఈ వింత నవ్వు ఒకటి. ఒక్క క్షణం ఆలోచించింది. "ఈతడు మానవుడుకాడు. ఏదో వింత మృగం అయి ఉంటుంది. అందుకే ధైర్యంగా నా మీదకు దాడికి వస్తోంది" అనుకుంది. అంతే. ఇప్పుడు పులికి ప్రాణ భయంపట్టుకుంది. వెనుకకు తిరిగి చూడకుండా పరుగో పరుగు. ఈసారి ఆశ్చర్యపోవడం రుద్రుని వంతు అయింది. హాయిగా నవ్వుకుంటూ తన పని ముగించుకుని గురుకులానికి తిరిగి వచ్చాడు. అందరికీ ఈ విషయం చెప్పి ఒకటే నవ్వు".

(2) "నిత్యానందుడు అనే గురువు దగ్గర శృంగి, భృంగి అనే ఇద్దరు శిష్యులు ఉండేవారు. ఒకనాటి రాత్రి గురుశిష్యులు భోజనానికి కూర్చున్నారు. గురుపత్ని వడ్డిస్తూ ఉంది. భోజనం మధ్యలో హఠాత్తుగా శృంగి "గురుదేవా" శనగ గింజంత విషపు గుళికను మింగేశాను" అంటూ పెద్దగా అరచి స్పృహ తప్పి పడిపోయాడు.

భృంగి భోజనం ముందు నుండి లేచి విషానికి విరుగుడు మూలికల కోసం బయటకు పరుగులు తీశాడు. గురువు మాత్రం తాపీగా భోజనం చేస్తున్నాడు. గురుపత్ని సహించలేక పోయింది. ఒక్కరోజు భోజనం చేయకపోతే ఏమీకాదు. లేచి ముందు శృంగిని రక్షించండి" అంది కఠినంగా. నిత్యానందుడు నవ్వుతూ – "శృంగికి ఏమీ కాదు. విషపు గుళికను మింగేశాను అన్నాడు. శనగ గింజంత అని ప్రమాణం కూడా చెప్పాడు. విషపు గుళిక అని తెలిశాక ఎవ్వరూ మింగరు. అసలు విషపు గుళిక ఎలా ఉంటుందో అతనికి తెలియదు. అది భోజనంలోనికి ఎలా వస్తుంది? ఏదో భ్రమలో భయపడ్డాడు. భయంతో మూర్ఛపోయాడు. ముఖం మీద కాసిని నీళ్లు చల్లు, లేచి కూర్చుంటాడు" అన్నాడు. ఆమె అలానే చేసింది. శృంగి లేచి కూర్చున్నాడు. తనకు కలిగిన భ్రమకు సిగ్గు పడ్డాడు. కనుక ఆపదలు కలిగినప్పుడు ఒక్క క్షణం వివేకాన్ని జోడించాలి. కొంచెం స్థిరంగా ఆలోచించడం అలవాటు చేసుకోవాలి" అంటూ శిష్యుని సందేహాన్ని పటాపంచలు చేశాడు యోగానందుడు.

బాలలూ! విన్నారు కదా! జీవితంలో కొన్ని తెలిసీ, కొన్ని తెలియకా ఆపదలు కలుగుతూ ఉంటాయి. అన్నింటికీ కంగారు పడిపోతే ప్రయోజనం లేదు. స్థిరమైన మనస్సుతో పూర్వాపరాలు ఆలోచించుకోవాలి. సమయస్ఫూర్తితో నడచుకోవాలి. "మర్యాద రామన్న తీర్పులు", "పంచతంత్ర కథలు" మొదలైనవి మన సాహిత్యంలో కోకొల్లలుగా కనిపిస్తూ ఉంటాయి. తీరిక సమయాల్లో కథలు చదువుకోవడం అలవాటు చేసుకోవాలి. చక్కని సాహిత్యం ద్వారా ఆలోచనలకు పదును పెట్టుకోవాలి. వివేకంతో విపత్తులను దాటుకోవాలి. అందుకే "పుస్తకం మంచి మిత్రుడు" అన్నారు పెద్దలు. ఎన్ని డిగ్రీలు సంపాదించినా లోక జ్ఞానాన్ని అందించే సాహిత్యాన్ని తప్పక చదువుకోవాలి. ఆపద సమయాలలో అవి తప్పక ఆదుకుంటాయి.

**కం॥ మెదటికి మేత నొసంగుచు**
**పదునుగ చేసెడి కథలను వదలక చదువున్**
**అదనున సాయము దొరకును**
**ఇది తథ్యంబనుచునింక నెరుగము బాలా !**

– మధుర కవయిత్రి, పొన్నూరు హైమవతీ శాస్త్రి

**పర్యావరణ కాలుష్యానికంటే మనోమాలిన్యం అనేక రెట్లు ప్రమాదకరం.**

ధారావాహిక ప్రజ్ఞోపనిషద్ : ప్రథమ మండలం-5వ అధ్యాయం

# ఉదారభక్తి భావనా ప్రకరణం

**చతుర్థే దివసే తత్ర సంగతాఋషయః పునః ।**
**ఆరణ్యస్య సత్రేతు బ్రహ్మవిద్యాత్మకే ఒన్వహమ్ ॥ 01**

మరల నాలుగవరోజున ఋషులందరూ సమావేశమై, ఆరణ్యకములోని బ్రహ్మవిద్యాపరమైన విషయమును తెలుసుకోవలెనన్న ఉత్సుకతను కల్గి ఉన్నారు. బ్రహ్మ, ఆత్మ-విద్యలకు సంబంధించిన సంయమశీలత, కర్తవ్యపరాయణతకు సంబంధించిన జ్ఞానాన్ని పొందిన ఋషులు ఉదారభక్తి భావన అంశాన్ని తెలుసుకొనబోవుచున్నారు.

**ఋషయః పంక్తి బద్ధాస్తే పిప్పలాదస్య పూర్వవత్ ।**
**తత్త్వావధానే తత్త్వస్య వివేచనమభూత్ క్రమాత్ ॥ 02**

పిప్పలాదుని సమక్షంలో క్రమపంక్తిలో నిల్చిన ఋషులు గతంలోవలె తత్త్వావధానమునందు తత్త్వవివేచన క్రమమును తెలుసుకొనబోవుచున్నారు.

**సూక్ష్మబుద్ధి బలశ్చాద్య తార్కికః ప్రథమాసనే ।**
**ఉద్దాలకః స్థితో యస్యౌత్సుక్యమాసీన్మ హత్తమమ్ ॥ 03**

సూక్ష్మబుద్ధికలవారిలో ఆద్యుడు, తర్క విద్వాంసుడు అయిన ఉద్దాలకుడు మొదటివరుసలో కూర్చొనెను. అతనిలో ఆసక్తి, ఉత్సుకత స్పష్టముగా అగుపిస్తున్నాయి. ఇది జ్ఞాన సముపార్జనకు ముఖ్య లక్షణము.

**ఉద్దాలకుడు ఇట్లు పలికెను:**

**సమయోపయేగే యః ప్రోక్తో మహాభాగాత్ర కర్మణా ।**
**తత్రైకోదేవ సందేహః సర్వేషాం సముదేతి యత్ ॥ 04**

మహానుభావా! సమయాన్ని సద్వినియోగం చేయడంలో దానికి సంబంధించిన కర్మ విషయములో అందరికి సందేహము కలదు. ఆ సందేహమును నివృత్తి చేసుకొనగోరుచున్నాము.

**సమయక్షేపవల్లాభప్రాప్తిస్తు, తత్సమన్వయాత్ ।**
**కిమ్ భవిష్యద్యైతావన్మాత్రేణాత్మిక ప్రోన్నతేః ॥ 05**

సమయ సద్వినియోగంవల్ల కలిగే లాభము, ఆత్మకు సంబంధించిన ప్రగతి, విస్తారములతో సమన్వయము ఎట్లు జరుగునో తెలియకున్నది. కావున ఆత్మప్రగతి, విస్తారములు ఎట్లు సమన్వయమగునో వివరించప్రార్థన.

**కృతేత్వావశ్యకః స్యేత్స్యాత్మనో విస్తరః కథమ్ ।**
**సీమాబంధన మాత్రంతు నీయతేః కర్మ భాగ్యవత్ ॥ 06**

అహంకార విసర్జన తప్పనిసరిగా చేయవలసినప్పుడు దానిని ఎట్లు చేయవలెనో అవగతముకానివిషయము. కర్మను ఆచరించునపుడు "నేను", "నాది" అన్న విషయమును విస్మరించి, నిర్మమకారముతో ఆచరించు విధమును దయతో వివరించ ప్రార్థన.

**శృంఖలాయాంతు తస్యామాబద్ధా హేతునా సదా ।**
**అస్తవ్యస్తతాయాస్తదనౌచిత్యం నిరుధ్యతే ॥ 07**

అట్టి శృంఖలాలచే (బంధనాలచే) అడ్డగించబడుతున్న కారణంగా మానవజీవితం అస్తవ్యస్తమౌతోంది. జీవితం యొక్క ఔన్నత్యం (ఉన్నతస్థితి) నిరోధించబడుచున్నది. కావున ఈ శృంఖలాలనుండి విముక్తిని పొందేమార్గాన్ని తెలుసుకోగలగాలి.

**క్రమప్రాప్తానిదాయిత్వాన్యుచితం వోఢమేవతు ।**
**సంభవేయుస్తథాతస్యాం సీమాయాం యే స్థితః ప్రభో ॥ 08**

అటువంటి విముక్తి మార్గాన్నిచ్చే సీమ (స్థితి)లో, పారమార్థిక ప్రయోజనాన్ని పొందేవిధంగా, ఆటంకాలు, అవరోధాలు తొలగించుకుని, యదార్థ జీవితమును సాధించేస్థితిని చేరుకునే మార్గాన్ని వివరించగలరు.

**తరంగాః కథమాపూర్తిస్తేషాం కర్తుంతు సంభవేత్ ।**
**ఆత్మానం భక్తి భావేన విదధాత్యనుప్రాణితమ్ ॥ 09**

ఓ మహర్షి! లౌకికపరమైన బాధ్యతలు, బంధాలు, కోరికలు తరంగాలవంటివి. అవి ఆగడంకానీ, తొలగిపోవడం కాని జరగనిపని. అవి తొలగించిన తర్వాత పని పూర్తిచేద్దామను కోవడం అవివేకం. కాబట్టి వాటిని నిరోధించి, భక్తి భావముతో అహాన్ని విడిచి పరాన్ని కోరడం వంటి మార్గాన్ని సూచించగలరు.

**తదమృతం కథంపాతుం, శక్యతేతి సవిస్తరమ్ ।**
**సర్వసాధారణస్యాలం కల్యాణంయేన సంభవేత్ ॥ 10**

అటువంటి అమృతాన్ని ఎలా ఆస్వాదించగలం? ఆస్వాదించడం సాధ్యమేనా? సామాన్యుడు సైతం సర్వసాధారణ శక్తితో సౌభాగ్యాన్ని (లోకకల్యాణం ద్వారా) ఎలా పొందగలడు?

మానవమాత్ర పరిమితమైన శక్తితో ఇది సాధ్యమేనా? అన్న ప్రశ్నకు తగినరీతిలో సమాధానాన్ని ఉపదేశించ ప్రార్థితులు అని కోరెను.

– స్వేచ్ఛానువాదం : శ్రీ మారెళ్ళ కామరాజు

పర్యావరణ కాలుష్యానికి మూలం మానసిక కాలుష్యమే.

### యుగ గీత-8 : రెండవ అధ్యాయం-సాంఖ్య యోగము

# ఆసక్తి నుండి ఎలా విముక్తి పొందాలి?

క్రిందటి సంచికలో - స్థితప్రజ్ఞుని లక్షణాల గురించి భగవంతుడు అర్జునునికి మార్మికంగా వివరిస్తున్నారు. ఆత్మతో ఆత్మయందు సంతుష్టిడిగా ఉన్న సమయంలో సాధకుడు స్థితప్రజ్ఞుడనబడతాడు. సమస్త కోరికలనీ త్యజించి, బుద్ధిని స్థిరపరిచి, పరమాత్మలో అధిష్ఠితుడైన వాడే స్థితప్రజ్ఞుడు. తాబేలును ఉదాహరణగా చెపుతూ, ఎవరైతే ఇంద్రియాలను సంపూర్ణంగా బాహ్య విషయాల నుండి తప్పిస్తాడో, అతని బుద్ధి మాత్రమే స్థిరంగా ఉంటుందన్నారు. బాహ్య ఇంద్రియ రసాల నుండి తప్పుకుని, 'రసో వై సః' స్థితి, పరమాత్మలో స్థిరమైన స్థితికి చేరకపోతే అతని బుద్ధి స్థిరపడదు, ప్రజ్ఞావంతుడు కాదు. ప్రతిష్ఠిత ప్రజ్ఞ కలవాడు స్థితప్రజ్ఞుడు.

తరువాత -

**విషయా వినివర్తంతే నిరాహారస్య దేహినః**
**రసవర్జం రసోఽప్యస్య పరం దృష్ట్వా నివర్తతే** **2.59**

**అర్థం :-** ఇంద్రియముల ద్వారా విషయములను గ్రహింపనివాని నుండి ఇంద్రియార్థములు మాత్రము వైదొలగును. కాని వాటిపై ఆసక్తి మిగిలి ఉండును. స్థితప్రజ్ఞునకు పరమాత్మ సాక్షాత్కారమైనందున వాని నుండి ఆ ఆసక్తి గూడా తొలగిపోవును.

ఇది చాలా ముఖ్యమైన వ్యాఖ్య. విషయాలపట్ల ఆసక్తిని మనం కష్టపడి మనలోనుండి తొలగించుకోవాలి. శరీరంలో ఎంత కష్టతరమైనా తపస్సునైనా చేయవచ్చు. కాని మనస్సుకు విషయాల పట్ల ఆసక్తి ఉన్నంతవరకు ఆ తపస్సు కూడా నిరర్థకమే. మనం ఇంద్రియాలను నియంత్రించాలి. అందుకు మనలోని లోతుల్లోకి ఈ ప్రక్రియను ప్రవేశింపచేయాలి. మనస్సు, బుద్ధి, చిత్తం కన్నా లోతైన చోటు, పరమాత్మ చైతన్యం నివసించే శుద్ధ 'అహం'ని చేరాలి. అప్పుడు మనస్సు అశ్లీలంగా ఆలోచించడం మానేసి, వాస్తవిక సౌందర్యం వైపుకు ఆకర్షింపబడుతుంది, అదే పరమాత్మ స్వరూపం. అప్పుడు శారీరకంగానే కాక మానసికంగా కూడా సంయమనం దృఢమవుతుంది. పరమాత్మ చైతన్యం ఈవిధంగా దర్శించగానే స్థితప్రజ్ఞుడికి ఆసక్తి పూర్తిగా తొలగిపోతుంది.

కాని ఆసక్తి నశించకపోతే? భగవంతుడు ఆసక్తిని, 'ఎడిక్షన్' అంటున్నారు.

**యతతో హ్యపి కౌంతేయ పురుషస్య విపశ్చితః ।**
**ఇంద్రియాణి ప్రమాథీని హరంతి ప్రసభం మనః ॥** **2.60**

**అర్థం :-** ఓ అర్జునా! ఇంద్రియాలు ప్రమథన శీలములు. మనుష్యుడు వాటిని నిగ్రహించటానికి ఎంతగా ప్రయత్నించినా, ఆసక్తి తొలగిపోనంతవరకు అవి మనస్సును ఇంద్రియార్థములవైపు బలవంతంగా లాక్కునిపోవుచుండును.

ఈ ఆసక్తి బుద్ధిమంతుల మనస్సును కూడా బలవంతంగా హరిస్తూ ఉంటుంది. ఆత్మ సంయమనం లేని చోట ఎటువంటి సద్గుణాల వికాసం, రవ్వంత వ్యక్తిత్వ పరిష్కారం కూడా సాధ్యపడదు. అసంయమ వ్యక్తికి ఎటువంటి విద్య రుచించదు, తన సాంస్కృతిక వికాసానికి కూడా మొగ్గుచూపదు. ప్రబల పురుషార్థంతో నిర్మించుకున్న ఈ దైవమందిరాన్ని (మానవ శరీరం) విషయాల వెంటపడే మనస్సు పూర్తిగా ధ్వంసం చేస్తుంది. బుద్ధిమంతుడిగా కనిపించే వ్యక్తి కూడా విషయ ఉన్మాదాల ఆకర్షణలో మోహితుడై మూర్ఖంగా వ్యవహరిస్తుంటాడు. ఇక తక్కువ బుద్ధి, యోగ్యతలు కలవారి గురించి వేరే చెప్పాలా! సుంద-ఉపసుందుల గాథ, సముద్ర మథనం తర్వాత కాముకులైన అసురుల నుండి విష్ణుమూర్తి అమృతాన్ని రక్షించిన సంఘటన, భస్మాసురుని ఆత్మఘాతాల వల్ల ఇంద్రియాలు ఎంతగా మనస్సును భ్రమింపజేసి పాడుచేస్తాయో మనకు తెలియటం లేదా! స్టేజి మీద నిలబడి ఉపన్యాసం ఇవ్వడం సులువే - "ఇంద్రియాలను వశపరచుకోవాలి, నీవు సంయమనంతో వ్యవహరించాలి" అని. కాని జీవితంలో వీటిని అవలంబించుకునే విధానం, గీతలోని ఈ స్థితప్రజ్ఞుని ప్రకరణలో మాత్రమే లభ్యమవుతుంది. గీతలోని 2.60 వ శ్లోకం యొక్క తాత్పర్యానికి పోలుతూ మనువు కూడా ఒక శ్లోకం రాసాడు. అది -

**మాత్రా స్వస్రా దుహిత్రా వా న వివిక్తాసనో భవేత్ ।**
**బలవానింద్రియగ్రామో విద్వాంసమపి కర్షతి ॥**

**అర్థం :-** మనిషి తన తల్లి, చెల్లి, కూతురు విషయంలో కూడా జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే ఇంద్రియాలు ప్రబలమైనవి, అవి అవకాశం దొరికినప్పుడు విద్వాంసులను కూడా ఆకర్షిస్తూంటాయి. సామాజిక మర్యాదలతో జీవించే సాధారణ

**కోపతాపాలు శరీరంలోకి విష పదార్థాలను చొప్పిస్తాయి.**

మనుషులకై ఉద్దేశించి చెప్పబడినది ఈ శ్లోకం. గీతలోని వివరణ ఆధ్యాత్మిక దృష్టిలో ఒక పూర్ణ పురుషుడి కోసం ఇవ్వబడినది. అయినా మనిషి అవసరానికి మించి తనపై తాను కూడా విశ్వసించకూడదని ఇక్కడ ఆశయం. సాధకుడు ఇంద్రియాలను విషయాల నుండి మరల్చవచ్చు కాని వాటిని మనస్సుపై దాడి చెయ్యనివ్వకూడదు. సూక్ష్మ ఇంద్రియనిగ్రహంలో నిష్ణాతుడవ్వాలనేది గీతలోని ఉద్దేశం.

**తాని సర్వాణి సంయమ్య యుక్త ఆసీత మత్పరః ।**
**వశే హి యస్యేంద్రియాణి తస్య ప్రజ్ఞః ప్రతిష్ఠితా ॥ 2.61**

**అర్థం :–** కనుక సాధకుడు ఆ ఇంద్రియములను అన్నింటినీ వశమునందుంచుకుని సమాహితచిత్తుడై (చిత్తమును పరమాత్మ యందు లగ్నము చేసినవాడై) మత్పరాయణుడై ధ్యానమునందు కూర్చొనవలెను. ఏలనన ఇంద్రియములను వశము నందుంచుకొనువాని బుద్ధి స్థిరమగును.

సంకల్పశక్తితో బహిర్ముఖమైన మనస్సును అంతర్ముఖం చేసి పరమాత్మ చైతన్యంలో ప్రతిష్ఠించాలి, అందుకు ధ్యానాన్ని ఆశ్రయించాలి. పరమపూజ్య గురుదేవులు కూడా ఈవిధంగానే వ్రాసారు, 'మమ్మల్ని మేము పరమాత్మ చైతన్యం, సవితా దేవత యొక్క పాపనాశక భర్గతేజస్సులో అధిష్ఠించుకోవడం నేర్చుకున్నాం.' గాయత్రీ మాత సత్త్వగుణ ధ్యానంలో, తల్లి యొక్క అంగ ప్రత్యంగాలను ధ్యానిస్తూ, మాతృభావంతో ఆత్మబలాన్ని సంవర్ధింప చేసుకునే, 'జపంతో పాటు ధ్యానం' అనే ప్రక్రియలో ప్రార్థన చేయబడుతుంది. భగవంతుడు చాలా సార్లు, **'యుక్త ఆసీత మత్పరః', 'మన్మనాభవ మద్భక్తా'** అంటూ నిర్దేశిస్తారు. ఏదైనా రచనాత్మక ఉత్తమ లక్ష్యంతో మనసును జోడించి, ప్రబల ఇచ్ఛాశక్తితో పనిచేస్తే, 'ప్రమథనశీలమైన' ఇంద్రియాలను వశపరుచుకోవచ్చు.

ఇలా ఎందుకు చేయాలి? నిరంతరం విషయాల గురించి ఆలోచించే మనిషి యొక్క మనస్సు వాటిపై ఆసక్తిని పెంచుకుంటుంది. **"ధ్యాయతో విషయాన్ పుంసః సంగస్తేషూప జయాతే"** (2.62 పూర్వార్థము). మనస్సులో సజాతీయ ఆలోచనల వర్షపాతం కురుస్తూంటుంది. సకారాత్మకమైన (Positive), శ్రేష్ఠమైన ఆలోచనలైతే పరవాలేదు. అదే నకారాత్మకమైన (Negative), నికృష్టమైన వాసనాత్మక (కోరికల) ఆలోచనల ప్రవాహమైతే మనిషిని అవే రకమైన ఆలోచనలలో ముంచెత్తుతాయి. శ్రీకృష్ణుడు కూడా, **'ఆనోభద్రా క్రతవన్తో విశ్వతః'** అన్నారు. మన నిరంతరం విషయచింతనల పరిణామమే సాంసారిక విషయాల పట్ల ఆసక్తి. ఇది వృద్ధి అయినకొద్దీ దాని ప్రవాహగతిలో కోరుకున్న వస్తువు పొందాలనే భావనను కలిగిస్తుంది. 62వ శ్లోకంలోని ఉత్తరార్థములో స్పష్టంగా చెప్పారు – **'సంగత్సం జాయతే కామః కామాత్ క్రోధోభిజాయతే'**. ఆసక్తి వల్ల ఆ వస్తువు పట్ల కోరిక కలుగుతుంది. కోరిక తీరకపోతే క్రోధం కలుగుతుంది.

స్థితప్రజ్ఞుని గురించి తెలుసుకునే ముందు అసలు ఈ మార్గంలో పయనించాలంటే వచ్చే అడ్డంకులేమిటో తెలుసుకుని తీరాలి. కామేచ్ఛరూప ఆలోచనలు కుళ్ళితే క్రోధమనే కంపు బయటకొస్తుంది. అటువంటి మనిషి అనేక రకాల ఉచ్చుల్లో చిక్కుకుని చివరకి నాశనమైపోతాడు. కోరికకీ, కోరిక తీరటానికి మధ్య ఉన్న 'గ్యాప్' ని సత్సంగంతో, సత్‌చింతనతో పూరించగలిగితే ఇటువంటి దుర్గతి కలగదు. లోలోపల బాధపడడం, క్రోధం కనబరచడం, భయంకరమైన కోపం తెచ్చుకోవడం ఇవన్నీ స్థితప్రజ్ఞుని మార్గంలో వచ్చే ఇబ్బందులు. కోరికని అణుచుకోవడం వల్లనే 'స్ట్రెస్' లేదా మనోవికారాలు పుడతాయి. కోరికను భావనగా రూపాంతరం చేయగలిగితే, దానిని అణిచిపెట్టి క్రోధంగా మార్చకపోతే, ఆ ఒత్తిడి నుంచి కూడా తప్పించుకోగలము. భావనాశీలుడు తన ఆదర్శాల కోసం ఉన్నతమైన కార్యాలకే శక్తిని వినియోగిస్తాడు. క్రోధానికీ కోపానికీ తేడా ఉంది. ఇక్కడ భగవంతుడు కోరికని అణిచివేయడం వల్ల పుట్టే వినాశకరమైన క్రోధం గురించి వ్యాఖ్యానిస్తున్నారు.

**క్రోధాద్భవతి సమ్మోహః సమ్మోహాత్ స్మృతివిభ్రమః ।**
**స్మృతిభ్రంశాద్బుద్ధినాశో బుద్ధినాశాత్ ప్రణశ్యతి ॥ 2.63**

**అర్థం :–** అట్టి క్రోధముల వల్ల మూఢత్వం కలుగుతుంది. దాని ప్రభావమున స్మృతి చిన్నాభిన్నమవుతుంది. స్మృతి భ్రష్టమైనందుకు బుద్ధి అనగా జ్ఞానశక్తి నశించును. బుద్ధినాశము వలన మనుష్యుడు పతనమవుతాడు.

అర్జునుడి బుద్ధి మోహంలో చిక్కుకుంది. అందుకే వాసుదేవుడు ఈ విషయాలు చెప్పి అతన్ని ఆ మోహజాలం నుండి రక్షించాలని చూస్తున్నారు. బుద్ధి ఎలా నశిస్తుంది అనేది కూడా వారు పరోక్షంగా చెప్తున్నారు. దుర్యోధనుడు తన గురువులతోనూ, భీష్మపితామహునితోనూ క్రోధంతో **'జానామి ధర్మం న చ మే ప్రవృత్తి'** అన్న మాటలు తన వినాశానికి దారి తీసాయి. క్రోధం వల్ల మూర్ఖత్వం వస్తుంది. మనిషి క్రోధం వల్ల విద్వాంసుడని

**జీవితాన్ని సవాలుగా పరిగణించి ఆశావాదంతో విశ్వాసంతో స్పందించాలి.**

పిలవబడదు. చాలా మంది తమ క్రింది ఉద్యోగుల మీద, భార్య మీద, పిల్లల మీద క్రోధం ప్రదర్శిస్తే వారి పెద్దరికం నిలుస్తుందని భావిస్తారు. ఇది తప్పు. క్రోధం వినాశనానికి మూలం. మూర్ఖత్వం వల్ల స్మృతి నశిస్తుంది. మనం ఈశ్వరుని బిడ్డలం, యువరాజులం అనే విషయాన్ని మర్చిపోయాము, ఆ స్మృతిని కోల్పోయాము. మానవగరిమకు తగ్గట్టుగా జీవించడానికి పుట్టాము. కాని మనం భగవంతుని యువరాజులం, ఉత్తరాధికారులం, గొప్పవాళ్ళమనే విషయాన్ని మరచిపోయాము. ఈ విషయాన్ని మరచిపోయాం కాబట్టే నరపిశాచులలాగా, నరపశువులుగా వ్యవహరిస్తుంటాం. స్మృతి నశించగానే జ్ఞానశక్తి కూడా నశిస్తుంది, దాంతో మనిషి పతనమవుతాడు. రావణాసురుడి ఉదాహరణ ఇక్కడ చక్కగా సరిపోతుంది. తన కోరిక, తన కోపం క్రమంగా అతని పతనానికి ఎలా కారణమైందో అందరికి తెలుసు. అతను గొప్ప విద్వాంసుడు, పరాక్రమవంతుడు, సిద్ధపురుషుడు, శివుని వరాన్ని పొందిన గొప్ప తపస్వి అయినప్పటికీ నాశనం తప్పలేదు. బుద్ధి నశించడం వల్ల జరిగే పతనాన్ని ఆపి జాగ్రత్తగా మనిషి ఉన్నత స్థాయిలను అందుకోవడాన్నే ఆధ్యాత్మికం అంటారు. పడిపోవడం చాలా తేలిక, లేవడమే కష్టం. కాబట్టే ఆధ్యాత్మికాన్ని 'జీవితం యొక్క శీర్షాసనం' అన్నారు. ఈ శీర్షాసనం నేర్చుకున్నవారి జీవితం పండినట్టే. జీవించే కళను అతడు నేర్చుకుంటాడు. తనపై తాను అంకుశాన్ని పెట్టుకుని ఆసక్తిని దూరం చేసుకుని త్యాగమయ జీవితాన్ని జీవించడం నేర్చుకుంటాడు. ఇదే జీవించే కళ. మనం ఈ భూమి మీదకెందుకొచ్చాము అనే స్మృతి ఉంటే కదా బుద్ధి నాశనమవకుండా ఉండడానికి. మనం వచ్చింది ఈ భూమిని మరింత అందంగా తీర్చిదిద్ది, విశ్వమానవునికి సేవ చేయడానికే కాని భూమిని నాశనం చేసి మానవజాతిని పీడించడానికి కాదు. మనమందరమూ ఎన్నో జన్మలనుండి పరమపూజ్య గురుదేవుల శిష్యులమయ్యే సౌభాగ్యం కలిగింది అనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఎన్ని సార్లు వారి విరాట్ ప్రణాళికలో మనం భాగస్వామ్యం పంచుకున్నామో ! దేవతలలాగే మన భూమిక కూడా ఉంది. ఈ విషయాన్ని మర్చిపోయి ఎదుగుదలకి బదులు పతనమయ్యే కార్యకలాపాలలో నిమ్నగమవ్వట్లేదు గదా! కాబట్టి మళ్ళీ మళ్ళీ ఈ ఆలోచన, ఆత్మావలోకనం చేసుకుంటూ, మనకి మనమే గుర్తుచేసుకుంటూ ఉండడం చాలా అవసరం.

వివేకంలోనే మనిషి గొప్పతనం ఉంది. మనిషికీ, పశువుకీ తేడా, అతని వికాసానికి కారణం కూడా వివేకశక్తి అంటే బుద్ధి; అదీ ఋతుంభర స్థాయిది. ఇది పనిచేయడం మానేస్తే అతని వినాశనం తప్పదని అర్థం చేసుకోవాలి. ఆసక్తి నుండి కోరిక, కోరిక తీరకపోతే క్రోధం, క్రోధం నుండి మోహం, ఆపై స్మృతి కోల్పోవడం, చివరికి వివేకం నశించడం అందుకే గీతాచార్యుడు మాటిమాటికీ ఆత్మసంయమనం గురించి నొక్కి నొక్కి చెప్తూంటాడు.

మనిషి తన అంతఃకరణాన్ని అదుపులో ఉంచుకుంటే వివేకంతో ఆసక్తిరహితంగా కర్మలు చేస్తే బాధలన్నీ పోతాయి, బుద్ధి పరమాత్మలో స్థిరపడుతుంది అని తరువాతి రెండు శ్లోకాల సారం. సంయమనం లేని వాడి పరిస్థితి ఏంటో చూసాక, అంతఃకరణ ప్రసన్నత, దుఃఖనివృత్తి కావాలంటే కోరికలని, ఆసక్తిని నియంత్రించుకోవడం నేర్చుకోవాలి. **నిరంతరం శాంతస్థితిలో ఉండడమే స్థితప్రజ్ఞుని గొప్పతనం.** అతని భావనలు ఎప్పటికీ ఆసక్తిగా మారవు కాబట్టే సుఖాన్ని పొందుతాడు. 66వ శ్లోకంలో, ఇలా ఉండనివాడు సంతోషాన్ని పొందడని చెప్తున్నారు. తరువాత శ్లోకంలో – మనిషిని ముంచేయడానికి, భవసాగరంలో తోసేయడానికి అన్నీ అక్కర్లేదు, ఒక్క ఇంద్రియం చాలు అని సోదాహరణంగా చెప్తున్నారు. అతి మహత్వపూర్ణమైన ఈ శ్లోకం యొక్క వ్యాఖ్యానం వచ్చే సంచికలోని యుగగీతలో చూద్దాం.

*– అఖండజ్యోతి, డిశంబరు 1999*

*అనువాదం : శ్రీమతి జయలక్ష్మి*

## విల్సన్ దీక్ష

*ఈస్టిండియా కంపెనీ విలియమ్ విల్సన్‌కు టంకశాల అధ్యక్ష పదవివచ్చింది. పదవి గొప్పది కాని పని తక్కువ కావడం వల్ల ఖాళీ సమయంలో ఈయన భారతీయ సంస్కృతిని లోతుగా అధ్యయనం చేశారు. సమస్త మానవులకు దీనిని అందించాలని అనువదించే మహత్కార్యానికి పూనుకున్నాడు. అనేకమంది మహా పండితులను సలహా సంప్రదింపుల కొరకు కలువవలసి వచ్చేది. ఈయన వేదానికి భాష్యం వ్రాశారు. ఇది వారి శిష్యుడైన మేక్స్ ముల్లర్ పేరుతో ప్రచురింపబడ్డది. ఈ మహా గ్రంథం యూరప్‌లో ఒక మహా సంచలనాన్ని తీసుకొని వచ్చింది. జీవితం తుది ఘడియ వరకు ప్రాచీన భారతీయ సాహిత్యాన్ని అనువదిస్తూ, ప్రచురిస్తూ లభించిన జీవిత కాలాన్ని సద్వినియోగం చేశారు. ఖాళీ సమయం దొరికితే చాలు దానిని మంచి పనులలో సద్వినియోగం చేయడంలో విల్సన్‌కు సాటి మర్వెరూ ఉండరని చెప్పవచ్చు.*

– ప్రజ్ఞా పురాణం నుండి

**ఆశావాదులు ఆరోగ్యంగా, ఆనందంగా జీవిస్తారు.**

సూర్య విజ్ఞానం - 7

# ప్రాణతత్వ మహా సాగరం - సవితా దేవత

పదార్థములో మార్పును తీసుకుని వచ్చే, ప్రాణులలో ఆలోచింపజేసే శక్తి ఒకటి ఉన్నదని విజ్ఞానవేత్తలు కనుగొన్నారు. ఈ మూలశక్తి వలననే నిశ్చేష్టంగా పడివున్న వాటిని చైతన్యవంతముగా చేసే, నిస్తేజంగా ఉన్న వానిని సక్రియం చేసే (activate) సామర్థ్యం కలుగుతుంది. వస్తువుల, ప్రాణుల రకరకాల క్రియాకలాపాలతో దీనికి సంబంధం ఉన్నది. కంటికి కనిపించే, కంటికి కనిపించని రెండు క్షేత్రముల మూలములలో ఈ తత్వమే క్రియాన్వితమై ఉన్నది. వైజ్ఞానికుల దృష్టిలో ఈ జడచేతన స్థాయిలలో ఉన్నటువంటి సామర్థ్యం పేరు ప్రాణం. పదార్థమే అంతా ఇంకేమి లేదనుకునేవారు దీనిని గ్రావిటీ (ఆకర్షణ), ఈథర్, మాగ్నెట్ (అయస్కాంత) రూపంలో చెప్తుంటారు. చేతనత్వం యొక్క స్వతంత్ర అస్థిత్వాన్ని గుర్తించిన వారు దీనిని "సైకిక్ ఫోర్సు" గా "లేటెంట్ హీట్" గా చెప్తారు.

ఋషులు ఈ తత్వాన్ని లోతుగా శోధించి దీనిని చేతనత్వం యొక్క జీవనీశక్తిగా గుర్తించారు. జీవనం యొక్క సారం ప్రాణం. ఇదే ప్రగతికి ఆధారం. సమృద్ధి దీనితోనే సాధ్యమవుతుంది. సిద్ధుల, విభూతుల ఉద్గమ స్థానం ఇదే. ఈ ప్రాణశక్తే మనలోపల అధిక పరిణామంలో ఉన్నది. దీని ఆకర్షణతత్వం పెంచుకుని విశ్వప్రాణం నుండి కూడా కావలసినంత ప్రాణశక్తిని పొందవచ్చు. మానవ శరీరంలో ఈ ప్రాణ భాండాగారం నిద్రాస్థితిలో పడి ఉంటుంది. ఇది శారీరిక నిర్వహణకు మాత్రమే ఉపయోగపడుతున్నది. దీనిని సాధనాత్మక విజ్ఞానంతో జాగృతం చేసుకుంటే సామాన్యుడు అసామాన్యుడుగా మారతాడు.

ఋషుల, వైజ్ఞానికుల యొక్క పరిశోధనలలో అంతరం ఉన్నప్పటికి వీరందరు ప్రాణతత్వ ఉద్గమకేంద్రం సూర్యునిగా భావించారు. 1973 ఆగస్టులో అమెరికాకు చెందిన విఖ్యాత పత్రిక "న్యూసైంటిస్ట్" లో జీవ విజ్ఞానవేత్తలు డా॥ ఫ్రాన్సిస్, డా॥ క్రిక్, డా॥ వెస్లి తమ తమ పరిశోధనా ఫలితాలు ప్రకటిస్తూ విశ్వంలోని జీవన ప్రాణ స్పందన సూర్యుని నుండే వస్తున్నదని అన్నారు. ఆధునిక శాస్త్రవేత్తలు ప్రాణతత్వంలోనికి ఇంతకన్నా లోతుగా పోయి పరిశోధించలేకపోయారు. కాని భరతభూమి యొక్క పురాతన వైజ్ఞానిక తత్వదర్శులైన ఋషులు ఈ రహస్యమయిన ప్రాణ విద్యను ఆవిష్కరించారు. దీని ఆధారంగా చేయబడే సాధన వ్యక్తిలో అలౌకిక క్షమతల, సామర్థ్యములను వికసింపజేస్తుంది.

ప్రాణతత్వ పరిశోధనలలో నిమగ్నమైన ఋషులు సుంకేశ్, సత్యకామ, గార్గి, కౌసల్య, వైధర్మి, కబంధి పిప్పలాదుని వద్దకు వెళ్లారు. వారి జిజ్ఞాస ఒక్కటే. ప్రాణం ఎక్కడి నుండి ఉద్భవిస్తుంది. దానిని సమాధానం చెప్తూ పిప్పలాదుడు గంభీర స్వరంతో ఇలా అన్నాడు.

**ఆదిత్యోః హ వై ప్రాణో రయిరేవ చంద్రమా రయిర్వా।**
**ఏతత్సర్వ యన్మూర్తి చామూర్తచ తస్మాన్మూర్మితిరేవ రయిః॥**

**అథాత్య ఉదయన్ప్రతీ దిశాం ప్రవిశతి తేన ।**
**ప్రాచ్యాన్ ప్రాణాన్ రశ్మిషు సంవిధత్తే ॥**

**యుద్దక్షిణామ్ సహస్రరశ్మి శతధా వర్తమాన**
**ప్రాణః ప్రజానాం ముదత్యేష సూర్యః**
**- ప్రశ్నోపనిషత్తు 1-5-8**

నిశ్చయముగా ఆదిత్యుడే ప్రాణం. చంద్రుడు రయి (रयि). అన్ని స్థూల సూక్ష్మ మూర్తముల (రూపొందించబడినవి) అమూర్త (రూపొందించబడనివి) రయి యే. ఏ సమయంలో తూర్పుదిశలో ఉదయించే సూర్యుడు ప్రవేశిస్తాడో దానితో తూర్పు దిశలోని సర్వత్ర వ్యాపించి ఉన్న ప్రాణాలలో తన కిరణాలను ప్రవేశపెడతాడు. ఇదే ప్రకారంగా అన్ని దిశలలో ఆయన ఆత్మభూతం గావిస్తాడు. ఆయనయే భోక్త కావడం వల్ల వైశ్వానర విశ్వరూప ప్రాణం అగ్ని రూపంలో వ్యక్తమవుతాడు. ఆయన సర్వజ్ఞాన సంపన్నుడు. సమస్త ప్రాణులకు ఆశ్రయదాత సూర్యుడే. ప్రజలందరికి తండ్రి.

సూర్యుని ద్వారా ప్రస్ఫుటితమయ్యే మహాప్రాణం పరబ్రహ్మ పరమాత్మ యొక్క ఒక అంశం. దానితో విశ్వబ్రహ్మాండ సంచాలన జరుగుతుంది. ఒకటి నుండి అనేకం కావాలనే బ్రహ్మదేవుని సంకల్పమే మహాప్రాణమయి వచ్చింది. ఈ ప్రాణప్రవాహం ఎప్పటివరకు ప్రవహిస్తూ ఉంటుందో అప్పటి వరకు సృష్టి ఉంటుంది. ఏ రోజయితే భగవంతుడు ఈ సంకల్పాన్ని వెనుకకు తీసుకుంటాడో, ఆ మహాప్రాణం శాంతిస్తుంది. మహాశూన్యం తప్ప మరేమి ఉండదు. పరమాత్మ అనంతం ఆయన సత్తా అపరిమితం. అట్టి అపరిమితమైన, అనంతమైన, అచింత్యమైన (ఆలోచనలకు అందని) పరమాత్మ యొక్క అంశమైన మహా ప్రాణమే సమస్త ప్రక్రియలను క్రమపద్ధతిలో ఉంచుతుంది. ఈ మహాప్రాణాన్నే

**నిరాశావాదులు విషమ సమస్యలతో కొట్టుమిట్టాడుతుంటారు.**

సూర్యుని యొక్క ఆత్మగా, సవితా దేవతగా అర్థం చేసుకోవాలి. ప్రాణుల, జీవధారుల సంబంధం దీనితోనే ఉన్నది.

జీవితం యొక్క బాహ్య, అంతరంగ సువ్యవస్థ కొరకు, ప్రగతి కొరకు, శాంతి కొరకు మహా ప్రాణాన్ని అధికంగా పొందటమే ప్రాణులకు చేయవలసినది. దీనికొరకు సవితా దేవత ఉపాసనను ప్రాణవిద్య ద్వారా చేయాలి. ఈ ప్రక్రియతో సూర్యుని ఆత్మ అయిన సవితా శక్తితో ఉపాసకునికి సంబంధం ఏర్పడుతుంది. దీని ద్వారా మహా ప్రాణమును తన శరీరంలో, అంతఃకరణలో తగినంతగా పొంది లౌకిక సుఖములను, ఆత్మిక శాంతిని పొందుతాడు. జీవనం యొక్క పరమ లక్ష్యమును ప్రాప్తించుకుంటాడు.

ఈ మహాప్రాణం శరీరంలో అధికంగా ఉన్నప్పుడు ఆరోగ్యం, ఆయువు, తేజస్సు, ఓజస్సు, బలము, ఉత్సాహం, స్ఫూర్తి, పురుషార్థం ఇంద్రియాలలో తొణికిసలాడతాయి. ఈ మహా ప్రాణం మనోక్షేత్రంలో ఉల్లాసం, సాహసం, ఏకాగ్రత, ధైర్యం, సంయమము మొదలైన సద్గుణాల రూపంలో కనిపిస్తుంది.

ఈ మహాప్రాణం ఆధ్యాత్మిక క్షేత్రంలో అవతరించినపుడు త్యాగం, తపస్సు, శ్రద్ధ, విశ్వాసం, దయ, ఉపకారం ప్రేమ, వివేకం మొదలైన రూపాలలో కనిపిస్తుంది. ఈ మూడు క్షేత్రాలలో మహాప్రాణం ఎంతగా నిండుగా ఉంటే మనిషి అపూర్ణత్వం నుండి పూర్ణత్వం వైపు, తుచ్ఛుడు మహానత (ఉన్నతి) వైపు ఎదుగుతాడు.

శ్రుతులలో ప్రాణమును ప్రత్యక్ష బ్రహ్మగా భావించి ఇలా కీర్తించారు.

**వాయోత్వం ప్రత్యక్ష బ్రహ్మోసి (ఋగ్వేదం)**

హే ప్రాణవాయువా! నీవే ప్రత్యక్ష బ్రహ్మవు.

**ప్రాణాయానమో యస్య సర్వ మిదం వశే యో భూతః సర్వస్యేవరో యస్మిన్త్సర్వం ప్రతిష్ఠితం (అధర్వవేదం)**

ఏ ప్రాణం యొక్క వశంలో అన్ని ఉన్నాయో, ఏ ప్రాణంలోనే అన్ని ఉన్నాయో ఆ ప్రాణానికి నమస్కారం.

ఉపనిషత్తులలో కూడా ఇలాంటి వర్ణనే ఉన్నది.

**ప్రాణో భవేత్ పరబ్రహ్మ జగత్కారణమవ్యయం ।**
**ప్రాణో భవేత్ తథా మంత్ర జ్ఞాన కోశ గతోఽపివా ॥**
**– బ్రహ్మోపనిషత్తు**

ప్రాణమే జగత్తుకు కారణమైన పరబ్రహ్మ. మంత్రజ్ఞానం పంచకోశ ప్రాణముల మీద ఆధారపడి ఉన్నది.

**ప్రాణాగ్నయ ఏ వాస్మిన్ బ్రహ్మ పురే జాగ్రతి**
**– ప్రశ్నోపనిషత్తు**

బ్రహ్మపురిలో ప్రాణాగ్నులే ఎల్లప్పుడు జ్వలిస్తుంటాయి. ఆరణ్యకములయందు, బ్రాహ్మణములలో ప్రాణమును ప్రజ్ఞా, ఆయువు, అమృతంగా చెప్పబడింది.

**ప్రాణో ఽస్మి ప్రజ్ఞాత్మా తం భామా యుర మృత**
**భిత్యు పాస్వా ఽఽయుః ప్రాణాః ప్రాణోవా ఆయుః ।**
**యదాదర్శి ఉచ్ఛరీరే ప్రాణో వసతి తావదాయు ః**
**ప్రాణేన హి ఏ వాస్మిన్ లోకే మృత్యమాప్నోతి**
**– శాంఖాయన ఆర్యణ్యక 5-2**

నేను ప్రాణరూపమైన ప్రజ్ఞను. నన్నే ఆయువుగా తెలుసుకుని ఉపాసన చేయాలి. ఎప్పటివరకు ప్రాణం ఉంటుందో అప్పటివరకు జీవనం ఉంటుంది. ఈ లోకములో అమృతత్వానికి ఆధారం ప్రాణమే.

**అమృతో వై ప్రాణః – శతపథ 9-1-2-32**

ప్రాణమే నిశ్చిత రూపమున అమృతము

సప్త ప్రాణములే సప్త ఋషులు. సప్తఋషుల జ్ఞానము, తపస్సు, ఆధ్యాత్మిక బలము ప్రాణశక్తి యొక్క ప్రతీకలుగా భావించబడ్డాయి. ఈ ఋషులు సప్తప్రాణముల రూపంలో మనలో ఉన్నారు. ప్రాణవిద్య ద్వారా వీనిని అంతఃకరణలో జాగృతం చేసి సాధకుడు ఋషి కాగలడు.

ఐతరేయ బ్రాహ్మణములో హిరణ్యద అనే పేరుగల ఋషి ప్రాణం యొక్క స్వరూపాన్ని తెలుసుకుని ఉపాసించాడు. ఫలస్వరూపంగా అతనికి చాలా సత్పరిణామాలు ప్రాప్తించాయి. మంత్రద్రష్ట ఋషుల ఋషిత్వం శరీరంపై ఆధారపడక ప్రాణం మీద ఆధారపడి ఉన్నది. అందువలన విభిన్న ఋషుల పేర్ల మీద ఇది చెప్పబడింది. ఇంద్రియాల నియంత్రణను 'గృత్స' అంటారు. కామదేవుని మదము అంటారు. ఈ రెండు పనులు ప్రాణశక్తి ద్వారా జరుగుతాయి. అందుకే 'గృత్సమద' అంటారు. నమస్కరించ దగిన, సేవచేయదగిన, భజింపదగిన, శ్రేష్ఠమయినందువలన వామదేవునిగా చెప్పబడింది.

**సర్వ పాప్యనో ఽత్రాయత ఇతి అత్రి :** అందరిని పాపం నుండి రక్షిస్తుంది. అందువలననే అది అత్రి. శరీరానికి పాలన, పోషణ ఇస్తున్నందువలన భరద్వాజుడే అది. విశ్వంలో శ్రేష్ఠుడుగా, విశిష్ఠునిగా అవడం వల్ల వశిష్ఠుడు కూడా ఇదే. ఈవిధముగా ప్రాణముల పేర్లు ఋషినామాలు అయ్యాయి.

**ప్రాణా వా ఋషయః ఇమో ఏవ గౌతమ భరద్వాజో । అయమేవ గౌతమః అయం భరద్వాజః ఇమో ఏవ విశ్వామిత్ర జమదగ్నిః । అయమేవ విశ్వామిత్రః అయం జమదగ్నిః ।**

ప్రయత్నంతో ఆలోచనలను ఆశాజనకంగా మార్చుకోవచ్చు.

**ఇమోఏవ వశిష్ఠ కశ్యపౌ । అయమేవ వశిష్ఠః అయం కశ్యపః వాగే వాత్రిః ।**

సప్తప్రాణములే సప్తఋషులు. రెండు చెవులు గౌతమ భరద్వాజులు. రెండు కనులు విశ్వామిత్ర జమదగ్నులు. రెండు నాశికలు వశిష్ఠ కశ్యపులు ఏడవది అయిన వాక్కు అత్రి.

ఈ ఏడు ప్రాణముల ఆధారం మహాప్రాణం అయిన సవితా దేవతయే. ఈ సవితా ఆరాధన వలన ఋషిత్వం లభిస్తుంది. వ్యక్తిత్వాన్ని ఇనుమడింపజేస్తాయి. ఈ తత్వాన్నే శాస్త్రములలో అనేకచోట్ల వివరంగా స్పష్టంగా చెప్పబడింది.

**ప్రాణో వై అర్కః - శతపథ 10-4-7-23**

ప్రాణమే సూర్యుడు.

**స ఏష వైశ్వానరో విశ్వరూపః ప్రాణే ఽగ్ని రుదయితే**
**- ప్రశ్నోపనిషత్తు 1-7**

సూర్యోదయంతోనే విశ్వమున ప్రాణాగ్ని సంచారం మొదలవుతుంది.

**యో ఽ సౌ తపః న్నుదేతి స సర్వేషాం భూతానం ప్రాణానాం దాయోదేతి**

ఈ సూర్యుని నుండి యే సర్వప్రాణులకు ప్రాణం లభిస్తుంది.

**స ఏష వైశ్వానరో విశ్వరూపః ప్రాణాగ్ని రుదయతే**

ఈ ప్రాణమే సర్వవ్యాపకమైన అగ్నిరూపంలో ప్రకటించబడుతుంది.

**ఆదిత్యో వై బాహ్య ప్రాణ ఉదయత్యేష ద్యేనం చాక్షుష ప్రాణామనుగ్రహణీతే - ప్రశ్నోపనిషత్తు 1-7**

బాహ్యజగత్తు యందు ఈ ప్రాణమే ఆదిత్యుని రూపంలో దశదిశలలో వెలుగొందుతున్నది.

**విశ్వరూపం హిరిణిం జాతవేద సం**
**పరాయణం జ్యోతిరేకం తపన్తమ్**
**సహస్ర రశ్మిః శతధా వరమానః**
**ప్రాణాః ప్రజానామదయత్యేష సూర్యః - శతపథం**

విశ్వరూపుడై, వ్యాపకుడై, సర్వధారుడై, ప్రకాశవంతుడై, తప్తకిరణుడైన, సహస్ర కిరణములు కలవాడైన ఈ సూర్యుడు సమస్త జీవులకు ప్రాణముగా ఉదయిస్తాడు.

**సూర్యాద భవన్తి భూతాని సూర్యేణ పాలితాని తు**
**సూర్యేలయం ప్రాప్నువంతియః సూర్యః సో ఽహ మేవ చ**

సూర్యుని నుండి అన్ని ప్రాణులు ఉత్పన్నమవుతాయి. సూర్యునిచే పరిపాలింపబడతాయి. సూర్యునిలో లయం అవుతాయి. ఎవరు సూర్యుడో అతనే నేను.

గాయత్రి యొక్క దేవత సవితా. సూర్యుడు విశ్వంలోని జ్ఞాన విజ్ఞాన కేంద్రం. అన్య సమస్త దేవశక్తుల కేంద్రం కూడా ఇదే. నాలుగు వేదములలో ఉన్నదంతా కూడా సవతా శక్తి యొక్క వివేచన మాత్రమే. తపస్సు, శ్రద్ధ, సాధన ద్వారా యోగి వీటిని ప్రాప్తించుకునేందుకు ప్రయత్నిస్తుంటాడు. దేవతల నామం, రూపం నచ్చినట్లుగా ఎన్నుకున్నప్పటికి సవితా దేవతయే అందరి ఉపాస్య దేవత. సవితా దేవతను ప్రాప్తించుకునేందుకు ప్రతిసాధకుడు ప్రయత్నశీలుడవ్వాలి.

**ఉద్యంతం వాదిత్యామగ్నిసు సమారోహతి**
**సుషమ్నః సూర్యరశ్మిః చంద్రమ గంధర్వః**

సూర్యునిలో అంతర్గతంగా అగ్ని, సుషుమ్న, చంద్రుడు, గంధర్వులు మొదలైన దేవతలు ఉన్నారు.

**అథోత్తరేణ తపసా బ్రహ్మచర్యేణ శ్రద్ధయా**
**విద్యయాత్మా నమన్విష్యాద్రిస్యమభి జయన్తే ఏతద్వై**
**ప్రాణానామాయ తనమేతదమృతమమతమే తత్పరాయణ**
**మేతస్యాన్ని పునరావర్తంత ఇత్యేష నిరోధః**

తపస్సు, బ్రహ్మచర్యం, శ్రద్ధ విద్య ద్వారా ఏ ఆత్మను అన్వేషించి ఆదిత్యుని ప్రాప్తించుకుంటారో వారు మరల జన్మించరు. ఆదిత్యుడే ప్రాణులకు ఆశ్రయము. ఆయనయే మోక్షము. ఆయనయే పరమపదము. జీవునకు ఆయనయందే పరమ ఆశ్రయం లభిస్తుంది.

**భవద్భూతం భవిష్యం చ జంగమం స్థావరం చయత్ ।**
**అస్యైకం సూర్యర్మేవైకం ప్రభవం ప్రళయం విదుః ॥**

**అసతశ్వ సతశ్చైవ యోనిరేషా ప్రజాపితః ।**
**తదక్షరం చావ్యయం చ యచ్చైతద బ్రహ్మశాశ్వతమ్ ॥**

**కృత్వైవహి మిధాత్మాన్నేషు లోకేషు తిష్ఠతి ।**
**వేదాన్ యధాయథం సవని నివేశ్య స్వేషు రశ్మిషు ॥**
**- సూర్యోపనిషత్తు**

ప్రపంచంలో ఇప్పుడు ఉన్న జడచేతన పదార్థములు భూతకాలంలో ఉన్నాయి, భవిష్యత్తులలో కూడా ఉంటాయి. ఇవన్నీ సూర్యుని నుండి ఉత్పన్నమయినవే, తిరిగి సూర్యునిలోనే లీనమవుతాయి. ఈ సూర్యుడే ప్రజాపతి. ఇదే సత్, అసత్‌ల యోని. అక్షర, అవ్యయ, శాశ్వత బ్రహ్మ ఈయనే. సూర్యుడు మూడు లోకములలో వ్యాపించి ఉన్నాడు. సమస్త దేవతలు సూర్యుని కిరణములే.

**చేస్తున్నపని పట్ల ఇష్టాన్ని పెంచుకోవాలి.**

**ఆదిత్యోహ్యాది ధూతత్వాత్ ప్రసూత్యా సూర్య ఉచ్యతే**
**పరం జ్యోతిః తమః పారే సూర్యో ఽయం సవితేతి చ**
**– సూర్య సిద్ధాంతం**

ఆయన సమస్త జగత్తుకు ఆదికారణము. అందువలననే ఆయనను ఆదిత్యుడంటారు. అన్నింటిని ఉత్పన్నం చేస్తున్నందువల్ల సవిత అని అంటారు. అంధకారాన్ని దూరం చేస్తాడు. అందువలన సూర్యుడని పిలువబడుతున్నాడు.

**అథాదిత్య ఉదయంత ప్రాచీ దిశం ప్రవిశత్ తేన ప్రచ్యాన్ ప్రాణాన్ రశ్మిషు సంనిధత్తే। యద్దక్షిణాలయత్ ప్రతీచీ యదుదీచీ యదధో యదుహర్ధ యదన్తరా దిశో యత్సర్వ ప్రకాశయతి తేన సర్వాన్ ప్రాణాన్ రశ్మిషు సంనిధత్తే – ప్రశ్నోపనిషత్తు**

తూర్పున సూర్యోదయం అవుతుంది. సూర్యుడు తన కిరణములతో తూర్పు, పడమర, ఉత్తరం, దక్షిణం క్రింద, పైన అన్ని దిశలను ప్రకాశింపజేస్తాడు. సూర్యుని కిరణములతో సమస్త జగత్తు యొక్క ప్రాణధారణ జరుగుతుంది.

**అపస్యం గోపాయమని పద్యమాన్**
**మాచ పరాచ పథిభిశ్చరన్తమ్**
**స సఽశాచీః స విషుచీర్వసాన**
**అనరీవర్తి భువనేష్వన్తః – ఐతరేయం**

నేను ప్రాణాన్ని చూచాను. సాక్షాత్కరించుకున్నాను. ఆ ప్రాణం అన్ని ఇంద్రియాలను రక్షిస్తుంది. అది ఎన్నటికి నశించదు. అది శరీరంలోని నాడులలో పరిగెత్తుతూనే ఉంటుంది. నోరు, నాసికల ద్వారా అది వస్తూపోతూ ఉంటుంది. అది శరీరంలో వాయు రూపంలో, బ్రహ్మాండంలో సూర్యుని రూపంలో ఉన్నది.

**తేన సంస్కార చక్రే ఽస్మిన్ భ్రమతీత్యేవ సర్వదా ।**
**తదర్థం యే ప్రవర్తంతే యోగినః ప్రాణధారణే ॥**

**తత ఏవాఖిలా నాడీ నిరుద్ధాచాష్ట వేష్టనమ్ ।**
**ఇయం కుండలినీ శక్తి రంశ్రీంత్యజతి నాన్యథా ॥ – గోరక్ష**

ఈ శక్తితోనే జీవధారి ప్రపంచంలో జీవనయానం చేస్తాడు. దీనితోనే యోగులు దీర్ఘ ఆయుర్దాయాన్ని ప్రాప్తించుకుంటారు. ప్రాణం వల్లనే ఇంద్రియాలు శక్తివంతంగా ఆరోగ్యంగా ఉంటాయి. ప్రాణంలోనే నాడులు శుద్ధమవుతాయి. కుండలిని శక్తి జాగృతమవుతుంది.

దీనికి సంబంధించిన ఒక అత్యంత మహత్వపూర్ణమైన విజ్ఞానమున్నది. సూర్యసాధనలో ఈ విజ్ఞానాన్ని నేర్చుకోవచ్చు. గాయత్రీ మహామంత్రం సూర్యుని రహస్యమైన ప్రాణవిద్యే. దీనిద్వారా ప్రాణశక్తిని పెంపొందించుకోవచ్చు. దీని రహస్యాలను తెలుసుకోవచ్చు. ఎవరైతే ప్రాణశక్తిని పెంపొందించుకుంటారో వారి నలుప్రక్కల జాగృతియే జాగృతి. అన్ని దిశలలో వెలుగే వెలుగు. ప్రాణశక్తి నిద్రిస్తున్నవాడు నిద్రిస్తూంటాడు. ఎవరి ప్రాణశక్తి మేలుకొని ఉన్నదో అతనే మెలకువగా ఉన్నాడని భావిస్తారు. అతనికి విశ్వం యొక్క రహస్యాలు అవగతమవుతాయి.

**తదాహు కోస్వప్నుమర్హతి యద్వావ ।**
**ప్రాణో జీగార తదేవ జాగారితమ్ ఇతి ॥**
**– తాండ్య 10-4-4**

ఎవరు నిద్రపోతున్నారు? ఎవరు మెలకువగా ఉన్నారు? ఎవరి ప్రాణం జాగృతం అయిందో అతడే మెలకువగా ఉన్నట్లు.

**య ఏవం విద్వాన్ ప్రాణం వేద రహస్య ప్రజా**
**ఈయతే ఽమృతో భవతి తయేవ శ్లోకః**
**– ప్రశ్నోపనిషత్తు 3-11**

ఏ విద్వాంసుడు సవిత యొక్క ప్రాణ విద్య రహస్యమును తెలుసుకుంటాడో అతను అమరుడవుతాడు.

నిశ్చయముగా సవితా ఆరాధన ద్వారా ప్రాణము యొక్క జ్ఞానం, జాగరణే అమృతత్వాన్ని, మోక్షాన్ని ప్రాప్తించుకునే మార్గం. అతని వలన ఈ లోకం, పరలోకం చక్కదిద్దబడతాయి. దీనివల్ల భౌతిక, ఆధ్యాత్మిక విభూతులు ప్రాప్తిస్తాయి.

*– అఖండజ్యోతి, జూన్ 1993*

## గాయత్రీ పరివార్ పరిజనులకు విజ్ఞప్తి

*యుగఋషి వేదమూర్తి పరమపూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్యవర్యులు అనేకమార్లు తనను తన సాహిత్య మాధ్యమము ద్వారా ఇంటింటికి చేర్చమని విజ్ఞప్తి చేసియున్నారు. యుగపరివర్తన–సత్యయుగ పునరాగమనము ఆనాడే సుసాధ్యం కాగలదు అని సెలవిచ్చిరి.*

*పై విజ్ఞప్తిని పురస్కరించుకొని జన్మశతాబ్ది వేడుకల సందర్భముగా మీ, మీ కుటుంబ సభ్యులు మరియు బంధు మిత్రుల వివాహ మరియు జన్మదినముల వేళ, ఒక్కొక్కరు 5గురు యుగశక్తి గాయత్రి పత్రికకు చందాదారులను చేర్పించ మనవి. ఇదియే నిజముగా మనము చెల్లించెడి గురుదక్షిణ. ఈ క్రింది చిరునామాకు మీ చందాను పంపించమనవి. (మీ పేరు చిరునామా పిన్‌కోడ్‌తోసహా ఫోన్ నం. వ్రాసి పంపించగలరు).*

*మా చిరునామా :*
**గాయత్రీ చేతనా కేంద్రము,** *హెచ్.పి.రోడ్, మూసాపేట, అశ్విని హౌస్ ప్రక్కన, హైదరాబాద్ – 500 018.*

**అయిష్టమైన పనిని కూడా ఇష్టంగా చేయగలగాలి.**

జన్మశతాబ్ది ప్రత్యేకం

# ఎన్నటికి ఆరిపోని జ్వలించే అగ్నిని నేను

**అమృత బీజాలు నాటడానికి ముందు,**
**కాలకూట విషాన్ని తాగవలసి ఉంటుంది,**
**మృత్యువు యొక్క కిరీటాన్ని ధరించి, విశ్వహితం కోసం**
**మానవుడు జీవించవలసి ఉంటుంది.**

ఈ పైన పంక్తులు నేటికి 50 యేళ్ళ క్రిందటి అఖండజ్యోతి పత్రికలో (హిందీ) మొదటి పేజీలోని ప్రారంభ వాక్యాలు. ఈ పంక్తులను అఖండజ్యోతి కవర్‌పేజీలో ముద్రించిన వారు, స్వయంగా విశ్వవ్యాప్తంగా ఉన్న దుష్ప్రవృత్తులనే హలాహలాన్ని తాగి, మృత్యువును చేరుకొన్నవారిని కూడా లేపి నిలబెట్టే అమృత సంజీవనిని కోట్ల మందిచే రసాస్వాదన చేయించిన యుగ పురుషుడైన పండిత శ్రీరామశర్మ ఆచార్యులవారు. వారు తమ భౌతిక కాయం యొక్క కార్యక్రమాలను పరిమితం చేసకొంటూ గాయత్రి జయంతి రోజున (జూన్ 2, 1990) తన చైతన్యాన్ని తల్లి గాయత్రిలో కలిపి తన ప్రత్యక్ష జీవితంపై తెరని దింపివేశారు.

తన బహుముఖీ వ్యాసాలతో, ఉపన్యాసాలతో ఋషి ప్రణీత కర్తృత్వముతో మరియు స్నేహవర్షము ద్వారా అర్థశతాబ్దము కన్నా ఎక్కువ కాలం కొరకు అగణిత వ్యక్తుల హృదయాలలో రాజ్యమేలిన వారు, 'రసోవైసః' గా మూర్తీభవించినవారు, తన పార్థివ శరీరాన్ని వదిలివేస్తూ, ఇంతత్వరగా తన చైతన్యాన్ని మహాచైతన్యముతో ఏకీకృతం చేస్తారనే ఎవరు ఊహించలేదు. కాని వారు మన మధ్యలేరని ఎవరికి అనుపించదు. మహాకాలుని అగ్రదూత మహా ప్రాణవంతుడైన వ్యక్తి, ఏ శరీరధారి ఆపినా ఆగారా? ఆయన మన ధరిత్రిని ఉద్ధరించడానికి ఒక విశిష్టమైన కాలంలో వచ్చారు, తన అనవతరమైన మహాకార్యములో అగణితమైన వ్యక్తులను సఖులుగా-సహచరులుగా చేసుకొని వారిచే అపౌరుషీయమైన పురుషార్థాన్ని చేయించి సత్యయుగ కలలను సాకారం చేస్తూ ముందుకి సాగిపోయారు.

అవతారం అంటే మహాచైతన్యము యొక్క అవతరణ. నిష్కళంక ప్రజ్ఞావతార రూపముతో తమ దుర్బుద్ధివలన తమ వినాశనాన్నే కొని తెచ్చుకొంటున్న మానవ జాతిని సద్బుద్ధి వైపుకి మరల్చే కార్యాన్ని ఏ మహాశక్తి తన సంకల్పముతో నేటికి 80 ఏళ్ల క్రితం జన్మించిందో ఆ వ్యక్తిత్వం పై వ్యాసం రాయపూనటం ఒక రకంగా దుస్సాహసమే అవుతుంది. ఆ బహుముఖీ, విరాట్, ప్రాణవంతమైన మహాపురుషునితో ఇలా చేయడం సముచిత న్యాయం కూడా కాదు, అయితే ఆ శక్తే, వ్రాయమని నిర్దేశిస్తే, ఒక చిన్న ప్రయత్నం మన వైపునుండి కూడా చేయబూనటం సాధ్యమవుతుంది. ఆ వెలుగు ఎంతోమంది వ్యక్తులలో అధ్యాత్మపరాయణ, బ్రహ్మవర్చస్ ప్రధానంగా ఉండే జీవితాన్ని జీవించే ఉత్సాహాన్ని మేల్కొల్పి వారిని దేవమానవులుగా తీర్చిదిద్ది లోకహితార్థం కొరకు జీవికి ప్రేరణనిచ్చే శుభారంభం జరిగితే ఆయన చరణాలలో సమర్పించే ఈ శ్రద్ధాంజలి కొంతమేర సార్థకం అయిందని భావించవచ్చును.

జీవించడమనేది ఎంతో మంది జీవిస్తారు. పేరు సంపాదిస్తారు, అయితే వెనుకబడిన వారిని, క్రింద పడిన వారిని పైకి లేపి, పీడితుల కష్టాలు చెరిపివేయడానికి పూనుకొని తమ జీవితాన్ని హోమంగా మార్చినవారు, తమ సర్వస్వాన్ని సమర్పించి దేహయజ్ఞం, జీవన యజ్ఞం మరియు సమాజ యజ్ఞం అనే కార్యక్రమాల ద్వారా విశ్వ వసుధ కొరకు మరువలేని కార్యాలు చేసే వారి యశస్సు, కీర్తి అమరమైపోతాయి. తనని తాను పైకి లేపుకొని, ఆత్మబలాన్ని వికసింపచేసుకొని, ముక్తిపథాన్ని ప్రశస్తం చేసుకొంటూ ఉండటం తేలికైన పనే, అయితే విశ్వమానవుల కొరకు ఆ ద్వారాన్ని తెరవడం అత్యంత కఠినతరమైన పని. ఇటువంటి వ్యక్తులు ఏ విధమైన సమాధిని ఆశించరు. స్వర్గాన్ని కోరుకోరు, మోక్షాన్ని కాంక్షించరు. వీరు గౌతమబుద్ధునివలె ఈ వసుధలో ఒక్క వ్యక్తి, అయినా బంధనాలలో బంధింపబడి ఉన్నంతవరకు నేను నా ముక్తిని కోరను అని ఉద్ఘోషిస్తారు. ఇటువంటి దేవ మానవుని అవతారం, దేవదూత, ప్రవక్త అనే పేర్లతో సంబోధిస్తారు. అంతేకాక ఇటువంటి వారు అరుదుగా ఎన్నో సహస్రాబ్దుల తరువాత ఎప్పుడో ఒకసారి జన్మిస్తారు. తమని, యుగాన్ని కూడా ధన్యులు గావించుకొంటారు. "ఆత్మవత్ సర్వభూతేషు" అనే విధంగా జీవించే ఇటువంటి మహాపురుషులు చూడటానికి సాధారణ వ్యక్తులుగా కనిపించినా, వారి జీవితంలో

**విసుగు, కోపం శరీర ఆరోగ్యానికి హానికరం.**

ప్రతిక్షణం విశ్వమానవుని వికసింపజేయటానికి సమర్పించు కొంటారు. అందుకనే వారు ప్రతిక్షణాన్ని సదుపయోగపరుస్తూ 'కాలాన్ని' తమ తమ గుప్పిట్లో ఉంచుకొంటూ తాము స్వయంగా 'మహాకాలుని' రూపాన్ని ధరించి యుగసృజనకి మార్గదర్శనం చేస్తూ, తమతో నడిచేవారిని కూడా ధన్యులుగా చేస్తారు. ఇటువంటి మహాప్రాజ్ఞుడైన యుగపురుషుడే మన గురుదేవులు.

19వ శతాబ్దపు చివరి ఐదు దశాబ్దముల 20వ శతాబ్దపు పూర్వార్థపు కొన్ని దశాబ్దముల చరిత్రను చూస్తే, విశ్వమంతటిలో విశాల వ్యాపక పరివర్తనను తీసుకొచ్చే వ్యక్తులు ఈ అవధిలోనే జన్మించినట్టు తెలుస్తోంది. మహాత్మాగాంధీ, సామ్యవాదాన్ని కార్యరూపంలోకి దించిన లెనిన్, శ్రీరామకృష్ణ పరమహంస, మహర్షి రమణులు, యోగిరాజు అరవిందులవారు, స్వామి వివేకానంద, సోదరి నివేదిత, వైజ్ఞానికుడైన ఐన్‌స్టీన్, సంత్ వినోబా, ఒకపెద్ద సంస్థకి జన్మనిచ్చిన హెడ్గేవార్, రెండవ ప్రపంచ యుద్ధమనే విపత్తును ఎదిరించిన సర్ విన్‌స్టన్ చర్చిల్, విశ్వశాంతిని ప్రతిష్ఠించిన రవీంద్రనాథ్‌ఠాగూర్, శరత్ చంద్ర ఛటర్జీ, చికిత్సా విజ్ఞానములలో కొత్త క్రాంతిని తెచ్చిన అలెగ్జాండర్ ఫ్లెమింగ్, సర్దార్ పటేల్, పండిత నెహ్రూ, భారతీయ వైజ్ఞానిక ద్వయములైన జగదీశ్‌చంద్రబోస్ మరియు సి.వి.రామన్, చంద్రశేఖర్ ఆజాద్ మరియు భగత్‌సింగ్, అమరువీరుడైన సుభాష్ చంద్రబోస్, దార్శనికుడైన కాంట్ మరియు మేక్స్‌ముల్లర్, వైజ్ఞానిక రంగములో ఎగురుట ద్వారా కొత్త క్రాంతిని సృష్టించిన రైట్ బ్రదర్స్, వీరందరూ కూడా ఈ అవధిలో జన్మించినవారే. ఈ పైన చెప్పబడిన లిస్టు చాలా సంక్షిప్తమైనది. కేవలము సూచిస్తుంది, మహాకాలుని ప్రణాళికలో అగణిత చైతన్య సంపన్నత కలిగిన వ్యక్తులు ఒకేసారి, ఒక శతాబ్దములో ఏవిధంగా వివిధ స్థలాల్లో అవతరించారో సూచిస్తుంది. కాని ఈ మధ్య సంవత్సరాలలోనే స్వామి రామకృష్ణ పరమహంస బ్రహ్మలీనము జరిగిన 24 సంవత్సరాల తరువాత ఆగ్రాలో జనపద్‌లోని ఆవల్‌ఖేడా అనే గ్రామములో శ్రీమంతులైన బ్రాహ్మణ పరివారంలో ఒక యుగపురుషుడు జన్మించాడని చెప్పడం చాలా అవసరమని భావిస్తున్నాము. అతని బాల్యం చాలా సాధారణంగా గడిచింది, కాని క్రమంగా తన బహుముఖ క్రియాపద్ధతి, సుసంస్కారము వల్ల ప్రాప్తించిన అదృశ్యసత్తా మార్గదర్శనము మరియు వికసించిన ఆత్మబలమును ఆధారంగా చేసుకొని 1950వ సంవత్సరము వరకు లక్షల వ్యక్తుల మనసులు, మస్తిష్కాలలో విస్తరించారు. ఆతని పేరు శ్రీరామ్. ఆతడు ఒక సద్గృహస్థుని రూపంలో సాధారణ జీవితం జీవించినట్లు కనిపించినా 1958లో ఒక అలౌకిక, విరాటస్థాయికి చెందిన సహస్రకుండీ మహాయజ్ఞం మధురలో నిర్వహించి ఒక గొప్ప సంస్థకు పునాదిని వేశారు.

ఈ యుగపురుషుని యొక్క మహాయాత్రకి ఇది ఒక ముఖ్యమైన నాందిగా ఏర్పడింది. ధర్మతంత్రపు విస్తృతమైన చెల్లా చెదురుగా ఉన్న రూపురేఖల్ని సువ్యవస్థితం గావించి దానిని లోకమానస పరిష్కారం కోసం వెచ్చించే పురుషార్థాన్ని ఒక యోధుడే మూర్తీభవింపచేయగలడు. ప్రతికూలమైన పరిస్థితులలో తన రచన, వాణి మరియు మమత్వమనే త్రివేణిని ప్రవహింపచేస్తూ, చెత్తా-చెదారాన్ని, దుష్ప్రవృత్తుల సముచ్చయాన్ని మహాసాగరంలో కలిపివేస్తూ, దేవమానవుల సముదాయాన్ని తయారుచేసి దానికి 'గాయత్రి పరివార్' అనే పేరుని ఇచ్చారు. ఇది చాలా మహత్వ పూర్ణమైన సంస్థాపన ఎందుకంటే ఈ విశాలమైన పరివారానికి సంస్థాపకులు, సంరక్షకులు అన్ని కూడా వారే. లెక్కలేనంత మంది వ్యక్తులు తమ సమయం, జ్ఞాన, ఆర్జన విభూతుల రూపంలో శ్రద్ధాంజలిని వారి చరణాలకు సమర్పిస్తూ వారి అంగములు, అవయములు, సఖులుగా-సహచరులుగా మారిపోయారు.

రాజనైతిక, సామాజిక సంస్థలు జాతీయ, పోషక సంస్థలు కూడా ఏర్పడుతాయి. కానీ ధర్మరక్షణ సంస్థాపన సంఘశక్తి జాగృత మవటం ద్వారా ఎలా సాధ్యపడుతుంది అనే విషయానికి ప్రత్యక్ష ప్రమాణాన్ని పండిత శ్రీరామశర్మచేసి చూపారు. ఈయన కేంద్రీయ ప్రవాహము నుంచి గోముఖ, గంగోత్రితో కలియడానికి **జనసామాన్యులకొరకు ఒకే ఒక షరతు పెట్టారు అది తమపై తమకు నియంత్రణ, నిరాడంబర జీవితం, లోక కళ్యాణం కొరకు సత్ప్రవృత్తుల సంవర్థన కొరకు తమ సంపాదనలో, సమయంలో ఒక అంశను సమర్పించుట.** ఆయన ఆలోచనలతో కలిసిన వారు మార్పు చెందారు. స్వయంగా గురుదేవులు పరోక్షంగా వారి చైతన్యానికి మార్గదర్శనమిచ్చారు. అంతేకాక సమర్పణకి బదులుగా దివ్య అనుభూతుల రసాస్వాదన వారి జీవితాన్ని వరించింది.

గాయత్రి పరివారములోని లక్షల సదస్యుల పేర్లను వారి కుటుంబ సభ్యులను గుర్తు తెచ్చుకొని అన్ని వివరంగా అడగటం, తన స్నేహాన్ని రంగరించడము ఒక చమత్కార వ్యక్తిత్వ సంపన్నుడైన మహాపురుషునికే సాధ్యం. ఆయన తేజో మండలం నవ్వుతూ,

**కోపతాపాలు మనస్సునే కాదు పరిసరాలను కూడా కలుషితం చేస్తాయి.**

కిలకిలలాడుతూ ఉన్నా మోము అసంకల్పింతంగానే ప్రతి ఒక్కరిని తమ ఆంతరంగీకునిగా చేసుకొనేది. ఈ బహుముఖ జీవితాన్ని గడిపిన యుగపురుషుడు తన వారసత్వంగా, అన్నిటికన్నా బహుమూల్యమైన నిధి తన పట్ల, తన కార్యక్రమాల పట్ల సమర్పితమైన కార్యకర్తలను ఒక మణులమాలగా తయారుచేశారు. ఈ మాల కేవలం మహాకాలుని మెడకే అందాన్ని ఇవ్వగలదు, దీనికి సాటి కోట్ల–కోట్ల ధనరాశి కూడా తూగదు. ఇది ఒక బహుమూల్యమైన గని, దీనికి వందనీయ మాతాజీ ద్వారా తమ స్నేహము దొరుకుతుందనే ఆశ్వాసనని కూడా ఇచ్చారు.

పూజ్యగురుదేవుల 80 ఏళ్ళ జీవిత కాలములో రచించిన గ్రంథములతో ఒక విశాల పర్వతమే తయారు అవుతుంది. లేఖలు, కాగితాలు ఆయన వ్యక్తిత్వాన్ని, కర్తవ్యాన్ని తన పరిధిలో కట్టివేయలేవు. ఎందుకంటే ఇటువంటి బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన వ్యక్తిత్వపుగని గల వ్యక్తి యుగపురుషుడని, నిష్కళంక ప్రజ్ఞావతారునిగా మాత్రమే లెక్కించగలం.

– *అఖండజ్యోతి, ఆగస్టు 1990*

*అనువాదం : శ్రీమతి లక్ష్మీసుందరి*

★★★

## భారతీయ శౌర్యం

*అశ్వపతి మహారాజు రాజ్యాన్ని పెద్దగా విస్తరింపచేయలేదుగాని, సమర్థవంతమైన పౌరుల్ని తయారుచేయటానికి ఎన్ని మార్గాలైతే ఉన్నాయో వాటన్నిటినీ అవలంబించి సత్ఫలితాలను పొందాడు. అందువల్లనే ఆయన రాజ్యంలోని పౌరులంతా వీరులుగా, ధీరులుగా, శక్తి సంపన్నులుగా ఉండేవారు. దీనులు, హీనులు, దుర్బలురు, సోమరులు, వెదకినా కనిపించేవారు గారు. రాజ్యంలో పిల్లలు పుట్టగానే వారిని తెచ్చి రాజ్యాధికారులకు అప్పగించాలనే నియమం ఉండేది. వారికి శిక్షణ, విద్య, పాలన, పోషణ మొత్తం బాధ్యత మహారాజే తీసుకునేవాడు. ఆయన తీర్చిదిద్దిన ప్రతిపౌరుడు శీలానికి, శౌర్యానికి, సంయమనానికి ప్రతిరూపంగా ఉండేవాడు. ఈ కారణం వలననే రాజ్యం చిన్నదైనా శత్రురాజులు దాని ముందు నిలుచుటకు సాహసించలేకపోయేవారు.*

*ప్రతాపంగల పురుషోత్తమునితో యుద్ధం చేసిన అనంతరం అలెగ్జాండరు సైన్యం దగ్గరలో ఉన్న ఏదో ఒక చిన్న రాజ్యాన్ని హస్తగతం చేసికోవాలని వక్రాలోచన చేసింది. దగ్గరలో ఉన్నది అశ్వపతి రాజ్యమే. కానీ ఆయన వీర గాథలు విని ఉండటం వలన ఎదురు నిలిచి పోరాడటానికి ధైర్యం చాలక మోసంతో రాత్రిపూట ఆక్రమణ చేశారు. ఆ విధంగా అశ్వపతి, ఆయన సైన్యం కూడా బంధింపబడ్డారు. అశ్వపతి మహారాజు శౌర్యాన్ని పరీక్షించదలచి అలగ్జాండరు ఆయన్ని బంధవిముక్తుణ్ణి చేసి ఒక సభ ఏర్పాటు చేశాడు. అశ్వపతి యొక్క యుద్ధంచేసే కుక్కలు విశ్వవిఖ్యాతి చెందినవి. ఆ 4 కుక్కలు ఎప్పుడూ ఆయన వెంటనంటి ఉండేవి. అలగ్జాండరు వాటిని చూచి వ్యంగ్యంగా “ఇవి భారతీయ కుక్కలేగా” అని ప్రశ్నించాడు. దానికి అశ్వపతి తక్షణం “అవును, అందుకే చాటుమాటుగా ఆక్రమణలు చేయలేదు. సింహాలతో కూడా శౌర్యంతో, మైదానంలో నిలబడి పోరాడుతాయి” అని బదులు పలికాడు. ఆ మాటలకు అలగ్జాండరు “అయితే వాటి సత్తా చూద్దాము” అని పలికి నిజంగానే తన వైపు సింహాన్ని, ఇటువైపు రెండు కుక్కల్ని నిలబెట్టి, పోరాటానికి సన్నాహం చేశాడు. సింహం కుక్కల్ని చెండాడసాగింది. కుక్కలు ఏమాత్రం తీసిపోకుండా సింహాన్ని నానా తిప్పలు పెట్టసాగాయి. కొంత సేపటికి మిగిలిన రెండు కుక్కలు కూడా మైదానంలోకి ఉరకటంతో సింహం ప్రాణభయంతో పరుగు లంకించుకొన్నది. కొంతదూరం పోయి ఇక పరుగిడలేక కుక్కల దంతాలు శరీరంలో లోతుగా దిగటం వలన రక్తసిక్తమై నేలకు ఒరిగిపోయింది. అపుడు అశ్వపతి అలగ్జాండరు నుద్దేశించి, “రాజా! నీ సైన్యంలో ఎవరైనా వీరుడుంటే ఎదుటకు వచ్చి నీ సింహం శరీరంలో దిగిన మా భారతీయ కుక్కల దంతాలను పెకలించి, దాని బాధను పోగొట్టమని చెప్పండి” అని సవాలుగా పలికెను. ఎందరో యోధులు ఒక్కొక్కరుగా లేచి ప్రయత్నించి, విఫలమై వెనుకకు తిరిగిపోయారు. అశ్వపతి 7 అడుగుల పొడవు శరీర సౌష్టవం గల తన అంగరక్షకుని ఒకనిని కనుసైగతో ఆదేశించగానే అతడు క్షణంలో కుక్కల్ని సమీపించి పట్టుకొని వెనక్కిలాగేసరికి అవి నోటికి అందిన సింహం మాంసంతో సహా తోకలు ఆడిస్తూ, అశ్వపతిని సమీపించాయి. అలగ్జాండరు యుద్ధాలైతే గెలవగలిగాడు కానీ, భారతీయ శౌర్య సామర్థ్యాలముందు ఈవిధంగా అనేక పర్యాయాలు తలవంచక తప్పలేదు.*

– ప్రజ్ఞా పురాణం నుండి

**మనం ఉత్సాహంగా ఉంటే ఇతరులకు స్ఫూర్తిని ఇవ్వగలుగుతాము.**

జన్మశతాబ్ది ప్రత్యేకం

# పరివర్తనం - ఒక సమయ సాధ్య ప్రక్రియ

భగవంతుడు అనేక దైవీఘటకముల సముచ్ఛయము. అనేక కెరటాలు కలసి సముద్రమౌతుంది. అనాచారము ప్రబలియున్న ఈ కాలములో దైవీశక్తుల ఒక పెద్ద సమూహము కార్యరంగం లోనికి దిగింది. ఆ సముదాయంలోని ఒక భాగమే నేను. ఎవరు ఎంతమందిని గుర్తించగలిగారు అన్నది ముఖ్యంగాదు. ముఖ్యమేమిటంటే వినాశనము చేసే ఆసురీశక్తికంటే దైవీశక్తి బలిష్టమైనది. అది సకాలంలో కార్యరంగంలోకి దిగి పాడైనదాన్ని సవరిస్తుంది. సనాతన కాలములో ఇలాంటి సంఘటనలు చాలా జరిగాయి. ఇపుడు కూడా అదే జరుగబోతోంది. గొప్ప పరివర్తనము తీసుకు రావటానికి దైవీశక్తుల శృంఖల కార్యక్షేత్రంలో పనిచేస్తున్నది. వాటి ప్రభావాన్ని త్వరలోనే మనము చూడగలుగుతాము.

మంచి చెడు కర్మముల ప్రతిఫలము అందరికీ తెలుసు. విత్తనము నాటటానికి, అది ఎదగటానికి కాలము పడుతుంది. మనిషి చేసిన మంచి చెడు కర్మముల ఫలితాలు కూడ కొంత సమయము తీసుకుంటాయి. ఈ మధ్యకాలంలో అందరికీ ఏ పని చేస్తే ఎటువంటి పరిణామము వస్తుందో తెలుస్తుంది. ఈ శిక్షణ మనిషికి చాలా ఉపయోగపడుతుంది. అనాయాసంగానే అన్ని పనులు జరిగిపోయి, కర్మయొక్క ఫలితాన్ని అనుభవించే వీలులేకపోతే ఈ ప్రపంచము అనుభవ శూన్యమైపోతుంది.

నేటి విపత్కర పరిస్థితులు వాటి చరమోత్కర్ష స్థితిని పొందాయి. మనిషి తన తప్పులను తెలుసుకుంటున్నాడు. కనుకనే మహావినాశనాన్ని ఆపటానికి దైవీశక్తులు తమ పాత్రను వహిస్తున్నాయి. ఇంతకుముందే ఈ ప్రయత్నాలు చేసివుంటే మనిషి ఇప్పటివరకు నేర్చుకున్నది ఇక భవిష్యత్తులో నేర్చుకోబోయేది ఏది ఉండేదికాదు. సమయము ఉండగానే దైవీశక్తులు తమ రక్షణ కార్యక్రమములను చేతిలోకి తీసుకున్నాయి అనేది మనము స్పష్టంగా గమనించవచ్చు.

ప్రతి పనికి ఒక సమయం ఉంటుంది. నిర్ధారిత కాలములో పూర్తి అయిన పనికి ప్రాముఖ్యత ఉంటుంది. ఉపయోగము ఉంటుంది. సమయము కంటే ముందు పనిచేసేస్తే దాని అందము పోతుంది. పిల్లవాడు ఒకరోజు పెద్దవాడౌతాడు. పెద్ద అయిన తర్వాత అతనికి పెళ్ళికూడ అవుతుంది. అందువల్ల పిల్లవాడి వివాహము గురించి చర్చించుకుంటే తప్పులేదు. కానీ ఆ పని ఇప్పుడే చేసేస్తే అది తప్పేగాక బాల్యవివాహము చేశారు అని నిందిస్తారు.

తల్లి గర్భకోశములో శిశువు తొమ్మిది నెలలు పెరిగి పరిపక్వమౌతుంది. సమయము పూర్తయ్యేంతవరకు, పరిపక్వము అయేంతవరకు వేచివుండాలి. ఇదే నియమము పంటకు కూడా వర్తిస్తుంది, అరచేతిలో మొక్కలను ఒక్క ఇంద్రజాలికుడే పెంచగలడు. కాని అవి దేనికీ ఉపయోగపడవు.

దైవీశక్తులు పరిస్థితిని నివారించగలిగే సామర్థ్యము కలిగియుంటే ముందే ఎందుకు అడ్డుకొనలేదన్న ప్రశ్నవేస్తూ ఉంటారు. ఇన్ని కష్టములు అనుభవించిన తరువాతే ఎందుకు మేలుకుంటాయి? దీనికి జవాబుగా ప్రతి కష్టము మనిషికి ఏదో ఒకటి నేర్చుకోవటానికి ఉపయోగపడుతుంది. ఎలాంటి మార్గముమీద నడిస్తే, ఎలాంటి పరిణామాలు ఎదుర్కొనవలసి వస్తుందో చూసి, అనుభవించినప్పుడు మనిషి చాలా ఎక్కువ నేర్చుకొనగలుగుతాడు. అందువల్ల సామాన్యజనులు తమ సామర్థ్యాలను పూర్తిగా ఉపయోగించిన తరువాతే దైవీశక్తులు జోక్యము (intervention) చేసుకొనుట జరుగుతుంది.

సర్వనాశనము వైపుకు వెళ్ళిన మనిషే, తిరిగి నిర్మాణాత్మక దిశవైపు వస్తాడని ఆశిస్తాము. అటువంటి ఉపాయములు, మనిషి ఈ కొద్దిరోజులబట్టి చేస్తున్నాడు కానీ అవి అనుకున్నంత స్థాయిలో లేవు. ఇటువంటి పరిస్థితులలో అన్ని కోణాల నుండి పరిస్థితి చేయిదాటినపుడు భగవంతుడు కలుగజేసుకుంటాడు. పాడుచేసినవాడే బాగుచేస్తాడు అనే ఆశ ఉంటుంది. ఈరోజులలో నిర్మాణాత్మక ప్రక్రియ పరోక్ష జగత్తులో జరుగుతోంది. సమయము వచ్చినపుడు సామాన్యజనులు కూడా దాని ప్రత్యక్షరూపాన్ని చూడగలుగుతారు.

### దేశపటములో ఊహించని మార్పులు

ఈనాడు ఉన్న పరిస్థితులకు కారణము, కొన్ని వర్గముల శాసన ప్రవృత్తి. ఇది ఎప్పటినుండి మొదలయ్యింది అనే చర్చ నిరర్థకమే. కానీ జరుగుతున్నది ఏమిటి అంటే సమర్థులైన వ్యక్తులు భూమిని తమ ఆధీనములో ఉంచుకొని అక్కడున్న **దుర్బల వ్యక్తుల శోషణ (exploitation)** ఆరంభించారు. క్లుప్తంగా ఇదే శాసనతంత్రము. పురాతన కాలమునుండి ఈనాటివరకు కొద్దిపాటి తేడాలతో ఇలాగే నడుస్తున్నది.

మనోమాలిన్యం జ్ఞాపకశక్తిని క్షీణింపజేస్తుంది.

జపాన్ మీద వేసిన రెండు బాంబులవలన అది ఆత్మసమర్పణ చేసుకున్నందువలన శాసకులలో ఉత్సాహము ప్రబలి పైన చెప్పిన శాసనవిధానాన్ని అనుసరిస్తున్నారు. ఈ పద్ధతే విషవృక్షము. ఈ పద్ధతి ఆచరణలో ఉన్నంతవరకు యుద్ధాలు జరుగుతూనే ఉంటాయి. అణ్వాయుధాలవల్ల చాలా విస్తృతమైన వినాశనము జరిగే అవకాశం ఉన్నది. ఒకవేళ దీనిని తప్పించగలిగినా ఇతర సాధనాలతో యుద్ధాలు జరుగుతూనే ఉంటాయి. దీనికి మూల కారణము సామర్థ్యవంతులు దుర్బలవర్గములను పీడించడమే. దీని ఆధారంగానే ఈనాడు దేశముల విభజన రేఖలు ఏర్పడ్డాయి. ఇలా జరిగి ఉండకపోతే దేశముల విభజన, భౌగోళిక సౌకర్యాల ఆధారంగా జరిగి ఉండేది. అంతేగాక వెనుకబడ్డ సముదాయానికి ప్రగతి సాధించిన సముదాయాలు చేయూతనిచ్చి వారిని ముందుకు తీసికెళ్ళే బాధ్యతను నిర్వహిస్తువుండివుండేవారు. **సమర్థులెపుడూ తక్కువగానే వుంటారు. అసమర్థులు అధికంగా ఉంటారు, అందువల్ల ఎక్కువమందికి మార్గదర్శనము, వారిని బాగుచేసే బాధ్యత, ప్రగతిశీలురైన అల్పసంఖ్యాకవర్గమే చేయవలసి వస్తుంది.** కానీ ఇప్పటి పరిస్థితులు అలా ఎక్కడున్నాయి? కొద్దిమంది ప్రతిభావంతులు తమ బుద్ధిబలము, సాధనబలము, జ్ఞానబలము, శాసనబలముల వల్ల ఇష్టము వచ్చినంత స్థలాన్ని ఆక్రమించి దానిని తనది అంటున్నారు. ఇది అడవిరాజ్యము అని అనిపించుకుంటుంది. బలవంతుడిదే రాజ్యమన్న మాట చరితార్థమౌతుంది. ఈనాడున్న దేశముల విభజన వాటిపైన కొన్ని సమూహాల ఆధిపత్యమే ఈనాటి అనేక సంఘర్షణలకు మూలకారణము.

**అణ్వాయుధాల ప్రయోగము చేయకపోయినా సమర్థవంతులు దుర్బలుల పీడిస్తూ ఉన్నంతవరకు యుద్ధాలు అనివార్యము.** ఎవరికి ఎంత బలముంటుందో వారు అంతగా తమకంటే క్రిందివారిని బెదిరించడము, తమ గుప్పెట్లో ఉంచుకోవడము జరుగుతుంది. ఈ స్థితిలో అనేకమందిలో మహత్వాకాంక్షలు కలిగి, వీలుచూచుకుని బహిర్గతమౌతాయి. సంస్థలు చీలిపోతుంటాయి.

జరిగిపోయిన కాలంలో ఇదే జరిగింది. ఎవరివద్ద ఎంతమంది ఎక్కువ బందిపోట్లు ఉండేవారో వారు అంతగా ఇతర రాజ్యములను దోచుకునేవారు. ఈనాడు విధానాలు మారాయి. వెనుకటి వలె యుద్ధాలు బహిరంగంగా జరుగుటలేదు. యుద్ధాలకు సిద్ధాంత వాదమనే ముసుగులు కప్పుతున్నారు. కానీ తథ్యములన్నీ ఒకటే. ఒక సమర్థవంతమైన వర్గం ఏదోవిధంగా ఇతరులను తమ ఆధీనంలో ఉంచుకునే ప్రయత్నాలు కొనసాగిస్తునే ఉన్నది.

దేశపు టెల్లలు కొన్నివేల సంవత్సరములనుండి అలానే ఉండడంవల్ల అది స్వాభావికమనిపిస్తున్నది. ఎవరు, ఎక్కడ అధికారము సంపాదించుకున్నారో అది వారి న్యాయోచిత అధికారము అనిపిస్తోంది. కానీ నిజానికి ఔచిత్యము మరియు న్యాయాన్ని దృష్టి యందుంచుకుంటే పరిస్థితి ఇంకోలా దర్శన మిస్తుంది. పృథ్వీమీద ఉత్పన్నమయ్యేవి భూమి పుత్రులందరకు సమానంగా ఎక్కడ లభిస్తున్నాయి? పెద్దవారు తమ సుఖాలను, **కొంచెం తగ్గించుకొని, చిన్నవారికి ఎక్కువ సుఖాల నందివ్వటానికి ఎక్కడ ప్రయత్నశీలురౌతున్నారు?** ఇదే జరిగిఉంటే భూమి అంతా అందరికి చెంది, అందరూ సమానంగా లాభాన్ని పొందగలిగేవారు. దేశం పేరుతో, విభజనరేఖలు వుండేవి కావు. ఒకవేళ ఉన్నా దానికి కారణము వర్గవాదముగాక, భౌగోళిక, రవాణా సౌకర్యాలకోసము వుండేది.

ఖనిజతైలం (Mineral oil) కొన్ని దేశాలలో ఎక్కువగా లభ్యమవుతుంది. అందువలన దానిపై ఆధిపత్యము వారికి మాత్రమే ఉన్నది. కానీ భూమి అందరిదీ అగుటచే ఆ సంపదపై స్వామిత్వము అందరికీ చెందాలి. ఆఫ్రికా, అమెరికాలలో ఉపయోగించబడని ఖాళీ ప్రదేశములు చాలా ఎక్కువగా వున్నాయి. చైనా, భారతదేశం వంటి జనసంఖ్య ఎక్కువగా గల దేశాలలో తగినంత భూమి లేకపోవుటచే అనేక సమస్యలు ఏర్పడుతున్నాయి. ఈ విశ్వమంతా ఒక కుటుంబమైనప్పుడు భూమియావత్తు అందరికీ చెందాలి. భూమినుండి జనించిన ఉత్పత్తి అంతటిలోను సమాన లాభాలు అందరూ పొందాలి. **ఒక క్షేత్రానికి చెందినవారు తమ ఆధిపత్యాన్ని అచటగల ఉత్పాదనలమీద చూపించి దానిని తమ గుప్పెట్లో పెట్టుకొనుటకు ప్రయత్నిస్తూండటం వలన అవినీతికి బీజారోపణ గావించబడుతోంది. అవినీతి యొక్క చాలా పెద్ద లోపము ఏమంటే పెద్దవారు, చిన్నవాళ్ళను మ్రింగేస్తారు.** ఈ మానసిక పరిస్థితి ఉన్నంతవరకు చిన్న పెద్ద యుద్ధాలు జరుగుతూనే ఉంటాయి.

యుద్ధమంటే మందుగుండును మాత్రమే ఉపయోగించుట కాదుగదా! **నిజమైన యుద్ధము ఆర్థికమైనది.** ఈ లోటు నేటి దేశవిభజన రేఖలున్నంతవరకు పూడ్చబడదు. రేపు కాకపోయినా ఎల్లుండైనా క్రొత్త స్వరూపాలు దాల్చి రకరకాల యుద్ధాలు జరుగుతునే ఉంటాయి.

**ఈనాటి సమస్యలన్నింటికీ జవాబులు విడివిడిగా వేరువేరుగా కాకుండా ఒకేసారి లభిస్తుంది.** అణుయుద్ధము ఆగిపోవటమేగాక వర్గాలు, రాజనీతిజ్ఞులు, తమతమ సామర్థ్యానుసారము ఆక్రమించుకొన్న దేశవిభజన రేఖలన్నీ చెదిరిపోతాయి. **ఈనాడు ప్రపంచపటములో ఏ దేశం ఎక్కడ కనిపిస్తున్నదో అవేమీ అచ్చట కనపడవు. ఒకే 'విశ్వరాష్ట్రము' నిర్ధారించబడి దానికి కావలసిన శాసన, పారిశ్రామిక, రవాణాసౌకర్యాలకు అవసరమయ్యే విభజన జరుగుతుంది.**

**చేస్తున్నపని పట్ల అంకితభావం, శ్రద్ధ, ఇష్టం పెంచుకుంటే జ్ఞాపకశక్తి వృద్ధి చెందుతుంది.**

వినుటకు, ఆలోచించుటకు ఇది అసంభవంగా తోస్తుంది. అమెరికా తన ఆధీనంలో వున్న భూమిని ఎందుకు వదులుకుంటుంది? రష్యా తన మిత్రమండలిలో వున్న ఇంతమంది సభ్యులను ఎందుకు జారవిడుచుకుంటుంది? చైనా ఆధీనంలో వున్న క్షేత్రాన్ని మరల వర్గీకరించటానికి ఎందుకు ఒప్పుకుంటుంది? చమురు ఉత్పాదన గావించే దేశాలు ఇతరులకు వాటిలో ఎందుకు భాగాన్నిస్తాయి? ఎవరూ స్వేచ్ఛగా ఇందుకోసం ఒప్పుకోకపోవచ్చు. ముఖ్యంగా సమృద్ధిగా ఉన్న ధనిక దేశాలు, బీదదేశాల గోడును ఎందుకు పట్టించుకుంటాయి? విశ్వ పునర్విభజన చేసి వ్యవస్థీకరించడానికి వారిపై ఒత్తిడిని గొనితెచ్చే సామర్థ్యమేది? **ఈనాటి పరిస్థితులలో పైనచెప్పిన పరివర్తన జరగడం అసంభవము అనిపిస్తుంది.** దేశ భౌగోళిక, ఆర్థిక, భౌతిక స్థితులలో క్రిందటి సంవత్సరాలలో వచ్చిన మార్పును చూచి ఆశ్చర్యచకితులవ్వాల్సివస్తుంది. మొదటి ప్రపంచ యుద్ధము తర్వాత, రెండవ ప్రపంచ యుద్ధము, దాని తర్వాత **రాబోయే మూడవ ప్రపంచయుద్ధము మధ్యన వచ్చిన మార్పులు ఆర్థిక, రాజనీతిక దృష్టిలో చూస్తే అద్భుతమైనవి. ఈ మార్పులు ఆనాటి వ్యక్తులకు చెప్పివుంటే నమ్మియుండేవారు కారు. హిట్లరు యొక్క ఉత్థాన-పతనాల కాలంలో యూరోపులో వచ్చిన మార్పులు ఎవరూ ఊహించలేనట్టివి.**

**యుద్ధాల నివారణ ఈసారి ఖచ్చితంగా జరిగి తీరుతుంది. అణ్వాయుధాలు, రసాయనిక మారణాయుధాలు ఉపయోగించకుండా ఉండటమనే పరిస్థితులకు దైవీశక్తులు దిగిరావల్సిన అవసరము లేదు. మనిషి యొక్క స్వంత తెలివితేటలు చాలును.** భగవంతుని జోక్యము వలన యుద్ధము ఆగిపోతే సరిపోదు. ఈనాడున్న దేశాల ఎల్లలు మాయమయి, దానికి ఆధారభూత కారణాలు కూడ మటుమాయమవ్వాలి. **రాబోయే కాలంలో భూమి రూపురేఖలు అలాగే ఉన్నప్పటికీ దానిలో కనిపిస్తున్న అనేక చిన్న -పెద్ద దేశాలు ఉండవు, కనిపించవు.** 'ఒకే విశ్వం-ఒకే రాష్ట్రం' అనే కల్పన ఎప్పటినుండో ఉన్నది. ఈసారి అది ఖచ్చితంగా కార్యాన్వితమై తీరుతుంది.

ఈనాడు సాధనాలపరంగా, జ్ఞానపరంగా, అనుభవ అభ్యాస దృష్టిపరంగా వెనుకబడ్డవారు అధికసంఖ్యలో వున్నారు. సంపత్తి, బుద్ధిగలవారి సంఖ్య చాలా తక్కువ. పెద్దలు ఆలోచించడము మొదలుపెట్టాలి. సామర్థ్యపరంగా తక్కువ, సంఖ్యాపరంగా ఎక్కువ ఉన్నవారి బాధ్యతలు కుటుంబంలో తీసుకున్నట్లు తీసుకోవాలి.

దైవీకార్యాలను చమత్కారాలంటారు. గాఢాంధకారంలో సర్వనాశనానికి దారితీసే యుద్ధ పరిస్థితులను మార్చగలిగితే దేశాల వర్తమాన ఎల్లలు ఎంత అస్వాభావికమో, కూడనివో తెలుస్తుంది. **పరిస్థితులలో మార్పు ఏ మూలకి పెద్దమాంసపుముద్ద వస్తుందో అనే ఆలోచనలో కాక, మనిషి ఈ భూమిమీద ఆనందంగా ఎక్కువకాలం మనగలగటం ఎలా అని ఆలోచించాలి. తగు ప్రయత్నాలు జరగాలి. నిరంతరము సమస్యల వలయంలో ఉండటం బదులు అందరూ ఒకసారి శాంతచిత్తులై దీర్ఘకాలిక నిర్ణయాలు తీసుకోవాలి.** ఇక్కడ ఒకటి గుర్తుంచుకోవాలి. ఈసారి ఒక్కొక్క సమస్యకు వేరువేరు పరిష్కారాలు ఆలోచించకుండా అన్ని సమస్యలకు ఒకేసారి పరిష్కార మార్గాలు ఆలోచించాలి.

వ్యక్తిని ఒక జాతి, లింగ, వర్ణ గోడల మధ్య ఇరికించలేము. భూమి ఒక సముదాయం ఆక్రమించబడటం వలన అది వారిది అవదు. పాత నిర్ధారణల మీద ఆధారపడి ఉండలేము. చిర-పురాతనమును చిర-నూతనంగా మార్చవలెను. పృథ్వి ఏర్పడి మానవ ఉత్పత్తి జరిగినపుడు దేశములు-జాతులు అనే విభజన లేనేలేదు. మనిషి తన వీలు, అవసరాన్ని బట్టి ఎక్కడికైనా వెళ్ళి రాగలిగేవాడు. జీవనోపయోగ పరిస్థితులు ఉన్నచోట స్థిరపడేవాడు. మనిషి అలవాటును 'కూడదీసుకోవడం' వేర్పాటు కాదు. అందువల్ల కుటుంబము, పేట, గ్రామాలు ఏర్పాటు చేసుకొనుట మొదలెట్టాడు. కానీ ఇప్పుడు ఏమి మార్పు వచ్చిందని కలసిమెలసి పంచుకొని తినలేకపోతున్నారు? ఎక్కువ కూడబెట్టిన వాడు ఇతరుల ఈర్ష్యకు లోనవుతున్నాడు. **ఎవరు కలవారో, ధనవంతులో వారు పుణ్యాత్ములు, ఈశ్వరుని కృపకు పాత్రులు అనే నానుడి, భావన ఇంక వర్తించదు.**

నిజంగా ఇది కష్టసాధ్యమే. యుద్ధం ఆపడం కూడా కష్టమే. యుద్ధం ఆపడం అసంభవమనిపిస్తే ఆ శృంఖలలోనే ప్రపంచము యొక్క క్రొత్త మ్యాప్‌తో నూతన విధానాన్ని కూడా కలుపుకోవాలి. ఇప్పుడున్న వ్యవస్థ పాడయిపోయింది. ఎంత బాగుచేయాలన్నా సాధ్యం కాదు. మొత్తము విధానంలోనే పరిపూర్ణ మార్పు చేయాలి.

శాసనాధ్యక్షులను యుద్ధాలగురించి ఆలోచించకుండా ఉండటానికి నేను బాధ్యులను చేస్తాను. ముందుకేసిన అడుగులను వెనుకకు త్రిప్పమంటాను. కత్తులను తిరిగి ఒరలో పెట్టిస్తాను. చిరపురాతన వ్యవస్థయొక్క చివరిక్షణాలు ఇవి. దానిని భూస్థాపితము చేసి ఈనాటి పరిస్థితులకు అనురూపమైన నూతన నిర్మాణము చేపట్టాలి అని చెప్పిస్తాను. **ఒకే ప్రపంచము, ఒకే రాష్ట్రము అనే మాన్యత ఇపుడు ఒక సిద్ధాంతము మాత్రమేగాక, వాస్తవరూపం దాల్చుతుంది.** దానికి తగిన రూపకల్పన జరిగి, సంపూర్ణ విశ్వమానవ ఏకత్వము ఏర్పడుతుంది. దీనికొరకు విశ్వ ఆలోచనా విధానంలో ఎంత తీవ్రమైన మార్పులు వస్తాయంటే దానిని తలక్రిందులుగా ఉన్నదాన్ని త్రిప్పి సరిచేయుట అనవచ్చు.

– *అఖండజ్యోతి, జులై 1984*

దృఢ సంకల్పంతో, నిర్విరామ కృషితో లక్ష్యాన్ని సాధించవచ్చు.

జన్మశతాబ్ది ప్రత్యేకం

# జీవితమే ఒక ప్రత్యక్ష దైవం

ప్రతిక్షణంలో మనం జీవిస్తున్నా, కాలమహిమను (గొప్పతనాన్ని) మనం గుర్తించలేకపోవడం జరుగుతోంది. దానిని చక్కగా ఉపయోగించుకుంటే ఏ యే సిద్ధులు లభ్యమౌతాయో కూడా ఆలోచించలేకపోతున్నాం. జీవి జన్మించిన తర్వాత పొట్టపోషణ, సంతానవృద్ధి, ప్రాకృతిక ఉత్తేజనాలవలన క్షోభను పొంది ఎలాగోలా జీవిస్తూ చివరకు చనిపోతున్నాడు. మనిషి జీవితమే సృష్టికర్త కానుక అని ఎప్పుడైనా అనిపిస్తున్నదా? అనుగ్రహ పూర్వకంగా ఈయబడిన జీవితాన్ని శ్రేష్ఠమైన రీతిలో జీవి సదుపయోగం చేసుకుంటాడనే బ్రహ్మ ఆశించాడు. తన అసంపూర్ణత్వాన్ని సంపూర్ణం చేసుకొని, నీచస్థితి నుండి మహాత్ముడౌతాడని కూడా భావించాడు. తెలివైన తోటమాలివలె ఈ విశ్వ ఉద్యానవనాన్ని తడిపి (నీరుపెట్టి) పోషిస్తాడని, స్వార్థ పరమార్థాలను సరిగా అర్థంచేసుకుంటాడని భావించాడు. పశు ప్రవృత్తులను, చెడు సంస్కారాన్ని విడిచిపెట్టి, మంచి ప్రవృత్తులను తగిన రీతిలో అలవాటు చేసుకొని పరీక్షలో ఉత్తీర్ణుడవ్వాలి. ఎవడైతే దానిలో ఉత్తీర్ణత పొందుతాడో, ఆ వ్యక్తి, దేవమానవ తరగతిలో ప్రవేశం పొందుతాడు. తనకు మేలు చేసుకోడమేకాక, తననావలో అసంఖ్యాక జనులను కూర్చోబెట్టుకొని, ఆవలతీరానికి చేరుకుంటాడు. అట్టివారే, అభినందించదగ్గ అనుకరించదగ్గ మహామానవులుగా పిలువ బడతారు. తృప్తి, ప్రసన్నత, శాంతి అనే త్రివిధ ఆనందాలు అట్టి వారికే లభిస్తాయి.

జీవన దేవత సాధన వలననే మహాసిద్ధులు లభిస్తాయి. కస్తూరి మృగమే దీనికి ఉదాహరణ. బయట వెదికితే అలసట కోపమే లభిస్తాయి. తన నాభి (బొడ్డు) నుండే ఆ సుగంధం వస్తోందని తెలిసిన తర్వాతే దానికి శాంతి లభిస్తుంది. పరమాత్మతో సంపర్కం పొందడానికి, వేరేవిధంగా వెతకాలనుకోవడం వ్యర్థమే ఔతుంది. అది దేశ కాలాలకు, శరీర ధారులకు పరిమితం కాదు. దానిని అతి సమీప క్షేత్రంలో చూడాలంటే, తన అంతఃకరణలో మాత్రమే సాధ్యమౌతుంది. దీనికి ప్రత్యక్ష నిదర్శనం సమగ్ర జీవనమే.

శ్రద్ధలోనే పరబ్రహ్మ కలసి ఉంటాడని గీతచార్యుడు చెప్పాడు. ఎవరి శ్రద్ధ ఎలా ఉంటుందో, అలాగే జరుగుతుందని చెప్పాడు. తననెలా భావించుకుంటాడో, వ్యక్తి అలానే ఔతాడు. తనను నీచుడుగాను, చెడ్డవానిగాను తలంచితే, అతని వ్యక్తిత్వం ఆ మూసలోనే పడి, సాగిపోతుంది. ఎవరైతే తనలో ఔన్నత్యాన్ని ఆపాదించుకుంటాడో, అతని అస్తిత్వం మానవీయ గరిమతో నిండిపోతుంది.

'సాధనతోనే సిద్ధి' అనేది అందరూ అంగీకరించే సిద్ధాంతం. సాధన ఎవరికోసం చేయాలన్నదే ప్రశ్న. జీవితాన్నే జీవించే, జాగృత దేవతగా భావించాలన్నదే ఆ ప్రశ్నకు సరైన సమాధానం. వ్యక్తి, తనపై పడిన కల్మషాలను శుభ్రం చేసుకోవడానికి ప్రయత్నం చెయ్యాల్సి ఉంటుంది. నిప్పు కణికపై బూడిద కప్పి ఉన్నప్పుడు నల్లగా కన్పిస్తుందే కాని ఆ బూడిద పొరను తొలగించగానే లోపల దాగి ఉన్న నిప్పు స్పష్టంగా కనబడుతుంది. సాధన ఉద్దేశం కప్పబడి ఆవరించి ఉన్న వాటిని తొలగించడమే. దీనినే నిద్రాణ స్థితిలో ఉన్నదానిని జాగరణ స్థితిలోకి తేవడమని చెప్పవచ్చును.

'కస్మైదేవాయ హవిషా విధేమ్' అని ముని పుంగవుడు ప్రశ్నించాడు. 'మనము ఏ దేవత భజన చేయాలని' ఆ ప్రశ్నకు అర్థం. 'ఆత్మదేవుని కోసం' అనేదే దానికి సరైన సమాధానం. తమ ఆలోచన, శీలము, వ్యవహారం అనే గీటురాళ్ళపై వ్యక్తిత్వాన్ని సిద్ధింపచేసుకోవాలి. చెట్టుకు పళ్ళు, పూలు పైనుండి వచ్చి చేరవు. భూమి నుండి వేళ్ళు రసాన్ని పీల్చుకొని, చెట్టు పెరిగి పూలు పూచి కాయలు కాస్తుంది. మనలో ఉన్న వేళ్ళు మొత్తం వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేస్తాయి. ఆధారంగానే సిద్ధులు, విభూతులు లభిస్తాయి. వాటి ఆధారంపైనే ఆధ్యాత్మిక ఉన్నతి భౌతిక ప్రగతిశీలత అనే ఉభయ పక్ష లాభాలు కలుగుతాయి. ఇదే ఉపాసన, సాధన, ఆరాధనల సమన్వయ రూపం. ఈ సాధన ఆధారంగానే సిద్ధులు, సఫలతలు నిశ్చయంగా లభిస్తాయి. పాత్రత లేనప్పుడు, ఇతరుల ముందు చేసి చాపినా, ప్రాధేయపడినా, ఏమి లభించదు. తనకు తాను సహాయం చేసుకునేందుకు సన్నద్ధుడైన వ్యక్తికి మాత్రమే ఈశ్వరుడు సాయపడతాడని చెప్పబడింది. ఆత్మ పరిష్కారం, ఆత్మ పరిశోధనలే జీవన సాధన. దీనినే పరమపురుషార్థమని చెప్పబడింది. ఎవరైతే ఈ లక్ష్యాన్ని అర్థం చేసుకున్నారో, వారు ఆధ్యాత్మ తత్వజ్ఞాన రహస్యాన్ని, దాని మార్గాన్ని హస్తగతం చేసుకున్నారు. అంతిమ లక్ష్యం వరకు చేరుకునేందుకు

**మన ఆరోగ్యం మన ఆలోచనలలోనే ఉన్నది.**

రాజమార్గాన్ని కనుగొన్నారు.

ఆత్మిక ప్రగతి కొరకు మూడు విషయాలను అలవరచుకోవాల్సి ఉంది. 1) ఉపాసన, 2) సాధన 3) ఆరాధన. ఈ పదాలను (శబ్దాలను) స్పష్టంగా అర్థం చేసుకోవాలి. 1) ఉపాసన అంటే దగ్గరగా కూర్చోవడం - ఎవరికి దగ్గర - ఈశ్వరునికి దగ్గర. ఈశ్వరుడు నిరాకారుడు. ధ్యాన ధారణలు సులభంగా చేసుకోవడానికే అతని ప్రతిమనుగాని, ఫోటోగాని ఉపయోగించుకోవచ్చు. మానవ అంతఃకరణతోపాటు అతని ఉన్నత ఆలోచనలు ఆదర్శభావాలు సున్నిత రూపంలో ఉంటాయి. ఇదే భక్తి, ఈశ్వర సాన్నిధ్యం, ఈశ్వర దర్శన వాస్తవ రూపం.

2) రెండో చరణం సాధన: దీని పూర్తి పేరు జీవన సాధన. ఆలోచనలలో సున్నిత భావాల కలియక ఉపాసన క్షేత్రంలోనికి వెళుతుంది. కాని శారీరక కార్యపరంపర జీవన సాధనలోనికి వస్తుంది. దీనిలోనికి ఆహార విహారాదులు, నివసించే తీరు, ఇంద్రియనిగ్రహం, కర్తవ్య పరాయణత, సద్గుణాల వృద్ధి, దుర్గుణాలు వదిలించుకోవడం వంటివి వస్తాయి. నిగ్రహం, క్రమ శిక్షణలతో సరైన రీతిలో క్రియా కలాపాలను అవలంబించడమే జీవన సాధన అని పిలువబడుతుంది.

3) మూడో చరణం ఆరాధన: దీనిని అర్చన అని కూడా పిలుస్తారు. వేరే మాటలలో పుణ్య పరమార్థమని, లోక కళ్యాణం అని, జన శ్రేయస్సు అని కూడా అంటారు. ఈ ప్రపంచం అనంత బ్రహ్మయొక్క ప్రత్యక్ష రూపం. ఇందులో నివసించే ప్రాణులను, పదార్థాలను, పరిస్థితులను చక్కగా ఉంచడమే ఆరాధన. మనిషి సంఘజీవి అయినందువలన అందరికీ ఋణపడి ఉంటాడు. ఈ ఋణం నుండి విముక్తి పొందడానికి వ్యక్తి పరమార్థ పరాయణుడు కావలసి ఉంది.

జీవన సాధనా ధర్మం నగదు (ధనం) వంటిది. దీని ప్రతిఫలం పొందడానికి ఎక్కువ కాలం వేచి ఉండే అవసరం లేదు. ఈ చేతితో నగదు ఇచ్చి ఆ చేతితో తీసుకొనే వస్తువు వంటిది. ఈ మార్గంలో వెళితే ప్రతి అడుగులోనూ ఫలితం లభిస్తూనే ఉంటుంది. ఒక అడుగు ముందుకు వేస్తే గమ్యస్థానం (మజిలీ) అంతేదూరం తగ్గుతుంది. అలాగే అడుగు వెనకకువేస్తే గమ్యం కూడా అంతే దూరం అవుతుంది. ఈవిధంగా జీవన సాధన యదార్థరీతి తర్కం, వివేక పూర్ణస్థితులతో చేసినట్లైన, దాని ప్రతిఫలం రెండు రకాలుగా అందుతుంది. మొదటిది పశుప్రవృత్తులు తొలగిపోతాయి. మలిన వాతావరణంలోని కల్మషం కూడా వదలిపోతుంది. నరపశువు నుండి నరదేవునిగా ప్రగతి పొందేందుకు చేయవలసిన వ్యవస్థ సరైన రూపంలో ఏర్పడుతుంది. ఇది రెండో లాభం.

ప్రజ్ఞాయోగంపేరుతో సర్వజనుల సులభసాధన కోసం ఆ విధానం తయారు చేయబడింది. తమ లక్ష్యసాధనకు అనేక ఉపాయాలు, సేవలతో సరళ రీతిలో, దీని సహాయంతో తమ అభీష్టాన్ని తక్కువ సమయంలో నెరవేర్చుకొని అధిక సఫలత పొందవచ్చును. ప్రజ్ఞాయోగపు రెండు సంధ్యలు అత్యధిక సరళం మహత్తరమైనవి. ఒకటి నిద్ర లేస్తూనే (కనులు తెరుస్తూనే) పరుపు పై నుండి పదిహేను నిమిషాలు 'ప్రతిదినం ఒక కొత్త జన్మ' అనే భావనతో సంధ్యను ఆరంభించాలి. రెండో రాత్రి నిద్రించే సమయంలో నిద్ర ఒకదైవిక మరణం అనే అనుభవాన్ని పొందాలి. జీవన శక్తికి జనన మరణాలనేవే మొదలు, తుది అంచులు. ఈ రెండింటిని సరైన రీతిలో ఉంచితే మధ్యభాగం సవ్యంగా ఉంటుంది.

ఆత్మబోధ అని ప్రజ్ఞాయోగపు ప్రథమ సాధనను అంటారు. కనులు తెరుస్తూనే ఈ రోజు నా కొత్త జన్మ ప్రారంభమైందని, రాత్రికి మృత్యు ఒడిలోనికి వెళ్ళాల్సి ఉంది అని భావించాలి. ఈ వ్యవధిని సర్వోత్తమ రీతిలో ఉపయోగించడమే జీవన సాధన యొక్క మహత్తర లక్ష్యం. ఇదే నా పరీక్షా క్రమం. దీనిలోనే భవిష్యత్తులో సంభవించే విషయాలకు సంబంధం ఉంది.

రెండో సంధ్య రాత్రి నిద్రించే సమయంలో పూర్తి చేయాల్సి ఉంది. దానిలో అప్పుడు మృత్యుఒడిలోకి వెళుతున్నానని అనుకోవాలి. ఈ ఒక్కరోజు జీవితం ఏవిధంగా సదుపయోగం చేయబడిందో భగవంతుని దర్బారులో చెప్పాల్సి ఉంటుంది. దీని కోసం రోజంతా చేసిన క్రియా కలాపాలను, ఆలోచనలను సమీక్షించుకోవాలి.

పగలు పూర్తిచేయగలిగే మరి రెండు చరణాలు ప్రజ్ఞాయోగంలో ఉన్నాయి. ఇందులో ఒకటి భజన, రెండోది ఆలోచన (చింతనం). భజన కోసం పూజా మందిరంలో కూర్చోవాలి. శరీరం, మనస్సు, వాక్కులను పరిశుద్ధం చేసుకోడానికి జలంతో పవిత్రీకరణం చేసుకొని, తర్వాత ఆచమనం చేయాలి. దేవ ప్రతిమ రూపంలో గాయత్రి ఫోటోను, ధూప దీపాలతో స్థాపించాలి. దీనినే ఇష్ట దైవారాధన అంటారు.

**నవ్వు మందుగా ఉపయోగపడుతుంది.**

ఇప్పుడు జపం, ధ్యానముల వంతు వస్తుంది. రెండూ ఒకేసారి చేయవచ్చు. గాయత్రీ జపం మానసికమైన కూడా, సరైనదే. ఎంత సేపు ఎన్ని మంత్రాలు జపం చేయాలనేది లెక్కించడానికి జపమాల లేక గడియారం పెట్టుకోవచ్చు. ఎవరికైనా గాయత్రీ మంత్రానికి బదులుగా వేరే మంత్రమేదైనా ప్రీతిపాత్రమైతే దానిని జపించవచ్చును. ఓంకార జపమైనా చేయవచ్చు.

జపంతోపాటు ఉదయిస్తున్న బంగారు కాంతిలో ఉన్న సూర్యభగవానుని ధ్యానం కూడా చేయవచ్చును. ఆచ్ఛాదన లేని మన శరీరమంతా సూర్యునికెదురుగా కూర్చొన్నట్లు భావించాలి. సూర్యుని సూక్ష్మకిరణాలు మన స్థూల, సూక్ష్మ, కారణశరీరాలు మూడింటిలోను ప్రవేశిస్తున్నట్లు భావించాలి. కిరణాలు శక్తి, కాంతులకు ప్రతీకలు.

ప్రజ్ఞాయోగసాధన నాలుగో చరణం చింతన (ఆలోచన). ఇది మధ్యాహ్నం తర్వాత ఎప్పుడైనా చేసుకోవచ్చును. పదిహేను నిముషాలు సమయమైనా చాలు. దీనిలో వర్తమాన స్థితి సమీక్షించబడుతుంది. ఏ లోటు కన్పిస్తుందో, దానిని సరి చేసుకోవడానికి ప్రణాళిక వేయాల్సి ఉంటుంది. ఇదే చింతన. దీని కోసం ఏకాంత స్థానాన్ని ఎన్నుకోవాలి.

జీవన సాధన నిత్య కృత్యం ఈ విధంగా ఉంటుంది. లేస్తూనే ఆత్మబోధ. నిద్ర పోయేముందు తత్వబోధ. మొదటి ఝాములో భజన, మూడో ఝాములో చింతన (ఆలోచన). ఈ నాలుగు విధాల నిత్య కర్మల సమ్మేళనమే ధర్మార్థ కామ మోక్షాలనే నాలుగు పురుషార్థాలకు ఆధారమౌతుంది.

వారాంతపు విశేష సాధనలో నాలుగు విశేష నియమాల విధానాన్ని అవలంభించాలి. అవి 1) ఉపవాసం 2) బ్రహ్మచర్యం 3) మౌనం 4) ప్రాణశక్తిని పెంచుకొనుట. ఇంకా ప్రత్యేక సాధనలు ఆశ్వయుజ, చైత్రమాసాల నవరాత్రులలో చేయబడతాయి. ఈ దినాలలో గాయత్రీ మంత్రాన్ని 24 వేల జప పరంపరను చేయడం పూర్వకాలం నుండి జరుగుతున్నదే.

ఈవిధంగా జీవన సాధన జరిగితే, జీవన దేవతను తోడుగా తీసుకున్నట్లే భావించవలసి ఉంటుంది. ఈమెయే అందరికంటే పెద్ద దేవత. ఇరవై ఒకటవ శతాబ్దంలో జీవన దేవత పూజ ఆరాధనలకే అత్యధిక ప్రాధాన్యత ఇవ్వబడుతుంది.

*– అఖండజ్యోతి, ఫిబ్రవరి 2011*

*అనువాదం : బాసంగి శ్రీరాములు*

## యుగశక్తి గాయత్రి మాసపత్రిక చందాదారులకు సూచన

*యుగశక్తి గాయత్రీ మాసపత్రికను నెలనెలా పాఠకులకు సకాలములో అందించుటకు గాయత్రీ చేతనా కేంద్రము శాయశక్తులా కృషి చేయుచున్నది.*

*ప్రతినెల 28, 29 తేదీలలో పత్రికను నిర్ణయించిన పోస్టాఫీసులో పోస్టు చేసినచో పోస్టల్ ఛార్జీలో రిబేటు లభించి, 75 పైసల ఛార్జీతో పోస్టు చేయవలయును. అట్లు చేయనిచో ప్రతి పత్రికకు రూ. 2/–లు చెల్లించవలసియున్నది.*

*పత్రిక చందా డబ్బు, చిరునామాలు ఒకేసారి సవివరముగా పోస్టల్ కోడ్ నంబరుతో వ్రాసి మాకు పంపించినచో, పత్రికను చందాదారునకు చేర్చుటలో తోడ్పడుతుంది. అట్లు కాక కొందరు డబ్బును ఆన్‌లైన్‌లో పంపుచున్నారు. ఆ తరువాత చిరునామాలు ఈ–మెయిల్ చేయుట పోస్టులో పంపుట జరుగుచున్నది. డబ్బు పంపినదానికి, పంపిన పేర్లకు ఒక్కొక్కసారి పొంతన ఉండుటలేదు. అట్లే డబ్బు పంపించి, ఆ వివరాలను సకాలములో, సరియైన వ్యక్తికి తెలియజేయుటలో జాప్యం, వెరసి పత్రికను అప్పుడప్పుడు చిరుమానాదారునికి చేర్చుటలో పొరపాట్లు జరుగుచున్నది.*

**ఇంకా :** *1) పోస్టల్ డిపార్టుమెంటులో పోస్ట్‌మ్యాన్ పొరపాట్లు కొన్ని సమయాలలో ఉంటుంది. 2) పోస్టుమ్యాన్ వచ్చినప్పుడు ఇంటికి తాళము వేసి ఉండుట. ఇంటి నంబరు లేక, పిన్‌కోడ్ లేక ఈ కారణాలతో అందుట లేదు. 3) అన్నీ సక్రమముగా ఉన్ననూ, పత్రికరానిచో మీకు సంబంధించిన పోస్టు మాస్టరుకు ఫిర్యాదు వ్రాసి ఇచ్చి, కాపీని మాకు పంపించండి. అప్పుడు ఫలితము తప్పక ఉంటుంది. కేవలం మాకు ఫిర్యాదు చేసినందువలన పరిస్థితి చక్కబడదు. దీనిని గమనించప్రార్థన. 4) కంప్యూటర్ ఆపరేటర్ మారినారు. ఇప్పుడు సిస్టమ్ బాగుగా నడచుచున్నది. మీరు చిరునామాలు చక్కగా వ్రాసి పూర్తి వివరాలతో మాకు పంపినచో, మీకు వారములోగా కోడ్ నంబరు తెలుపుచూ మీ ద్వారా ముట్టిన చందాదారుల వివరాలు మీకు పంపగలరు.*

**సంతృప్తి కలుగజేసే ఆలోచనల వల్ల ఉత్సాహం, ఉత్తేజం పెల్లుబికి వస్తాయి.**

గాయత్రి - 24 శక్తి ధారలు (23)

# పయశ్విని

గోమాతను పయశ్విని అని అంటారు. స్వర్గంలో ఉండే కామధేనువుని కూడా పయశ్విని అని అంటారు. గాయత్రి సాధనలో సాధకులకు బ్రాహ్మణత్వం, గో సాన్నిధ్యానికి అత్యంత ప్రాముఖ్యత ఉన్నది. పంచామృత పంచగవ్యాన్ని అమృతంగా భావిస్తారు. గోమయ, గోమూత్రాల రోగనివారణశక్తి సర్వవిదితమే. భారతీయ వ్యవసాయంలో గోజాతి లేకుండా పనిగడవదు. పోషక ఆహారంలో గోక్షీరం ఉత్తమమైనది. గోవు ఆది నుండి అంతం వరకు సాత్వికతతో నిండి ఉన్నది. ఈ దేశములో పయశ్విని యొక్క మహత్వం అర్థం చేసుకున్న రోజులలో పాల నదులు ప్రవహించేవి. మనిషి శారీరిక, మానసిక దృష్టిలో దైవీ జీవనం గడిపేవాడు.

గాయత్రి సాధకుని అంతఃకరణలో కామధేనువు అవతరిస్తుంది. అతని కోరికలు భావములుగా మారతాయి. ఫలస్వరూపంగా ప్రపంచంలోని కష్టాలు, బాధలు సహజంగా తొలగిపోతాయి. కోరికలు అనంతం. ఒక కోరిక తీరుతూనే ఇంకొక పెద్ద కోరిక కలుగుతుంది. ప్రపంచంలోని సమస్త సంపదలు లభించినా ఒక మనిషి కోరికలు తీర్చలేకపోవచ్చు. కాని కోరుకున్నవి జరిగినా జరగకపోయినా తమ కోరికలలో, ప్రవర్తనలో ఉత్కృష్ఠత వలన ఆనందం, ఉల్లాసం పెల్లుబుకుతూనే ఉంటాయి. ఈ స్థాయి ఆలోచనలను కల్పవృక్షమంటారు. ఇదే కామధేనువు కూడా.

కామధేనువు గాయత్రి మాత ద్వారా ప్రేరేపింపబడిన ఒక ప్రవృత్తి. ఈ ప్రవృత్తి మానవ అంతరాళములో ఉచ్చస్తరీయ ఆధ్యాత్మికత, విశ్వాసాల రూపంలో కనిపిస్తుంది. ఇది తల్లిపాలు తాగుతున్న సమయంలో ఎంత ఆనందం కలుగుతుందో, సాధకునికి అంత ఆనందాన్ని ఇస్తుంది. దీనినే ఆత్మానందం అని, బ్రహ్మానందమని, పరమానందమని అంటారు. పరిపూర్ణ తృప్తిని పొందడమే జీవన లక్ష్యం. గాయత్రి యొక్క ఉచ్చస్తరీయ అనుగ్రహం ఈ రూపంలోనే లభిస్తుంది. ఈ తృప్తి అనే వరదానం. లభించటమంటే కామధేనువు లభించడమే. గాయత్రి సాధకుడు దైవికమైన రసాస్వాదన చేస్తాడు.

గాయత్రి వర్గంలో ఐదు శ్రేష్ఠమైనవి ఉన్నాయి. గాయత్రి, గంగా, గోవు, గీత, గోవిందుడు. గంగా-గాయత్రిల జన్మదినం ఒకటే. గోసేవ కలుపుకుంటే అది త్రివేణి అవుతుంది. గాయత్రి ఉపాసనలో గోసేవ, గో సంరక్షణ అత్యంత లాభదాయకం.

గాయత్రి కామధేనువుగా చెప్పబడింది. కామధేనువు, పయశ్విని పర్యాయ వచకములు. శాస్త్రములలో కామధేనువును వివరించేటప్పుడు కల్పవృక్షం వలె మనోకామనలను తీర్చగలదిగా చెప్తారు.

దేవతలు ఆత్మకాములు. అన్ని కోరికలు తీరినవారిని ఆత్మకాములంటారు. తృప్తినిచ్చే ఆ కోరికలనే సద్భావనలంటారు. ఉత్కృష్ఠ ఆలోచనలు, ఆదర్శములవైపు మొగ్గు ఎవరికి కష్టం కాదు. సద్భావనలను ప్రతి పరిస్థితిలోను చరితార్థం చేసుకోవచ్చు. ఆత్మకామునికే తుష్టి, తృప్తి ఆనందం లభిస్తాయి. కల్పవృక్షం స్వర్గంలో ఉంటుంది. దేవతలు ఆత్మకాములయ్యారు. ఇంతకీ చెప్పేదేమిటంటే దైవత్వం ఆత్మకామస్థితి ఒక్కటే. తృప్తి లేకపోవడం అనేది దేవతలు ఎరుగరు. కల్పవృక్షం, కామధేనువుల యొక్క విశేషం ఏమంటే అవి కోరికలను అప్పటికప్పుడు తీర్చివేస్తాయి.

కామధేనువు క్షీరం సేవించిన దేవతలు అజర, అమరులయ్యారు. అజర అంటే వృద్ధాప్యం లేనివారు, యవ్వన ఆనందం పొందేవారు. శరీరక్రమంలో ఇది సంభవం కాదు. పుట్టిన ప్రతి మనిషి సమయానుసారం వృద్ధుడవుతుంటాడు. కామధేనువు క్షీరం పానం చేసిన వారికి లభించే ఆరోగ్యం, సౌందర్యం శరీరానికి సంబంధించినవి కాక మానసికమైనవి, ఆత్మికమైనవి. గాయత్రి ఉపాసకుడు మానసిక దృష్టిలో ఎల్లప్పుడు యువకుడుగానే ఉంటాడు. వారి ఆశయాలు, ఆచరణలు ఉల్లాస భరితంగా ఉంటాయి. కన్నులలో మెరుపు, తేజస్సు, పెదవులపై చిరునవ్వు ఎప్పుడు తరగవు. ఇదే చిరయవ్వనం. దీనినే అజర స్థితి అంటారు. కామధేనువు క్షీరపానం చేసినవారు అమరులవుతారు, గాయత్రి ఉపాసకులు కూడా అమరులవుతారు. ఆత్మజ్ఞానం లభించడం వల్ల అమరత్వం అనుభవమవుతుంది. శరీరం మార్చుకున్నప్పటికి మరణం వంటి పరిస్థితి భయంకరంగా కనిపించదు. అతని సత్కర్మలు, ఆదర్శాలు అనుకరణీయం. అందువల్ల అతను యశస్సు పొందుతాడు, అమరుడవుతాడు. అందువల్ల గాయత్రిని పయశ్విని అని చెప్పబడింది. పృథ్విపై కామధేనువుగా కీర్తించబడింది.

- అనువాదం : శ్రీమతి జ్ఞానప్రసూన

**మనను మనం విశ్వసించాలి. మనని మనం గౌరవించుకోవాలి.**

# మూర్తి రహస్యములను తెలుసుకొని ఉన్నతస్థాయి సాధకులు కండి!!

ఆదిశక్తి యొక్క లీలాగాథ సృష్టిలోని కణకణమును గురించి తెలియజేస్తూ ఉంది. జీవితంలోనూ, జగత్తులోనూ దృశ్యా దృశ్యరూపములో ఏవైతే ఉన్నవో అవన్నీ కూడా ఆ 'చిత్‌శక్తి' యొక్క చైతన్యక్రీడయే తప్ప మరేమీ కాదు. నిరంతర సాధనతో శుద్ధమై, సిద్ధిని పొందిన చేతనత్వము కలిగిన వ్యక్తులు ఈ సత్యమును ప్రతిక్షణమూ అనుభూతి చెందగలరు. శక్తి సాధకులకు మాత ఆదిశక్తి విశ్వమంతటా నిండి ఉంది. ఈ విశ్వమంతా ఆమె యొక్క చిన్మయరూపమే. అసలు పదార్థమునకు అస్తిత్వమే లేదు అనే సత్యముతో ఆధునిక వైజ్ఞానిక పరిశోధనలు కూడా ఏకీభవిస్తున్నాయి. పదార్థము క్షణక్షణమూ క్షయమౌతూవుంటుంది. పదార్థము అనేది ఏ క్షణములో సృష్టించబడిందో, ఆ క్షణమునుండే దాని వినాశనము కూడా ప్రారంభమౌతుంది. అస్తిత్వము అనేది, దానిని నిర్మించే శక్తికి ఉంటుంది. ఆ శక్తి యొక్క ఒడిలోనే సమస్తమైన నామరూపాలు వివిధ ఆకృతులను ధరిస్తూ, విసర్జిస్తూ ఉంటాయి. అన్ని రకాలైన అస్తిత్వములకూ మూల ప్రవాహము ఆమెయే!

శక్తి యొక్క సమస్తమైన రూపాలు, రంగులూ మాతయైన ఆదిశక్తి యొక్క గర్భమునుండే ఉద్భవించినవని తత్త్వవేత్తలు ఎల్లప్పుడూ తమ తాత్త్వికచింతనలో అనుభూతి చెందుతూ ఉంటారు. ఆమెయే ఆది, మధ్యము, అంతమూ కూడా! ఆమె యొక్క ఉనికి లేనప్పుడు, ఈ ప్రపంచమంతా శవమూ, శ్మశానమే తప్ప మరింకేమీ కాదు. అందుచేతనే మహర్షులూ, సిద్ధపురుషులూ ఈ యావత్ప్రపంచమూ మాత విశ్వమయి యొక్క చిన్మయ రూపముగా వర్ణించారు. ఈ సత్యాన్ని గురించిన వేదాంతపరమైన, పారమార్థికపరమైన వివరణ త్రివిధ రహస్యములు యొక్క తృతీయ ఆయామములో నొక్కివక్కాణించబడినవి.

ఈ త్రివిధ రహస్యములే 'శ్రీదుర్గాసప్తశతి' యొక్క ఆఖరు మూడు అంగములనీ, ఈ చివరి మూడు అంగములలోనే అంతిమమూర్తి రహస్యములు ఇమిడివున్నవనీ ఆదిశక్తి యొక్క లీలాగాథను వివరించే గత సంచికలో చెప్పబడినవి.

ఋషివాక్కులలో ఈ మూర్తి రహస్యమును గురించిన వివరణ 50 మంత్రములలో ఇవ్వబడినది. ఈ ప్రకరణములో భగవతి ఆదిశక్తి యొక్క అంగములలో కొలువైన ఆరుగురు దేవతామూర్తుల స్వరూపమును గురించి చిత్రించబడినది. వారు 'నంద, రక్తదంతిక, శాకంభరి, దుర్గ, భీమ, భ్రామరి' అనే దేవతామూర్తులు. వీరి స్వరూపముల గురించిన ప్రతిపాదన ఉండటంచేతనే ఈ ప్రకరణమునకు 'మూర్తిరహస్యము' అనే పేరు ఇవ్వబడినది. దీనియొక్క రహస్యార్థమును గురించి ఆలోచిస్తే, భగవతి యొక్క ఆరు రూపములు మూలశక్తి యొక్క ఆరు రహస్యపూర్ణమైన ఆయామములుగా అర్థమౌతుంది. వీనిని గురించి తెలుసుకుంటే, ఈ యావత్‌సృష్టిని గురించి తెలుసుకున్నట్లే! నంద– అదిశక్తి యొక్క ప్రథమరూపమని ఋషి వర్ణిస్తున్నాడు. ఆమె యొక్క శ్రీఅంగముల కాంతి బంగారు వర్ణము వలె అత్యుత్తమమైనది. ఆమె బంగారురంగు వస్త్రములను ధరిస్తుంది. ఆమెనే 'ఇందిర, కమల, లక్ష్మి, రుక్మాంబుజాసన' అనే నామధేయములతో కూడ పిలుస్తారు. ఈ మహాదేవతలు సాధకుని ఉపాసనతో ప్రసన్నులై ముల్లోకములనూ ఉపాసకుని యొక్క అధీనం చేస్తారు. తల్లియైన ఆదిశక్తియొక్క రెండవరూపము రక్తదంతిక. ఆమె అన్నిరకాలైన భయములనూ హరించివేస్తుంది. ఈమెను ఉపాసించేవారికి ఎటువంటి భయమూ దరిచేరదు. ఈమెకు అరుణరంగు ఎంతో ప్రియమైనది. ఈమె శరీరవర్ణము అరుణవర్ణము. అరుణ వస్త్రములను ధరించే ఈ మహాదేవి యొక్క అస్త్రశస్త్రములూ, నేత్రములూ, కేశములూ, గోళ్ళూ, దంతములూ అన్నీకూడా అరుణవర్ణములోనే ఉంటాయి. అందుచేతనే ఆమె 'రక్తదంతిక' అని పిలువబడుతున్నది. ఆమెయే 'రక్తచాముండ, యోగీశ్వరి' అనికూడా చెప్పబడినది. తనను ఉపాసించే భక్తులను ఆమె అన్నివిధాలుగా సంరక్షిస్తుంది.

తల్లియైన ఆదిశక్తి యొక్క మూడవరూపము 'శాకంభరీదేవి'. కమలంలో నివాసముండే ఈ పరమేశ్వరి నీలవర్ణ శరీరమును కలిగియుంటుంది. ఆ దేవి మానవులు కోరుకునే అనంతమైన రుచులతో కూడిన శాకములను, ఫలపుష్పములను సమృద్ధిగా కలిగియుండి, మానవుల ఆకలిదప్పులను తొలగింపజేసి, మృత్యుభయమును నశింపజేస్తుంది. ఈమెనే 'శాకంబరి, శతాక్షి, దుర్గ' అనే నామములతో కూడా పిలుస్తారు. తల్లియైన దుర్గాదేవి రూపము శోకరహితమై, దుష్టులను అణచివేయటమేగాక, మానవుల పాపములను ఆపదలను శాంతింపజేయగలదు. 'ఉమ, గౌరి, సతి, చండి, కాళిక, పార్వతి' అనే నామధేయములు కూడా దుర్గాదేవియే! శాకంభరి, దుర్గామూర్తులను ఉపాసించేవారికి

**పర్యావరణ కాలుష్యం అనారోగ్యాన్ని కలుగజేస్తుంది.**

అన్నపానాదులు, అమృతరూపమైన అక్షయఫలములు శీఘ్రంగా లభించగలవు.

ఆదిశక్తియొక్క ఐదవరూపమైన భీమాదేవిది కూడా నీలవర్ణమే. ఆమె రూపము భయంకరముగా ఉంటుంది. ఆమె తన హస్తములలో చంద్రహాసమనే ఖడ్గమును, డమరు, తల, పానపాత్ర మొదలైనవానిని ధరించియుంటుంది. భగవతియొక్క ఆరవమూర్తి 'భ్రామరీదేవి' ఆమె తనయొక్క తేజోమండలం కారణంగా చూడశక్యముగాని విధంగా ఉంటుంది. ఈమె అంగాంగములు కూడా వివిధవర్ణములలో ఉంటాయి. ఈమె చిత్రవిచిత్రములైన ఆభరణములను ధరించియుంటుంది. చిత్రభ్రమరపాణీ! మహామారీ!' అనే పేర్లతోకూడా ఈమెను స్తుతిస్తారు. ఈమెను కీర్తించేవారికి వారి మనోభీష్టములు వాటంతట అవే నెరవేరుతాయి.

'ఈ మూర్తి రహస్యములను గురించిన అత్యంత గోపనీయమైన రహస్యము వారిని ధ్యానించుట' అని ఋషి వివరిస్తున్నారు. ధ్యానం ద్వారానే వీరిని గురించిన సమస్తమైన రహస్యములూ సాధకుని చేతనత్వములో ప్రకటీకృతమౌతాయి. 'ఒక సమయంలో ఒక్క దేవీరూపమును మాత్రమే ధ్యానించాలి' అనేది ధ్యాన ప్రక్రియలో నిమగ్నం కాగోరే సాధకుల కర్తవ్యం. ఈ సాధన ద్వారా దేవియొక్క దైవీరూపం ప్రకటీకృతమౌతుంది. ధ్యానమనే ఈ ప్రక్రియ సాధకుని అస్తిత్వంలో సర్వదా ఒక క్రొత్త శక్తి ప్రవాహాన్ని నింపుతూ వుంటుంది. ఇంతేకాక రూపాంతరణ మరియు ఆధ్యాత్మిక పరివర్తనలకు చెందిన ఒక లోతైన ప్రక్రియ సాధకునిలో జరుగుతూ వుంటుంది. ఈ ప్రక్రియ యొక్క ప్రభావంతో ఉపాసకుడు ఆదిశక్తితో మమేకమై అనేక ఆధ్యాత్మిక శక్తుల విభూతుల భాండాగారము కాగలడు.

ఈ మూర్తి రహస్యము యొక్క ఆఖరు అధ్యాయములో సప్తశతి యొక్క పారాయణా మాహాత్మ్యము చెప్పబడినది.

**సప్తజన్మార్జితైర్ఘోరైర్బ్రహ్మహత్యాసమైరపి ।**
**పాఠమాత్రేణ మన్త్రాణాం ముచ్యతే సర్వకిల్బిషై: ॥**

అనగా 'శ్రీదుర్గాసప్తశతిలోని మంత్రములను పారాయణ చేసినంతమాత్రముననే ఏడు జన్మలలో చేసిన బ్రహ్మహత్యా సమానమైన ఘోరపాతకములు, సమస్త కల్మషములనుండి విముక్తి చెందగలరు' అని అర్థము.

'శ్రీదుర్గాసప్తశతిలోని ప్రతి ఒక్క శ్లోకమూ ఒకమంత్రమే' అన్న విషయము అనుభవజ్ఞులైన సాధకులకు తెలిసేవుంటుంది. ప్రతి మంత్రమూ, అందులోని భావము, అర్థమునకు తగినట్లుగా సాధకునకు మంచి ఫలితములను ఇవ్వగలదు.

ఈ ప్రక్రియలో దృశ్యాదృశ్యములైన అనేక ఆయామములు ఉన్నవి. ఇవి వ్యావహారికమైనవి, ప్రయోగించదగినవి. ప్రయోగించేవారి సంకల్పానుసారము ఫలితములను ఇచ్చి తీరగలవు. ఇందుకు కావల్సినదల్లా పారాయణ చేసే సాధకుడు తన సాధనను నియమంగా చెయ్యగలగటమే. సాధకుని ఆచరణ, వ్యవహారము, ఆహారపానీయములలో 'సదాచరణ-తపస్సు' అనేవి అనివార్యంగా ఉండాలి. ఇలా చేయగలిగినట్లయితే ఫలితాలు ఆశ్చర్యజనకంగానూ, ప్రభావశాలిగానూ ఉంటాయి. ఎవరైనా దీని గురించిన సత్యాన్ని తెలుసుకొనగోరితే, వారు 108 రోజులు అనుష్ఠానపూర్వకంగా 'శ్రీదుర్గాసప్తశతి'ని పారాయణ చేసి ఆశ్చర్యకరమైన అనుభూతులను స్వయంగా పొందగలరు.

ఇందులో మరియొక రహస్యం కూడా ఇమిడివుంది. శ్రీదుర్గాసప్తశతి యొక్క మంత్రములుకూడా స్వయంగా ఆదిశక్తి యొక్క ప్రభావవంతమైన మంత్రమూర్తి రూపములే. పారాయణ, సాధనలే ఆమెను ధ్యానించటం, అర్చించటంతో సమానం. ఈ పద్ధతిననుసరించినవారికి తప్పకుండా మనోభీష్టములు నెరవేరగలవు. ఈ రహస్యమునకు ముగింపు వాక్యములు పలుకుతూ ఋషి ఈవిధంగా చెప్తున్నారు.

**సర్వరూపమయీ దేవీ సర్వం దేవీమయం జగత్ ।**
**అతోఽహం విశ్వరూపాం తాం నమామి పరమేశ్వరీమ్ ॥**

అనగా 'దేవి సర్వమయి. ఈ యావత్ ప్రపంచమూ దేవీమయమే. అందుచేత విశ్వరూపమైన ఆ దేవికి నమస్కరిస్తున్నాను' అని అర్థము.

మాతయొక్క ఈ విశ్వరూపాన్ని ఉపాసించేవారు స్వయంగా వేదాంతజ్ఞానమునకు సంబంధించిన అన్ని లోతులనూ తెలుసుకొనగలరు.

*- అఖండజ్యోతి, అక్టోబరు 2007*
*అనువాదం : శ్రీమతి కృష్ణకుమారి*

## సంజీవని సాధనా శిబిరము

*11 మే, 2011 నుండి 19 మే, 2011 వరకు 9 రోజుల సంజీవని సాధనా శిబిరము శాంతికుంజ్, హరిద్వార్‌లో తెలుగుభాషలో నిర్వహించబడుచున్నది. ఆసక్తి కలవారు ముందుగానే తమ పేర్లను గాయత్రీ చేతనా కేంద్రములో నమోదు చేసుకొనవలసినదిగా కోరడమైనది.*

**ఫోన్ నెం. 9949111175**

మానసిక కాలుష్యం కూడా అనారోగ్యాన్ని కలుగజేస్తుంది.

బ్రహ్మవర్చస్

# దేవసంస్కృతి పరిశోధనా సారాంశము

ఈ శీర్షిక ద్వారా యుగశక్తి గాయత్రి పాఠకులకు బ్రహ్మవర్చస్ - దేవసంస్కృతి పరిశోధనా సారాంశమును నూతనంగా పరిచయం చేస్తున్నాము. వైజ్ఞానిక ఆధ్యాత్మికత యొక్క ప్రయోగాత్మక దర్శనమును మరియు ఆధ్యాత్మిక విజ్ఞానము మరియు దార్శనిక విజ్ఞానము యొక్క ఉచ్చస్తరీయ ఉద్దేశ్యములను సాధించేందుకు 30 సంవత్సరాల క్రిందట బ్రహ్మవర్చస్ శోధ్‌సంస్థాన్ స్థాపించబడింది. యుగద్రష్ట, పరమపూజ్య గురుదేవులు వైజ్ఞానిక ఆధ్యాత్మికత బీజములను తీర్థస్థానమైన భగవతి గంగా తీరాన నాటారు. ఆయన తన జీవిత పర్యంతము వీటిని సంరక్షించారు. తన తపస్సుతో, ప్రాణముల యొక్క ప్రఖర ప్రజ్ఞతో వాటిని తడిపి అంకురింపచేశారు. దీని ఉజ్వల భవిష్యత్తు గురించి ఆయన ఎన్నో కలలు కన్నారు. ఆ కలలను సాకారము చేసుకునేందుకు ఆదరణీయ డాక్టర్ ప్రణవ్‌పండ్యాగారిని ఆహ్వానించారు. యుగదేవత పిలుపును అందుకున్న ఆయన పరుగుపరుగున వచ్చారు. వస్తూనే ఆయనను గురుదేవులు బ్రహ్మవర్చస్ శోధ్‌సంస్థాన్‌కు నిర్దేశకులుగా నియమించారు.

ఇది జరిగి ఇప్పటికి 30 సంవత్సరాలు అవుతున్నది. ఈ మధ్యకాలంలో గాయత్రీపరివార్ సభ్యుల మనస్సులో ఎన్నో విషయాల గురించి తెలుసుకోవాలనే జిజ్ఞాస పెరిగింది. ఈ బ్రహ్మవర్చస్ శోధ్‌సంస్థాన్ రూపురేఖలు ఏమిటి? అక్కడ ఎటువంటి పరిశోధనలు చేయబడతాయి? వాటి విధి-విధానాలు ఏమిటి? పరమపూజ్య గురుదేవుల ద్వారా కనుగొనబడిన ఈ వైజ్ఞానిక ఆధ్యాత్మికత (scientific spirituality) అంటే ఏమిటి? దీని స్వరూపము, ప్రక్రియలు, వాటి ఉద్దేశ్యాలు ఏమిటి? ఇటువంటి అనేక ప్రశ్నలు జిజ్ఞాసువులైన దేవపరివార్ సభ్యుల మనస్సులో మెదులుతున్నాయి. ఎంతోమంది యువకులు బ్రహ్మవర్చస్ శోధ్‌సంస్థాన్ యొక్క పరిశోధనాకార్యంలో తమ జీవితాలు అర్పించాలని ఉవ్విళ్ళూరారు. ఇటువంటి స్థితి ఈనాటి యువతరంలో కూడా ఉన్నది కనుకనే వారు నిరంతరం ఈ పరిశోధనా-ప్రక్రియలో భాగస్వామ్యులౌతూనే ఉన్నారు.

మీరు బ్రహ్మవర్చస్ యొక్క పరిశోధనా కార్యముల వివరాలు ఎప్పుడు ప్రచురిస్తారు? ఈ పరిశోధనా ఫలితాలు ఏమిటి? అని చాలామంది అడుగుతూనే ఉన్నారు. కొన్ని అనివార్యకారణాల వల్ల ఈ ప్రశ్నలన్నింటికీ సరైన సమాధానం ఇవ్వలేకపోయాము. సమయం వచ్చినప్పుడు అన్ని తథ్యములను ఖచ్చితంగా ప్రచురిస్తాము అని సర్దిచెప్తూ వచ్చాము. అలా కాలం గడిచిపోయింది. ఈ మధ్యకాలంలో బ్రహ్మవర్చస్ శోధ్‌సంస్థాన్ విస్తరించి దేవసంస్కృతి విద్యాలయంగా రూపుదిద్దుకుంది. ఇది 2001లో స్థాపించబడి 2002లో దేవసంస్కృతి విశ్వవిద్యాలయం అనే విరాట్ స్వరూపాన్ని ధరించింది. ఆలోచనాపరులైన వ్యక్తులు బ్రహ్మవర్చస్ శోధ్‌సంస్థాన్ యొక్క ఉద్దేశ్యాలను, కార్యక్రమాలను విస్తృతము చేసేందుకే దేవసంస్కృతి విశ్వవిద్యాలయం ఆవిర్భవించిందనే విషయం అర్థం చేసుకున్నారు.

స్థాపించబడిన ఆరు సంవత్సరాలలో ఈ విషయం నిరూపించబడింది. విశ్వవిద్యాలయం అంతా ఈ ఉద్దేశ్యంతోనే స్థాపించబడింది. ఇక్కడ నేర్పించే పాఠ్యాంశాలలో, క్రమనిర్ధారణలో, మూల్యాంకనము యొక్క స్వరూపములో, చదువు యొక్క విధివిధానంలో ఇలా ప్రతి విషయంలోనూ, ప్రతి కణంలోనూ బ్రహ్మవర్చస్ శోధ్‌సంస్థాన్ యొక్క ముద్ర స్పష్టంగా కనపడుతుంది. ఇక్కడ డిగ్రీ, పి.జి చదివే విద్యార్థులందరూ మోనోగ్రాఫ్ రాయడం, ప్రాజెక్టు వర్క్ చేయడం తప్పనిసరి. పి.జిలో ఏదైనా విషయంలో చిన్నపాటి పరిశోధనైనా సరే చేసితీరాలి. తమ యొక్క పరిశోధనా పనులపై విశ్వవిద్యాలయ విద్యార్థులందరూ బ్రహ్మవర్చస్‌కు వస్తూపోతూ వుంటారు. బ్రహ్మవర్చస్ శోధ్‌సంస్థాన్ గ్రంథాలయం, పరిశోధనాశాల (లేబరేటరీ) ను విద్యార్థులు, ఆచార్యులు విరివిగా ఉపయోగిస్తారు.

బ్రహ్మవర్చస్ శోధ్ సంస్థాన్, విశ్వవిద్యాలయం ఒకదానితో ఒకటి జోడింపబడి వున్నాయి. వీటన్నింటికీ శాంతికుంజ్ ఆధారము. పరోక్షంగా యుగఋషి పరమపూజ్య గురుదేవుల పరాత్పర చేతన వీటన్నింటినీ ఒకే సూత్రంలో కట్టివేసిందనేది సంపూర్ణ సత్యము. ఆయన వాత్సల్యములోనే ఇవి అన్నీ, వీటితోనే వ్యక్తులందరూ దగ్గరయ్యారు. అందుచేత అందరూ ఇందులో సమాన భాగస్వామ్యులే. గడిచిన సంవత్సరముల నుండి అందరికీ

మానసిక కాలుష్యం మనకు మనమే తయారుచేసుకుంటున్నాయి.

ఈ విషయం అనుభవంలోకి వచ్చింది. రాబోయే కాలంలో కూడా ఇలానే జరుగుతుంది.

**గురుదేవులు తన జీవితకాలమంతా శాంతికుంజ్‌ని తన హృదయమని, బ్రహ్మవర్చస్‌ని తన మస్తిష్కమని చెప్తూ ఉండేవారు.** ఈనాడు ఆయన మానసికచేతనయే విశ్వవిద్యాలయ రూపంలో తన విశ్వరూపాన్ని చూపిస్తున్నది. గురుదేవులు వ్రాసిన సాహిత్యంలో చాలా భాగం బ్రహ్మవర్చస్ పేరుతోనే ప్రచురింపబడింది. ఇందుకు కారణమేమిటని అడిగితే ఆయన బ్రహ్మవర్చస్ తన సంతకమని చెప్పేవారు. అంతేకాకుండా బ్రహ్మవర్చస్ అంటే ఆత్మతేజస్సు, పరమాత్మ తేజస్సు అని కూడా చెప్పవచ్చు. పరమపూజ్య గురుదేవుల జీవితం గురించి ఇంతకంటే గొప్పగా ఎలా పరిచయం చేయగలము? ప్రస్తుత స్థితిని గురించి వివేచన చేస్తే ఇక్కడ ఏమి చేశావో, ఏమి జరుగుతున్నదో, జరుపబడుతున్నదో, అవి అన్నీ గురుదేవుల ప్రఖరప్రజ్ఞ యొక్క వ్యక్తీకరణలు మాత్రమే. అటువంటప్పుడు ఆ కీర్తి వేరొకరికి చెందవలసిన అవసరం ఏముంది?

బ్రహ్మవర్చస్ శోధ్‌సంస్థాన్ మరియు దేవసంస్కృతి విశ్వవిద్యాలయము రెండూ కలిసి చాలా పనులు చేశాయి. పరిశోధనా రంగానికి సంబంధించి చాలా విలువైన, మౌలికమైన, ఉత్కృష్టమైన కార్యములను సాధించాయి. ఇవి అందరి ఎదుట ప్రదర్శించి, నిరూపింపబడేందుకు అవసరమైన సమయం వచ్చేసింది. ఇక జిజ్ఞాసువులందరికీ వారికి కావలసిన సమాధానం లభిస్తుంది, యుగశక్తి గాయత్రి పత్రిక ద్వారా ప్రతి నెలా ప్రచురింపబడుతుంది.

ఈ శీర్షిక క్రింద పరిశోధనా అధ్యయనములకు సంబంధించిన అన్ని ఆయామాలు ప్రచురణలోకి వస్తాయి. పరిశోధనలకు సంబంధించిన గణాంకాల వివరాలు కూడా ప్రచురింపబడతాయి. మనోవైజ్ఞానిక, సమాజశాస్త్రీయ పరిశోధనలు కూడా ఈ కోవలోకే వస్తాయి. పరిశోధనల ప్రచరణలకు సంబంధించిన ఈ శృంఖలలో దార్శనిక, ఆధ్యాత్మిక, సిద్ధాంతాల అనుసంధాన క్రియాకలాపాలు కూడా తెలియచేయబడతాయి.

ఏది ఏమైనప్పటికీ ఈ శీర్షిక ఇంద్రధనస్సు వలె రంగులు విరజిమ్ముతూ తన ప్రియ పాఠకులను అలరించేందుకు వారి ద్వారములు తట్టడానికి సిద్ధపడుతున్నది. ఈ హృదయస్పందన విన్నవారు తమ ఆలోచనలలో, చేతనత్వములో ఒక నూతన ప్రకాశము ఆవిర్భవించిన అనుభూతిని పొందుతారు. ఆలోచనాపరులైన ప్రౌఢపాఠకులకు, యువతరానికి, కిశోరావస్థలో వున్నవారికి మా విన్నపమేమంటే ఈ శీర్షికను ప్రతినెలా తప్పనిసరిగా చదివి మీ ప్రతిస్పందన ఏమిటో మాకు తెలియచేస్తూ వుండండి.

– అఖండజ్యోతి, జనవరి 2009

అనువాదం : శ్రీమతి వల్లీశ్రీనివాస్

## శ్రీ గాయత్రీ శతకం

47. దేవదానవుల్ జలధి మథించినపుడు
లభ్యమైనవి పదునాల్గె రత్నసిరులు
తాను 'యిరువది నాల్గు' రత్నములనిచ్చు
విశ్వ జనయిత్రి గాయత్రి వేదమాత

తా:– దేవతలు, రాక్షసులు పాల సముద్రాన్ని మథించినపుడు లభించిన రత్నాల వంటి సంపదలు (అమృతం, లక్ష్మీదేవి, చంద్రుడు మొ॥) కేవలం పదునాలుగే. కానీ, యిరువది నాలుగు అక్షరములు కలిగిన గాయత్రీ మంత్రమును జపిస్తే అక్షరానికి ఒక రత్నం చొప్పున యిరువది నాల్గు రత్నాల నిస్తానని వేదమాత అంటున్నది.

48. నీదు భక్తిని, శ్రద్ధను, నీమములను
ఆలకించిన ఆయమ్మ అలరుచుండి
ఆత్మ బలమును చేకూర్చు నవవరతము
విశ్వ జనయిత్రి గాయత్రి వేదమాత

తా:– పరిపూర్ణ విశ్వాసంతో నీవు ప్రదర్శించు భక్తిని, మంత్రముపై నీకు గల శ్రద్ధను, సాధన సమయమున నీవు పాటించు నియమములను ఆలకించే ఆ మహాతల్లి ప్రకాశిస్తూ ఎల్లవేళలా నీకు ఆత్మ బలాన్ని చేకూరుస్తుంది.

రచన : సహజ కవి, సాహిత్య రత్న,
శతక చతురానన, పద్య కవితాసుధానిధి
శ్రీ అయినాల మల్లేశ్వర రావు


**యుగశక్తి గాయత్రి**
**మాస పత్రిక చదవండి ! చదివించండి !!**


మానసిక కాలుష్యాన్ని ప్రయత్నపూర్వకంగా వదిలించుకోవచ్చు.



## పూజ్య గురుదేవుల అమృతవాణి

# పంచశీలములను పాటించండి - 3

*(గతసంచిక తరువాయి...)*

పరమపూజ్య గురుదేవులు ఆధ్యాత్మిక పంచశీలములను అనుసరించమని చెప్తున్నారు. గత రెండు సంచికలలో ఈ విషయములను గురించి మీరు చదివే ఉంటారు. యుగపరివర్తన సమయములో మనం మననుండే పరివర్తన ప్రారంభించాలి. ఈ క్రమంలో వారు 5 అంశములను గురించి చెప్తున్నారు.

1. **మీకోసం మీరు ఒక ప్రపంచాన్ని నిర్మించుకుని అందులో ఒంటరిగా ఉండండి. అంటే భౌతిక ప్రపంచం నుండి వేరుగా,**
2. **మనస్సును స్థిరపరచుకుని మీ కోరికలను మార్చివేసుకోండి.**
3. **కర్మయోగివలె జీవించండి.**
4. **సమయం, శ్రమ, ఇంద్రియములు మీ దగ్గరున్న సంపదలు. వీటిని సరియైన రీతిలో వినియోగించుకోండి.**
5. **మీ దగ్గరున్నదానిని ఒంటరిగా భుజించకండి. మొత్తం సమాజానికంతటికి పంచండి. యజ్ఞీయ జీవనవిధానమును అభివృద్ధి చేసుకోండి.**

గత సంచికలో దీనికి పూర్వభూమిక ఆరంభించ బడింది. పూజ్య గురుదేవులు తమ ఇంటిలోనివారి వ్యతిరేకతను సహిస్తూ కూడా కాంగ్రెస్ శిబిరంలో చేరటానికి వారు చిన్నతనంలోనే ఇల్లు వదిలి వెళ్లిన వైనాన్ని, తదుపరి స్వతంత్ర పోరాటంలో సేనానిగా తయారైన విధానమును గత సంచికలో చెప్పటం జరిగింది. ఇక ఈ సంచికలో పంచశీలములను గురించి వివరంగా చదవండి.

### కుటుంబ సభ్యులు మిమ్మల్ని తప్పనిసరిగా అడ్డుకుంటారు

ప్రస్తుత కాలంలో మీరు ఎవరితోనైతే సహజీవనం సాగిస్తున్నారో, వారు మీ సిద్ధాంతాల పట్ల, ఆదర్శముల పట్ల ఎప్పుడూ ఎలాంటి సహాయము చెయ్యరు, సలహా ఇవ్వరు. వారు చేసేదంతా మిమ్మల్ని అడ్డుకోవడమే. కానీ మీరు వారిని నిందించవద్దు, వారితో ఘర్షణ పడవద్దు. వారి వారి పరిస్థితులు, సంస్కారములు, మనస్సువారికి ఉంటాయి. వాళ్ళు పుట్టి పెరిగిన కుటుంబ వాతావరణమును బట్టి వాళ్ళు సలహాలిస్తుంటారు. అలాగే ఇవ్వనివ్వండి. వారిని దయతో క్షమించండి. వారికి తప్పకుండా సేవ చేయండి. కానీ వాళ్ళు మీమీద చేసే ఒత్తిడిని అంగీకరించకండి. అలా చేస్తే మీరు అనుసరించదలచుకున్న సిద్ధాంతవాద మార్గంపైన ఒక్క అడుగుకూడా ముందుకు సాగలేరు అన్న విషయమును అర్థం చేసుకోండి. ఈ విషయంలో గోస్వామి తులసీదాసు, మీరాబాయిల దృష్టికోణము నిజంగా సరియైనది. తన అత్తవారింటివారు సామ, దాన, భేద, దండోపాయములతో ఎలాగైనాసరే తనను ఆధ్యాత్మిక మార్గంలో వెళ్ళనీయకుండా అడ్డుకుంటున్నారని, ఏమి చెయ్యవలెనో సూచించమని మీరాబాయి తులసీదాసుకు ఒక లేఖ వ్రాసిందట. గోస్వామి తులసీదాసు సమాధానంగా మీరాబాయికి ఒక కవిత వ్రాసి పంపారు. ఎంతో ప్రసిద్ధిగాంచిన ఆ కవిత నాకు చాలా ప్రియమైనది. 'ప్రహ్లాదుడు తండ్రిని, విభీషణుడు తన సోదరులను, భరతుడు తల్లిని త్యజించినట్లు మీరు కూడా మీ కుటుంబ సభ్యులను ఎదురించి, అనగా మానసికంగా పరిత్యజించి, మీ ప్రపంచమును మీరు ఏర్పరచుకుని ఏకాంతంగా నివసిస్తూ మీ ఆధ్యాత్మిక మార్గంలో ఉన్నతిని సాధించండి. ముందుకు సాగండి' ఇది ఆ కవిత యొక్క సారాంశము.

మీ ఉన్నతికి సలహాలనివ్వగల శ్రీరామకృష్ణపరమహంస, సమర్థగురురామదాసు వంటి శ్రేష్ఠులను, ఆదర్శమూర్తులను ఎంపిక చేసుకోండి. బుద్ధభగవానుడు భార్యాబిడ్డలను వదిలి నడిరేయి ఆధ్యాత్మిక ప్రపంచంలోకి ప్రవేశించాడు. సమర్థ రామదాసు వివాహ మండపం నుండి పారిపోయాడు. శ్రీ శంకరాచార్యుల వారు నదీప్రవాహం మధ్యలో నిలబడి, మొసలి తనను పట్టివేసిందని, తనను శ్రీ శంకరునికి సమర్పిస్తే మొసలి వదిలివేస్తుందని తల్లికి చెప్పి, ఒప్పించి సన్యాసాశ్రమమును స్వీకరించాడు.

### అల్పులు, హీనులబారినుండి మిమ్మల్ని మీరు కాపాడుకోండి

విషయవాసనలతో నిండిన అల్పులైన వ్యక్తులు, సోమరితనంతో కూడిన హీనులైన వ్యక్తులు చెప్పే సలహాలకు చెవి ఒగ్గకండి. మీరు వారు చూపించే కలల సౌధాలకు భ్రమసిపోకండి. బ్రహ్మచర్యంతో శ్రీరామచంద్రుడిని సేవించి భాగ్యశాలియైన హనుమంతుని, జీవితాంతము బ్రహ్మచర్యాన్ని స్వీకరించి కురువంశ గౌరవాన్ని కాపాడిన భీష్మపితామహుడిని ఆదర్శంగా భావించండి. అల్పుల నుండి దూరంగా ఉండండి. శ్రేష్ఠులైన సలహాదారులు బట్టీవంటివారు. బట్టీలో గాజు కరుగుతుంది. లోహం కరుగుతుంది. కరిగిన లోహం క్రొత్త మూసలోకి దించబడి రూపు మార్చుకొని మన ముందుకు వస్తుంది. తద్వారా కర్మాగార యజమానులకు లాభాన్ని చేకూరుస్తుంది. పాత ట్రైర్లను కర్మాగారానికి తీసికెళ్ళి కరిగించి,

**మనో మాలిన్యాన్ని అదుపుచేసుకున్నవారు దీర్ఘకాలం జీవిస్తారు.**

మనం క్రొత్త టైరులను తెచ్చుకుంటాము. అదేవిధంగా జీర్ణమై, శిథిలమైపోయిన మీ మనస్సును శ్రేష్ఠులైన వ్యక్తుల సంపర్కంలోకి తీసికెళ్ళి దానిని సంస్కరించుకొని శక్తివంతం కావించుకోండి.

## మానవుని తాళంచెవి

మానవుడి కోరికలకు శక్తి ఉంటుంది. మానవుని శక్తి అతని కోరిక తప్ప మరేమీ కాదు. **'శ్రద్ధ మయో ఽ యం పురుషో యో యచ్ఛ్రద్ధః స ఏవసః'** గీత 17/3 అని గీతావాక్యం. మానవుని శ్రద్ధా విశ్వాసాలు, కోరికలు, ఫలితాలు ఇవే అతని రూపం. మానవుడు అంటే అంతకుమించి మరేమీకాదు. యంత్రాలన్నీ కూడా సరిగా ఇదే సిద్ధాంతం మీద పనిచేస్తూ ఉంటాయి. బొమ్మకు కీ-ని బిగిస్తారు. కీ-ని తిప్పగానే బొమ్మ ఎగురుతుంది, దూకుతుంది. అలాగే మానవుని 'కీ' అతని కోరికలు, ఆలోచనలు, సంకల్పాలు, నమ్మకాలు మొదలైనవి. తెలివి, క్రియ ఇవన్నీ ఆ తాళంచెవి యొక్క పేర్లు. తెలివిదీ తప్పులేదు, క్రియదీ తప్పు లేదు. అవి మట్టితో చేసిన శరీరానికి సంబంధించినవి. మన కోరికలు ముఖ్యంగా మూడింపైన ఆధారపడి ఉంటాయి. మీరు ఆ మూడింటిని హేయమైనవి, నశించిపోయేవి అని గుర్తుంచుకోండి. వీటి స్థానంలో మరింకేవైనా కోరికలను కోరుకోండి. ప్రతి మనిషి ఈ శరీరానికి కోరికలన్నీ తీరే అవకాశం లభించాలని కోరుకుంటాడు. అలంకరించుకొనుట, కామవాసనలను అనుభవించుట, జిహ్వాచాపల్యమూ కూడా ఇందులోకే వస్తాయి. సోమరితనము, లంచగొండితనం ఇందులోనివే. వాసన, తృష్ణ, అహంకారము అనేవే, ఆ మూడు తీవ్రమైన కోరికలు. అత్యంత తీవ్రమైన మూర్ఖమైన, అతి భయంకరమైన ఈ మూడు కోరికల వల్లనే మన జీవనీశక్తి నిర్వీర్యమైపోతున్నది. డబ్బు ప్రధాన అంశంగా ఏర్పడుతున్న గౌరవమర్యాదలతో కూడిన మన 'అహంకారాన్ని' మనం వదిలించుకోగలగాలి. సమాజంలో వ్యక్తి యొక్క గౌరవం అతని గుణకర్మ స్వభావాలనుబట్టి, వ్యక్తిత్వమునుబట్టి ఏర్పడాలి. ఇతరుల వ్యక్తిత్వము డబ్బుకు అమ్ముడుపోయేవిధంగా ఉన్నప్పుడు మనం వారికన్నా ఎంతో శ్రేష్ఠులుగా ఉండాలి.

## మీ విలువను పెంపొందించుకోండి

గౌరవమనేది మన హృదయం లోపల మర్యాదతో నిండిన అనుభూతితో వ్యక్తమౌతుంది. దానినే ఆత్మగౌరవమని, ఆత్మసంస్కారమనీ కూడా చెప్పవచ్చు. అహంకారమును వ్యతిరేకించాలి, ఆత్మగౌరవమును పెంపొందించుకోవాలి. మీ ఉద్దేశ్యాలు, లక్ష్యములు, ఆకాంక్షలు ఇతరులకన్నా ఎంత శ్రేష్ఠంగా ఉంటే మీరు అంత ఔన్నత్యమును పొందగలుగుతారు. నిజాయితీపరంగా, ఆదర్శాలపరంగా, లోకసేవ, వ్యక్తిత్వము, గుణకర్మ స్వభావాలు వీటన్నింటిపరంగా కూడా మీరు ఇతరుల కన్నా ఎంత ఎక్కువ ముందుకు వెళ్ళగలిగితే అంత ఔన్నత్యమును పొందుతారు. ఈ ఔన్నత్యమును అభివృద్ధి చేసుకొనటానికిగాను ఆత్మను సంస్కరించుకొనవలెననే మహత్వాకాంక్షను ఇంకా ఇంకా వృద్ధిచేసుకొనవలెనని నిర్ణయించుకోండి. మీ పని ఏదైనాకానీ ఆఖరుకి ఇల్లు చిమ్మటంతోసహా, ఆ పనిని ఎంతో నిజాయితీతో మర్వెరూ చేయలేనంత సమర్థవంతంగా, బాధ్యతాయుతంగా చేయాలి. భగవంతునికి పూజ ఎంత శ్రద్ధగా చేస్తామో, అంతే శ్రద్ధతో మనకప్పగించిన పనులను మనం చేయగలగాలి. సాధారణంగా జనం అప్పుడే నిద్రనుండి లేచినవారిలాగా, సోమరిపోతులలాగా, బద్ధకస్థులలాగా, బాధ్యతారహితంగా పనులు చేస్తూ ఉంటారు. అలా చేయడం వలన మనం చేసిన పనులే మన సోమరితనాన్ని, మందబుద్ధిని తెలియజేస్తాయి. అది సరియైనది కాదు. మనం చేసిన ప్రతిపనీ కూడా మనం ఎంత మర్యాదస్తులమో, నిజాయితీపరులమో, ఔన్నత్యము కలిగినవారమో దానిని ప్రతిబింబించేటట్లు ఉండాలి. మీరు చేసే ప్రతిపనీ, ప్రతి వస్తువు, మీ సంపర్కంలోకి వచ్చిన ప్రతివ్యక్తీ మీ ఔన్నత్యమును నొక్కివక్కాణించేవిధంగా మీ లక్ష్యములను, ఆదర్శములను అభివృద్ధి చేసుకోవాలి.

## కాంతిస్థంభాల వలే జీవించండి

మీరు మరణించిన తరువాత కూడా మీరు మీ తాలూకూ చిహ్నాలను వదిలివెళ్ళే విధంగా జీవించండి. ఆ చిహ్నాలను చూసిన ప్రజలు తాము కూడా మీరు నడిచిన మార్గంలోనే నడవాలని నిర్ణయించుకునేవిధంగా ఉండాలి. సముద్ర తీరంలో లైట్‌హౌస్‌లు ఉంటాయి. అవి తమ కాంతులను ప్రసరింపజేస్తూ సముద్ర మార్గంలో ఏవైపు పయనించాలో, ఏవైపు పయనించకూడదో నావికులకు మార్గదర్శనం చేస్తూ ఉంటాయి. మీ జీవన విధానం కూడా ఆ లైట్‌హౌస్‌ల వలె ఉండాలి. 'మీరు ఈ మార్గంలో నడవండి. ఈ విధంగా జీవించండి' అని మీ సన్నిహితులకు, ఇరుగుపొరుగువారికి చెప్పగలిగేటంత ఉజ్జ్వలంగా మీ జీవితాన్ని మీరు తయారుచేసుకోండి.

హరిశ్చంద్రమహారాజు ఈవిధంగానే జీవించాడు. ఆయన మరణించిన కొన్ని వేల సంవత్సరాల తరువాత గాంధీగారు ఒకసారి హరిశ్చంద్రనాటకమును చూసి 'జీవించటమంటే నాలాగ జీవించు మిత్రమా, శాంతితో గౌరవంగా జీవించు' అని హరిశ్చంద్రుడు నా చెవిలో చెప్పినట్లు అనిపించింది అని గాంధీగారు అన్నారు. అంటే గాంధీగారు హరిశ్చంద్రుని మార్గమును ఆదర్శంగా స్వీకరించినట్లు మనకు అర్థమౌతుంది. శరీరం నశిస్తుందిగానీ ఆదర్శములకు మరణం లేదు. బుద్ధుడు, గాంధీగారు, వివేకానందుడు వీరందరూ మరణించినట్లా? లేదు. భౌతికమైన వారి శరీరాలు లేకపోవచ్చు, కానీ వేల సంవత్సరాలు వారు వారి ఆదర్శముల రూపంలో జీవించియే ఉంటారు.

*– అఖండజ్యోతి, డిశంబరు 2009*

*అనువాదం : శ్రీమతి కృష్ణకుమారి*

**మనో మాలిన్యాన్ని అదుపుచేసుకున్నవారు ప్రగతిని సాధించ కలుగుతారు.**

ప్రాణవిద్య

# మానవ శరీరంలో అయస్కాంత శక్తిసాగరం

విశ్వ బ్రహ్మాండంలోని జడ చేతన ప్రాణులలో ఉన్న తత్వాలూ, వైభవమూ, పరాక్రమమూ, యోగ్యతలూ అన్నింటినీ మానవ శరీరంలో బీజరూపంలో సృష్టికర్త నింపాడు. మానవుడు నడుస్తున్న ఒక అయస్కాంతం ఒక విద్యుత్ సౌధం. ఈ శక్తితోనే మానవ యంత్రం నడుస్తూ తన జీవితాన్ని గడుపుతుంది. అంతేకాక తన ప్రకాశంతో ఇతరులను కూడా ప్రకాశింప చేయగలదు. ఆకర్షించే శక్తికలది కనుక ఇతరులను కూడా ఆకర్షిస్తోంది.

మానవునిలోని అయస్కాంత ప్రవాహాన్ని గురించి తెలుసుకోవాలని ప్రయత్నం చేస్తున్నవారు సూర్యుని నుండి భూమి ఏవిధంగా ఆకర్షింపబడుతుందో అదేవిధంగా భూమియొక్క గురుత్వాకర్షణ శక్తిచేత మానవుడు ఆకర్షణ శక్తిని సంతరించుకుంటున్నాడు అని తెలుసుకున్నాడు. బ్రహ్మాండంలోని విద్యుత్ ప్రవాహంతోనే మానవునికి ఆ శక్తి లభిస్తున్నది.

మానవునిలో అయస్కాంతశక్తి పెరుగుతూ, తగ్గుతూ ఉంటుంది. ఈ శక్తి తక్కువైనపుడు కంటిలోని కాంతి తగ్గుతుంది. శరీరం ఎండిపోయి నీరసంగా, కురూపిగా తేజోహీనంగా కనపడుతుంది. మానవునిలో మరపు, భ్రాంతి, అలసటా ఉన్నట్లు అనుభూతి కలుగుతుంది. అదే మానవునిలోని అయస్కాంతశక్తి ఎక్కువైనపుడు అతను ఆకర్షణీయంగా అందంగా కనపడుతాడు. అతనిలో ప్రతిభా, జ్ఞాపకశక్తి, స్ఫూర్తి అన్నీ వృద్ధి పొందుతాయి. మానవునిలోని ప్రాణశక్తి యొక్క హెచ్చు తగ్గులే అతన్ని మంచివాడుగా లేదా చెడువానిగా తయారు చేస్తుంది. అయస్కాంత శక్తి ఎక్కువగా ఉన్నవాడు బలహీనులను కూడా ప్రభావితం చేయగలడు. వారికి ఆత్మబలం కూడా దృఢంగా ఉంటుంది.

అంతరిక్షంలో వ్యాపించిన మంచీ, చెడూ అనుదానాలను మానవుడు తనలోని అయస్కాంత శక్తి ద్వారా తీసుకోవడమో, తీసుకోకపోవడమో చేస్తాడు. ఈ శక్తి యొక్క పైకి వెళ్ళే ప్రవాహము మస్తిష్కంలో కేంద్రీకృతమై ఉంటుంది. మస్తిష్కాన్ని మానవుని అయస్కాంతశక్తికి ఉత్తర ధృవంగా చెప్తారు. దీని ప్రభావం చేత వ్యక్తిత్వం ఉన్నతంగానూ, ప్రతిభావంతంగానూ ఉంటుంది. ముఖానికి నలువైపులా ఆవరించిన ఓజస్సును అనగా తేజోవలయాన్ని పైకి ప్రవహిస్తున్న విద్యుత్‌గా గుర్తించాలి. జననేంద్రియ మూలంలో అయస్కాంతశక్తి యొక్క దక్షిణ ధృవం ఉంది. క్రిందుగా ప్రవహించే శక్తి ప్రవాహం ఇచ్చటే కేంద్రీకృతమై ఉంటుంది. యవ్వన ఆకర్షణకు ఈ ప్రవాహమే కారణం. భిన్న ప్రకృతులు ఉన్నప్పటికీ ఈ రెండు ప్రవాహాలకు పరస్పర సంబంధం ఉంది. కామాతిరేకమూ, లేదా కామాన్ని అణచడం ఈ ప్రవాహం వల్లే జరుగుతున్నాయి. ప్రాణశక్తి యొక్క ఊర్ధ్వగమనము వల్ల ప్రతిభ ఉత్పన్నమౌతుంది.

శాన్‌ఫ్రాన్సిస్‌కోలోని ప్రసిద్ధ చికిత్సకుడు అల్‌బర్ట్ అబ్రహాం మానవశరీరం అయస్కాంతశక్తి తరంగాలతో నిండి ఉందనీ, దానికి కూడా భూమికి ఉన్నట్టుగానే ఉత్తర దక్షిణ ధృవాలున్నాయనీ అన్నారు. ఇవి విద్యుత్, అయస్కాంత నియమాలననుసరించి పనిచేస్తాయి. శరీరం ద్వారా శక్తి తరంగాలను గ్రహించడమూ, విసర్జించడమూ జరుగుతున్నాయి అన్నారు. అతని పరిశోధనలననుసరించి శరీరం నుండి ప్రతి సెకనునకూ 80 కోట్ల సైకిల్స్ విద్యుత్ అయస్కాంత శక్తి వికిరణ జరుగుతుంది. డాక్టర్ అబ్రహాం శరీరం నుండి వెలువడే శక్తి ప్రవాహాన్ని కొలిచే విధానాన్ని కనుగొన్నారు. దీనికే 'రెడిస్తేషియా' అని పిలుస్తారు.

ఆధునిక మెడికల్ సైన్సు ప్రకారం మానవుని ఆరోగ్యం శరీరనాడుల అయస్కాంత ఆకర్షణలపైన ఆధారపడి ఉంది. శరీరంలోని అతిసూక్ష్మ కణాలు ఎలక్ట్రాన్, ప్రోటోన్, న్యూట్రాన్ మొదలైనవన్నీ విద్యుత్ అయస్కాంత శక్తితో నిండి ఉన్నాయి. రక్తంలోని ఎర్ర కణాలలో ఇనుము శాతం ఎక్కువ ఉంటుంది. శరీరమంతటా రక్తం నిరంతరం ప్రవహిస్తూ ఉంటుంది.

ఈ ప్రవాహం వల్ల అయస్కాంత క్షేత్రముత్పన్నమవుతుంది. ఈ లోహ సంబంధమైన తత్వము విశ్వవ్యాపకమైన శక్తిని తనలో ఇముడ్చుకొని శరీరంలోని నాడులు అన్నీ సవ్యంగా పనిచేసేవిధంగా శక్తిని నింపుతుంది. ఆరోగ్యకరమైన నాడులలో

**ఆలోచనల నాణ్యతను పెంచుకుంటే ఆరోగ్యంగా ఆనందంగా జీవించవచ్చు.**

శక్తి ఎక్కువగా ఉంటుంది. శక్తి తగ్గినపుడు వ్యక్తి రోగగ్రస్తుడౌతాడు. శరీరంలో నిర్ధారిత పరిణామంలో అయస్కాంత శక్తి ఉండాలన్నది విజ్ఞాన సమ్మతమే.

లెనిన్‌గ్రేడ్ యూనివర్సిటీలో రష్యా దేశపు మహా వైజ్ఞానికులు మానవ శరీరంలోని జీవ అయస్కాంత క్షేత్రాలను కనుగొన్నారు. జోన్ మైకేల్ రావర్ట్ జే.ఎమ్ రిచర్డ్ తన ప్రసిద్ధ పుస్తకం "మీస్టిర్ యసఫినానినా"లో ఎన్నో సంఘటనలను వర్ణిస్తూ విభిన్న వ్యక్తులలో అయస్కాంత శక్తి ఎక్కువగా ఉన్నందువల్ల చాలా విచిత్రాలను ఎదుర్కోవలసి వచ్చిందని వ్రాశారు.

కెనడాలోని కెరోలినాక్లేయర్ అనే యువతిలో అయస్కాంతశక్తి ఎక్కువగా ఉండేది. ఆమెకు ఆవేశం వచ్చినపుడు చాకులూ, మేకులూ లాంటి ఇనుప పదార్థాలు శరీరానికి అతుక్కుపోయేవి. అమెరికాలోని మేరీలాండ్‌లో విద్యార్థిని లూయీ హైవర్గర్‌కు వ్రేళ్ళ కొనలందు అయస్కాంత శక్తి ఉండేది. అర అంగుళము లావూ, ఒక అడుగు పొడవు ఉన్న ఇనుప కడ్డీని మునివ్రేళ్ళతో ఎత్తేది. ఆమె దగ్గరకు వచ్చేవారికి ఆమెలో వింత ఆకర్షణ ఉన్నట్లు అనిపించేది.

మిసోరీలోని ఫ్రెంక్‌మైత్ కన్‌స్టీ అనే అతనిలో అయస్కాంత శక్తి ఎంత ఎక్కువగా ఉండేదంటే ఒక్కోసారి అతను నడుస్తున్నపుడు కాళ్ళు నేలకు అతుక్కుపోయేవి. దారిన వెళ్ళేవారు అతని కాళ్ళను బలవంతంగా లాగాల్సి వచ్చేది.

సుప్రసిద్ధ మనోవైజ్ఞానికుని కథనం ప్రకారం ఎవరైనా తన మనశక్తిని కేంద్రీకృతం చేసి తనలోని ఆకర్షణ శక్తిని ఏదేని ఒకదిశలో ఉపయోగించనట్లయితే ఆ సమ్మోహన ప్రక్రియ ద్వారా ఇతరులలోని సూక్ష్మ శక్తులనూ, తమలోని సూక్ష్మశక్తులనూ కూడా జాగృతం చేయగలరు.

ఆస్ట్రియాలోని వియన్నా నగరంలో డాక్టర్ ఫ్రాన్సిస్కమ్ ఎంటో నియర్స్ మేస్మర్‌ను ఇటువంటి సమ్మోహణ క్రియకు పితామహుడు అని అనుకునేవారు. అప్పట్లో అతను ఖ్యాతిగాంచిన వైద్యుడు. ఒకసారి అతను ఒక రోగికి చికిత్స చేస్తున్నప్పుడు ఆ రోగి శరీరంలోనుండి విపరీంగా రక్తం కారడం మొదలైంది. దాన్ని అరికట్టడానికి అతని వద్ద వేరే మందులేవీలేవు. అతను రక్తం కారే ప్రదేశాన్ని తన చేతితో రుద్దడం ప్రారంభించాడు. కొద్ది క్షణాలలోనే విచిత్రంగా రక్తం ఆగిపోయింది. తర్వాత అతను చాలా ప్రయోగాలు చేసి ఒక సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. మానవుని శరీరంలో ఒక విధమైన బయోఎలక్ట్రానిక్ విద్యుత్ ధార నిరంతరం ప్రవహిస్తూ ఉంటుంది. ఈ ప్రవాహము వ్రేళ్ళ అగ్రభాగంలో అధికంగా ఉండి రోగగ్రస్తమైన భాగమందు చేతితో రుద్దడంవల్ల రోగి శరీరంలోకి ప్రవహిస్తున్నది. రోగం తగ్గడానికి సహాయ పడుతుంది. మెస్మర్ ఈ శక్తి ప్రవాహానికి 'జైవచుంబక్' అని పేరు పెట్టారు. వాన్ హెల్మెంథ్ ఈ శక్తిని మానసిక, శారీరిక రోగులపైన సఫలతా పూర్వకంగా ప్రయోగించి చాలా ఖ్యాతిని గడించాడు. ప్రజలు అతన్ని సిద్ధ పురుషుడనేవారు.

మెస్మరిజం ప్రయోగాల్లో ప్రయోగం చేసేవారు తమ అయస్కాంత విద్యుత్ ఆధారంగా ఇతరులను సమ్మోహితులను చేస్తారు. ఇదేవిధంగా ఒక వ్యక్తి యొక్క ప్రాణశక్తి ఇతరులలోనికి ప్రవహిస్తుంది. శారీరిక మానసిక రుగ్మతలు పోగొట్టడానికి సహాయ పడుతుంది. ఇటువంటి ఉదాహరణలు చాలా ఉన్నాయి.

ఒకప్పటి జర్మనీ నియంత హిట్లరుకు ఇస్టోనియా నివాసి క్రిస్టన్ అనే వ్యక్తి చికిత్సకుడుగా ఉండేవాడు. అతని వ్రేళ్ళలో బాధను పోగొట్టే శక్తి ఉండేది. అతని స్పర్శతో చాలామందిని ఆరోగ్యవంతులుగా చేసేవారు. సాధనవల్ల అతనిలో ఈ గుణం అబ్బింది. హిట్లరు యొక్క ఆంతరిక మిత్రుడు హిమ్లర్ కూడా అతనితో చికిత్స చేయించుకొనేవాడు. క్రిస్టన్ తన ఈ శక్తి చేత హిట్లర్ అనుచరులను దాదాపు లక్షమందిని మృత్యుపాశం నుండి విడిపించాడు.

గొప్ప వ్యక్తిత్వంగల హిపొక్రటీస్ ప్రాణతత్వంపైన అపారమైన శ్రద్ధ. ఆయన ఈవిధంగా వ్రాశాడు. "ఆత్మశక్తిచేత శరీరం నడుపబడుతూ నియంత్రించబడుతున్నపుడు దాని ప్రాణశక్తిచేత కూడా రోగాలను నివారించవచ్చు." స్కాంట్‌లోని మెక్స్‌వేల్ అనే విద్వాంసునికి విశ్వవ్యాప్తమైన ప్రాణతత్వంపైన అచంచలమైన విశ్వాసం ఉండేది. ప్రాణచికిత్స కొరకు తను ఒక కేంద్రాన్ని స్థాపించాడు.

ఇస్కులోపియస్ అను యూరప్ నివాసి రోగుల రోగగ్రస్తమైన అవయవాలపై శ్వాసను వదలి చేతితో తట్టుచూ చికిత్స చేసే విధానంలో పారంగతుడు. ఇంగ్లండులోని క్రైస్తవ ఫాదర్ దుఇడ్ అను వ్యక్తికి ఈ క్షేత్రంలో అసాధారణమైన ఖ్యాతి లభించింది.

**అనారోగ్యానికి మూలకారణం మానసిక కాలుష్యమే.**

అనేకమంది విద్వాంసులు తమ సాహిత్యంలో ఇతని విలక్షణశక్తిని గురించి వివరించారు. లండన్‌లోని లెనహార్ట్ అను తోటమాలి వ్రేళ్ళతో తాకి రోగ విముక్తులను చేయడంలో ప్రసిద్ధి చెందాడు.

ప్రఖ్యాత పరామనో విజ్ఞాని డాక్టర్ థేల్మామాన్స్, అతని అనుచరులు, ఈ సమ్మోహన క్రియ ద్వారా చికిత్స చేసేవారిని చాలా మందిని పరీక్షించారు. వారిలో కెనడా స్పెషలిస్ట్ డాక్టర్ మార్షల్ ఆధ్యాత్మిక చికిత్సకుడుగా పాశ్చాత్య జగత్తులో ప్రసిద్ధి చెందాడు. వ్రేళ్ళూ, అదేవిధంగా చేతుల స్పర్శతో అతను వందలకొలదీ రోగులకు క్రొత్త జీవితాన్ని ప్రసాదించాడు. తలనొప్పి మొదలైన సామాన్యరోగాలు అతని స్పర్శమాత్రం చేత నయమై పోయేవి. డాక్టర్ థేల్మామాన్స్ బాగా పరిశీలించి మార్షల్ చికిత్స చేసేటప్పుడు అతని వ్రేళ్ళలో నుండి ప్రాణశక్తి ఒక ప్రకాశపుంజం లాగా రోగి శరీరంలోనికి ప్రవేశిస్తుందని గమనించాడు. అతని వ్రేళ్ళు తాకిన చోట చాలా సుఖంగా ఉండేది. ఈ అనుభూతి చాలా సేపటివరకూ ఉండేది.

శరీరంలోని ప్రాణ అయస్కాంతశక్తిని వైజ్ఞానికులు తమ తమ పద్ధతుల్లో పరీక్షించి విభిన్నమైన వాటికి విభిన్నమైన పేర్లు పెట్టారు. అవి బయోమేగ్నటిజమ్, బయోప్లాజ్మా, ఎక్టోప్లాజ్మా, బయోప్లక్స్ మొదలైనవి. ఇతరమైన జీవధారులలో ఈ ప్రాణ అయస్కాంతశక్తి సాధారణమైన రీతిలో ఉంటుంది. మానవుల్లో ఇది విశేషంగా ఉంటుంది. డాక్టర్ కిర్లియన్, డాక్టర్ థేల్మామాన్స్‌లాంటి వైజ్ఞానికులు కిర్లియన్ మరియూ ఆర్గన్ ఫోటోగ్రఫీ ద్వారా రంగుల చిత్రాలను తయారు చేశారు. థియోసఫిస్టులు దీనిని 'ఈథరిక్ డబుల్' అంటారు. ఇది శరీరానికి నలువైపులా వ్యాపించి ఉంటుంది. అతీంద్రియ శక్తి విశేషతలు ఈ అయస్కాంతశక్తిపైనే ఆధారపడి ఉంటాయి.

ప్రాణ అయస్కాంతశక్తిని వికసింపచేసుకోడానికి ధ్యాన, ధారణా, ప్రాణాయామమూ మొదలైన ప్రయోగాలను ఆవశ్యకతానూసారమూ చేయాలి. ఇటువంటి వాటికి అనివార్యమైనవి ముఖ్యంగా ఇంద్రియ నిగ్రహమూ, మనోనిగ్రహమూ, నీతి నియమాలూ, జీవనక్రమమూ మొదలైనవి వాటిని అనుసరిస్తూ, ఈశ్వరప్రదత్తమైన ప్రాణవిద్యుత్ అపవ్యయం కాకుండా జాగ్రత్త వహించాలి.

– పూజ్యగురుదేవుల వాఙ్మయం నుండి

అనువాదం : కె. అరవిందమ్మ

## ఆత్మశక్తి మహిమ

*శాంతినికేతన్ విద్యాలయ సంచాలకులు రవీంద్రనాథ్ ఠాగూర్‌ని ప్రక్కింటి వ్యక్తి విపరీతంగా ద్వేషించేవాడు. ఈర్ష్య తప్పించి వారిద్దరి మధ్య పెద్ద పెద్ద తగాదాలు ఏమి లేదు. ఒకరోజు అతను ఒక కిరాయిగూండాకి డబ్బు ఇచ్చి ఠాగూర్‌ని చంపేయమన్నాడు. అక్కడ అదే వృత్తిగా జీవించే అనేకమంది గుండాలు ఉండేవారు. గూండా కత్తి* చేతబట్టి తోటలో కవితలు వ్రాసుకుంటున్న ఠాగూర్‌ని పథకం ప్రకారం చంపటానికి ప్రయత్నం చేశాడు. ఠాగూర్‌గారు తలెత్తిచూచి విషయాన్ని అర్థం చేసుకున్నారు. కాని ఏ మాత్రం చలించక నిర్భయంగా "నోరు మూసుకుని ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చో. చూశావు కదా. నీలగా పనికిరాని పనులలో గాక అతి ముఖ్యమైన పనిలో ఉన్నాను. ఇది అయిపోయిన వెంటనే నీ పని ఏమిటో చూద్దాం. ఈలోగా కదిలావా ఖబడ్దార్'' అని ఆజ్ఞాపించాడు. ఆయన నిర్భీతికి, ఆ గంభీర స్వరానికి ఆ గూండా తెలియని బలహీనతకు లోనై కత్తిని పడవేసి పరిగెత్తి పారిపోయాడు.

కొల్లాయి కట్టిన గాంధీగారు అతిశక్తివంతమైన బ్రిటీష్ పాలనను ఆత్మశక్తితోనే ఎదుర్కొన్నారు. ఆత్మశక్తిని మించినదేమి లేదు. మహనీయులు ఎంతటి విషమ పరిస్థితిలోను తమ వీరత్వాన్ని, పౌరుషాన్ని విడనాడరు.

– ప్రజ్ఞాపురాణం నుండి

## ఆహ్వానం
## హిందీ నుండి తెలుగు అనువాదకులకు

యుగఋషి పూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్యవర్యుల జన్మశతాబ్దిని పురస్కరించుకొని వారిచే విరచితమైన ఎంపిక చేసిన పుస్తకాలను, హిందీ నుండి తెలుగు భాషలోనికి అనువదించుటకు నిర్ణయించడమైనది. కావున ఆధ్యాత్మిక గ్రంథములను, సులభ శైలిలో తెలుగులో అనువాదం చేయగల సామర్థ్యమున్న వారికి గాయత్రీ చేతనా కేంద్రము ఆహ్వానము పలుకుచున్నది.

**సంప్రదించవలసిన ఫోన్ నెం. 9949111175**

**చెడు అనుభూతులను నిరంతరం గుర్తుచేసుకుంటుంటే శరీరం విషపూరితమవుతుంది.**

బోధకథ

# లోభగుణమే గ్రుడ్డితనం

అతడికి కంటిచూపు లేదు. అయితేనేం, కంఠస్వరం కోయిలను మరిపిస్తుంది. అతడు పాడుతుంటే, విన్న ప్రజలు మంత్రముగ్ధులౌతారు. మైమరచిపోతారు. అతనికి రాని పాట లేదు. ఎన్నో పాటలు, పద్యాలు, గీతాలు కంఠస్థం చేశాడు. ఏ వీధిలోకి వెళ్లినా అతని చుట్టూ జనం చేరేవారు. గుడ్డిబాబా! అంటూ ఎంతో ఆదరంగా పిలుస్తూ ఉంటారంతా.

ప్రతిరోజూ ఎవరో ఒకరు అతడికి భోజనం పెడుతుండేవారు. ఊరికి కొద్ది దూరంలో ఉన్న తోటలోని దేవాలయం అతడి నివాస స్థానం. ఊరి వారేకాక పొరుగూళ్లనించి వచ్చే యాత్రికులు కూడా దేవునితో పాటు బాబా దర్శనం చేసుకొని ఏదో ప్రసాదమో, కొంత దక్షిణో ఇచ్చి వెళ్తుండేవారు. నెమ్మది నెమ్మదిగా బాబాదగ్గర చాలా డబ్బు పోగయింది. సమయం దొరికితే చాలు వాటిని లెక్కపెట్టుకుంటూ, తడిమి చూసుకుంటూ ఆనందపడిపోసాగాడు. అంతేకాదు, వాటిని ఇంకా ఇంకా పెంచాలంటే ఏం చెయ్యాలి? అన్న ఆలోచన వచ్చి ఆ డబ్బుతో బంగారు నాణాలను కొన్నాడు. వీటిని ఒక సంచిలో వేసి తన నడుముకు కట్టుకున్నాడు. కూర్చునా-లేచినా నిద్రపోతున్నా-మెలకువగా ఉన్నా అతడి ధ్యాసంతా బంగారం మీదే ఉండేది. అసలే గ్రుడ్డివాడని, వీటిని ఎవరైనా కాజేస్తారేమో - అన్న భయం ఒకటి మనసులో చేరి ముల్లులా అతడిని బాధిస్తుండేది. అదివరకటి సంతోషం ఇప్పుడు మచ్చుకైనా లేదు.

గ్రుడ్డిబాబా దగ్గర బంగారు కాసులున్నాయని సంగతి ఇద్దరు మోసగాళ్ళు కనిపెట్టారు. వాటిని కాజేయడానికి చక్కటి పథకం వేసుకొని ఇద్దరూ బాబా దగ్గరికి వచ్చారు. బాబాకి ప్రణామం చేసుకొని తాము బంగారు నగల వ్యాపారులమని తీర్థయాత్రలకు బయలుదేరామనీ చెప్పారు. "బాబా! మీలాంటి సాధువు దర్శనం లభించి మా జన్మ ధన్యమైంది. మా తృప్తి కోసం ఈ రోజు మా భిక్ష స్వీకరించండి" అని చెప్పి ఎంతో ప్రేమగా భోజనం పెట్టి దక్షిణగా ఒక బంగారు నాణెం ఇచ్చారు. బంగారు నాణెం శబ్దం చెవుల పడగానే బాబా మనసు ఆనందంతో పొంగిపోయింది. గ్రుడ్డివాడవటం మూలాన నాణాలను వాటి శబ్దాలను బట్టి వెండివా, బంగారువా, లోహపువా అన్న సంగతి గ్రహిస్తుండేవాడు.

ఈ మోసగాళ్ళిద్దరూ తోటలోనే మూడు రోజులు గడిపారు. ప్రతి రోజు బాబాకి రుచికరమైన భోజనంతోపాటు ఒక్కో బంగారు నాణెం కూడా ఇస్తుండేవారు. మూడోరోజు వాళ్లు అక్కడ నుండి బయలుదేరుతూ బాబాతో ఇలా అన్నారు - "మహాత్మా, మీ దర్శనం వల్లా, మీ సేవ వల్లా మేము చాలా ఆనందం పొందాము. ఒక్కరోజు ఉండిపోదామనుకున్నవాళ్ళము మూడు రోజులు ఉన్నామంటే మిమ్మల్ని వదిలిపెట్టి వెళ్ళలేకనే, కానీ మేము చాలా యాత్రలు చేయవలసి ఉన్నది. కనుక బయలు దేరక తప్పడం లేదు. అయితే మాదొక విన్నపం...." అన్నారు.

"అదేమిటో చెప్పండి నాయనలారా!" అన్నాడు బాబా. "యాత్ర చేసినన్నాళ్ళూ ప్రతిరోజు ఒక సాధువుకి భోజనం పెట్టి దక్షిణగా బంగారు నాణెం ఇచ్చిన తర్వాతనే అన్నం నీళ్లు ముట్టుకోవాలన్న నియమం పెట్టుకున్నాము మేము. కానీ అసలైన సాధు సత్పురుషులు మాకు ఎక్కడంటే అక్కడ ఎలా లభిస్తారు? మీరు మాతో పాటు యాత్రకు రాగలిగితే మాకు రోజూ మీ దర్శన భాగ్యమూ కలుగుతుంది. మా వ్రతమూ పూర్తి చేసుకోగలుగుతాము" అని అన్నారు వారు ఎంతో వినయంగా.

బాబా ఆనందానికి అవధులు లేవు. నా అదృష్టం పండింది. లేకపోతే ఇంతమంచి అవకాశం నన్ను వెతుక్కుంటూ వస్తుందా? మంచి భోజనంతోపాటు స్వర్ణముద్రికలు కూడా లభించడమేకాక పైసా ఖర్చు లేకుండా యాత్రలన్నీ చేసిరావచ్చు - అని తలచి వెంటనే తన అంగీకారాన్ని తెలియజేశాడు. "దానికేముంది నాయనా! అలాగే మీ వెంట వస్తాను. మీ పవిత్ర కార్యంలో సహాయపడడం కన్నా ఇక్కడ కూర్చొని నేను చేయబోయే రాచకార్యాలేమున్నాయి" - అన్నాడు వైరాగ్యం ప్రదర్శిస్తూ.

అన్నీ అనుకున్నట్లే జరుగుతున్నాయి. ఇక ఆలస్యమెందుకు? ఆ మోసగాళ్ళిద్దరూ ఒక రథాన్ని ఏర్పాటు చేశారు. అందరూ అందులో కూర్చొని ప్రయాణం సాగించారు. ప్రతిరోజూ బాబాకి రుచికరమైన భోజనం పెట్టి ఒక్కొక్క బంగారు నాణెం బహుమతిగా ఇస్తూవచ్చారు. బాబా వాళ్ళను పూర్తిగా నమ్మాడు. అతనికి వాళ్ళమీద ఎటువంటి శంకా కలగలేదు.

అలా మూడు రోజులు ప్రయాణించాక దట్టమైన అడవి

మన సమస్యలకు మూలకారణం బయట ప్రపంచంలో లేదు.

ఎదురైంది. ఇదే మంచి అవకాశం అని మోసగాళ్ళు రథం ఆపి, "బాబా, ఇది ఎత్తు పల్లాలతో కూడిన అడవి మార్గం. కొండ చరియన ఉన్న కాలిబాట మీద నడిచి వెళ్లాలి. ఎలాగోలా ఈ రాత్రికి అడవి దాటి ఆ ప్రక్కన ఉన్న ఊరికి చేరాలి. కాలిబాటన రథం పోదు. కాబట్టి చుట్టు తిరిగి ఊళ్లోకి వస్తుంది. గతుకుల దారిలో రథం మీద ప్రయాణం మీకు చాలా ఇబ్బంది కలుగుతుంది. కాలిబాట సమతలంగా ఉన్నది. మీరు కర్ర సహాయంతో నడిచినా ఒక గంటలో సుఖంగా ఊరు చేరుకుంటారు. మేము రథం తీసుకొని చుట్టుతిరిగి వస్తాము. సాయంత్రానికి అందరం అక్కడ కలుద్దాము" – అని అన్నారు.

బాబాకి సమస్య చక్కగా అర్థం అయింది. తన మంచికేగా వాళ్లు అంతగా చెపుతున్నది – అనుకొని రథం మీదనించి క్రిందికి దిగాడు. "బాబా! మీ దగ్గర విలువైన వస్తువులేవీ లేవు కదా! అడవితో వ్యవహారం. దొంగలు, మోసకారులు ఎదురవవచ్చు. కీడెంచి మేలెంచాలి కదా. తర్వాత ఏమనుకొనీ లాభం ఉండదు" – అన్నారు మోసగాళ్లు. వాళ్లను పూర్తిగా నమ్మిన బాబా ఎటువంటి అనుమానం లేకుండా నడుముకు కట్టుకున్న సంచి ఊడదీసి వాళ్ళకిచ్చాడు. వాళ్లిచ్చినదాంతో సహా సంపద మొత్తం సునాయాసంగా వాళ్ల అధీనంలోకి వచ్చేసింది. ఇంకేం కావాలి! రథం తిప్పుకొని వెళుతూ వాళ్లు "బాబా, జాగ్రత్తగా నడవండి. మీకేమీ పర్వాలేదు" – అని చెప్పి వాళ్ళ దారిన వాళ్లు పోయారు.

గుడ్డిబాబా కర్ర సహాయంతో ఒంటరిగా నడక సాగించాడు. కొంత దూరం నడిచిన తర్వాత ఒక వ్యక్తి దూరం నుండి బాబాని చూశాడు. అతడు కంగారు పడుతూ "బాబా! అటెక్కడికి వెళుతున్నారు? అటు దారిలేదు. పెద్ద గొయ్యి ఉన్నది. కాలు జారిందంటే అందులో పడిపోతారు. ఆగండి. ముందుకు వెళ్లొద్దు" – అంటూ కేకలు వేశాడు. బాబాకి అతడి మాటలు నమ్మబుద్ధి కాలేదు. వీడు తప్పకుండా దొంగయి ఉంటాడు. నా దగ్గరేమయినా ఉందేమో కాజెయ్యవచ్చన్న ఉద్దేశ్యంతో నన్ను ఆపుతున్నాడు. పాపం, వాళ్ళు ముందే చెప్పారు. అడవిలో దొంగలుంటారని" – అనుకుంటూ ఆ బాటసారి ఎంత త్వరగా తనని ఆపాలని వస్తున్నాడో అంతకన్నా వేగంగా ముందుకు నడిచాడు. అంతే. కాలు జారి ముందున్న పెద్ద గోతిలో పడిపోయాడు బాబా.

బాటసారి గబగబా పరుగెత్తుకొని వచ్చి గోతిలోకి దిగి బాబాను పైకి తీసుకువచ్చాడు. బాబా తలకి దెబ్బతగిలి పెద్ద బొప్పి కట్టింది. దెబ్బకు కట్టుకడుతూ బాటసారి చెపుతున్న మాటల ద్వారా విషయం మొత్తం అర్థమైంది బాబాకి. ఇప్పుడు చేయగలిగింది ఏముంది. తనలోని దురాశే తననీ స్థితికి లాక్కువచ్చింది. దెబ్బల బాధల మూలుగుతూ బాబా అతడితో ఇలా అన్నాడు – "కళ్లు లేకపోవడం వల్ల కాదు మనిషి గ్రుడ్డివాడయేది. అతడిలోని లోభగుణం వల్ల అతడు అంధుడౌతాడు. నాయనా! నీకు కనిపించిన వారికల్లా నాకథ వినిపించి ఇలా చెప్పు – ఎవరినీ ఎవరూ మోసగించలేరు. **ప్రతి మనిషీ తనలోని దురాశతోనే మోసగించబడతాడు.** లోభగుణం, దురాశ మనిషి సర్వస్వాన్నీ, ఆఖరికి ప్రాణాలని కూడా, హరించివేస్తుంది" అన్నాడు.

బాటసారి బాబా చెప్పిన మాటల గురించి ఆలోచిస్తూ ముందుకు సాగిపోయాడు.

★★★

## అగంతకుని ప్రజ్ఞ

*విశ్వవిఖ్యాతి చెందిన ఒక ఇంగ్లీషు రచయితకు బాల్యంలోనే ఒక కాలు విరిగిపోయింది. ప్రజలు అతడి భవిష్యత్తు అంధకార బంధురమని నిర్ధారించి సానుభూతిని ఒలకపోస్తూ అతడి దౌర్భాగ్యాన్ని నిందించేవారు. ఈయన ఎవ్వరి సానుభూతినీ లెక్కచేయలేదు. చుట్టూ లభిస్తున్న సానుభూతి అనే మురికి కూపం నుండి ఎంత త్వరగా బయట పడగలనా అని ఆలోచించసాగేడు. ఆయనలోని తపన, ప్రగతిపథంలో పరుగులు పెట్టాలనే జిజ్ఞాస ఆయనను ఒక సాహితీవేత్తగా తయారుచేశాయి. హెచ్.జి.వెల్స్ అనే పేరుగల ఈ మహనీయుని లేఖిని ద్వారా వెలువడిన సాహిత్యం విశ్వవిఖ్యాతి చెంది, ఉత్కృష్ట సాహిత్యంగా లెక్కించబడింది.*

*ఎవరైనా ఊహిస్తారా బాల్యంలోనే కాలు పోగొట్టుకొని, ప్రతికూల పరిస్థితుల మధ్య నలుగుతున్న అంగవిహీనుడైన ఒక వ్యక్తి ఇంతటి విస్తృత సాహిత్యాన్ని సృష్టిస్తాడని? వాస్తవం చెప్పాలంటే, సౌభాగ్యం, దౌర్భాగ్యం అనేవి పురుషార్థపు ప్రతిఫలాలే. వర్తమానం ఎంత ఉత్కృష్టంగా కనిపిస్తున్నప్పటికీ పురుషార్థం పట్ల విరక్తి కల్గి మనోబలం క్షీణిస్తే, భవ్యమైన భవిష్యత్తు అంధకార బంధురంగా తయారవుతుంది అనటానికి ఏ మాత్రం అనుమానం అక్కర్లేదు.*

– ప్రజ్ఞా పురాణం నుండి

**మన సమస్యలకు మూలకారణం మనలోనే ఉన్నది.**

నావారితో నామాట

# ఇక వరదానములు వర్షించబోతున్నాయి

గాయత్రీతీర్థ్, శాంతికుంజ్‌లోనే కాక మొత్తం భారతదేశమంతటా యుగవసంతము యొక్క ఆగమనం జరిగింది. ఫిబ్రవరి 6,7,8 తేదీలకు ముందే మన ఆరాధ్యదైవమైన పూజ్య గురుదేవుల శతాబ్దిసంవత్సర వేడుకలను ఎంతో ఉత్సాహంతో జరుపుకోవాలని నిర్ణయించడం జరిగింది. ఆ ప్రకారమే శాంతికుంజ్‌లో, గాయత్రీ తపోభూమి మధురలోనే కాక దేశమంతటా మూడురోజుల కార్యక్రమాలు జరిగాయి. అందరికీ ఆ దైవీసత్తా తమ సమీపములోనే ఉన్నదనే అనుభూతి కలిగింది. ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం 30,000 ప్రాంతాలలో మూడురోజులు ఒకేసారి దీపోత్సవం జరిగింది. మరి ఇది యుగవసంతము యొక్క ఆగమనమే కదా! చిన్నచిన్న దీపాలే దీనికి ప్రమాణంగా నిలచాయి. సామూహిక ధర్మానుష్ఠానము యొక్క పరిణామాలను అతి త్వరలో రాబోయే రోజుల్లో అందరూ చూస్తారు.

## ఒక విలక్షణ సాయంసమయం

ఫిబ్రవరినెల 20వ తారీకు ఆదివారం సాయంత్రం దేవసంస్కృతివిశ్వవిద్యాలయంలో కొత్తగా నిర్మించిన మృత్యుంజయ సభామండపంలో 'గురుదేవుల పేరుతో ఒక సాయంత్రము' అనే కార్యక్రమం చాలా ఉత్సాహంగా నిర్వహించబడింది. నాదయోగము ప్రత్యక్షప్రసారం చేయబడింది. తరువాత గురుసత్తాపై తయారుచేసిన సమర్పణ భజనా కార్యక్రమం మూడు గంటలపాటు నిర్వహించబడింది. మధ్యమధ్యలో గురుదేవుల సందేశము కూడా ఇవ్వబడింది. ఎంతో అద్భుతంగా జరిగిన ఈ కార్యక్రమం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. వసంతఋతువు ఉల్లాసాన్ని తీసుకువస్తుంది. వసంతఋతువు తరువాత ప్రారంభమయ్యే మాఘశుక్ల పంచమిని ఇందుకు ప్రతీకగా జరుపుకుంటారు. అసలు ఋతువు రావడానికి ముందే మాఘమాసంలో వసంతపంచమి ఋతుపరివర్తన సమయం రాబోతున్నదనే సూచననిస్తుంది. కృష్ణపాడ్యమినుండి ప్రారంభమయ్యే వసంతఋతువు వైశాఖమాసం పూర్తయ్యేంత వరకు వుంటుంది. ఈ మధ్యలోనే చైత్ర నవరాత్రులు మొదలౌతాయి.

ఈ వివరణ అంతా ఎందుకు చెప్తున్నామంటే వసంతఋతువు ఉల్లాసంగానే కాదు శక్తిసాధనపర్వ సందేశమును కూడా తీసుకువచ్చింది. మధ్యలోనే మహాశివరాత్రి కూడా వచ్చి మనల్ని శివశక్తులను జోడించమనే ఆహ్వానాన్ని అందిస్తుంది. ఈ ప్రక్రియ మొత్తం చాలా విలక్షణమైన రీతిలో జరుగుతుంది. వసంతపంచమి నుండి మహాశివరాత్రి వరకు వుండే సమయం ఇంకా విశేషమైనది. వసంతము మనల్ని శక్తిని పెంపొందించుకోమని చెప్తుంది. ఇలా వసంతము ప్రతి సంవత్సరము ఒక నూతన సందేశమును వెంట తీసుకొని వస్తుంది. దానిని మనము ఉపయోగించుకోలేక పోవడమనేది వేరే విషయం. ఈ ఆహ్వానం ప్రకృతికి, దైవీశక్తులకి అందరికీ ఇవ్వబడుతుంది. ఈ సంవత్సరం చైత్రనవరాత్రులు ఏప్రిల్ 4 నుండి 12 న శ్రీరామనవమితో సమాప్తమౌతాయి.

## శక్తిసాధనతో పాటు జరిగే మంత్రలేఖనా ఉద్యమము

ఈసారి విశేషమేమిటంటే ఈ శక్తిసాధనతో పాటు జరుపబడుతున్న మంత్రలేఖనా అభియానము. ఇది మహాశివరాత్రి నాటి నుండి మంగళప్రదంగా ప్రారంభించబడింది. 40రోజుల పాటు సాగే ఈ మంత్రలేఖన సాధన చాలా ఉత్సాహంగా ప్రారంభించబడింది. ప్రతిరోజూ 60 మంత్రాలు వ్రాయాలి (దాదాపు గంట-గంటన్నర సమయం పడుతుంది). ఇలా 40 రోజుల పాటు వ్రాయాలి. ఏప్రిల్ 12 శ్రీరామనవమి రోజు మంత్రలేఖనా అనుష్ఠానము పూర్తౌతుంది. చైత్రనవరాత్రికి పూర్ణాహుతి చేయబడుతుంది. మూడు సంవత్సరాలుగా జరుగుతున్న శతాబ్ది సంవత్సర పూర్ణాహుతి చేయబడుతున్నది. మంత్రలేఖనా ప్రక్రియ ఇప్పటితో ఆగిపోదు. మొత్తం శతాబ్ది సంవత్సరమంతా మంత్రలేఖన కార్యక్రమం జరుగుతూనే ఉంటుంది. ఆలస్యంగా ఈ సమాచారం తెలుసుకున్నవారు వెంటనే మొదలుపెట్టి శ్రీరామనవమినాటికి పూర్తిచేయవచ్చు. ఎవరైనా పూర్తిచేయలేకపోతే గాయత్రీ జయంతి (జూన్ 11,12) వరకు రాయవచ్చు. ఇంకా వ్రాయాలనుకునేవారు గురుపూర్ణిమ వరకు పెంచుకోవచ్చు. ఇంకా వ్రాయాలి అనుకునేవారు గురుపూర్ణిమ నుండి ఆశ్వయుజ నవరాత్రుల వరకు వ్రాయవచ్చు. మంత్ర లేఖనము 10 రెట్లు అధికఫలితాన్నిస్తుంది. అనగా 2400 మంత్రలేఖనం పూర్తి చేస్తే 24000 గాయత్రీ లఘుఅనుష్ఠానము

ఆలోచనలను సాత్విక ధోరణిలో ప్రసరింపజెయ్యాలి.

చేసిన పూర్తి చేసిన ఫలితం వస్తుంది. మొత్తం వ్రాయడం చేయలేనివారు 'ఓం భూర్భువ: స్వ:' అనే పంచాక్షరిని రాయవచ్చు. నియమము ఏమిటంటే వ్రాసేటపుడు మనస్సు నిరంతరము మంత్రము యొక్క అర్థము మీదనే ఉండాలి. అందరికీ సద్బుద్ధి, అందరికీ ఉజ్వలభవిష్యత్తుకై మనస్సులో ప్రార్థన చేస్తూ ఉండాలి.

## ఈ అవకాశాన్ని పోగొట్టుకోవద్దు

ఈ మంత్రలేఖన ప్రక్రియ విశ్వమంతటా విభిన్న భాషల్లో వ్రాయబడుతున్నది. హిందీ, ఇంగ్లీషు, గుజరాతీ, తెలుగు, మరాఠీ, గుజరాతీ, బెంగాలీ భాషల్లో పుస్తకాల పంపిణీ జరిగింది. వ్రాసిన పుస్తకాలనన్నింటినీ నేరుగా హరిద్వార్ పంపించడం జరుగుతుంది. (మీ సంకల్పపత్రముతో కలిపి). అలా వీలవకపోతే మీ సమీపంలో వున్న జోనల్ కార్యాలయంలో ఇవ్వవచ్చు (గాయత్రీ చేతనా కేంద్రం, హైదరాబాద్). మంత్రలేఖనాలన్నీ నవంబరు 6 నుండి 10 వరకు జరిగే మహాకుంభ కార్యక్రమంలో గంగానది ఒడిలో స్థాపించబడతాయి. ప్రతి నిత్యము వీటికి హారతి ఇవ్వబడుతుంది. ఆ కార్యక్రమానికి ప్రపంచం నలుమూలల నుండి వచ్చే లక్షలాదిమంది సాధకులు వీటికి ప్రదక్షిణ చేస్తారు. వాటన్నింటి సాధనా లాభము ఇప్పుడు భాగస్వామ్యులైన మంత్రలేఖనా సాధకులకు లభిస్తుంది. అందరికీ తెలియచేసేదేమంటే ఆలస్యమైనా సరే ఈ కార్యక్రమంలో అందరూ పాలుపంచుకోండి. ఇటువంటి అవకాశము మళ్ళీ మళ్ళీ రాదు.

## అత్యంత ఫలదాయకమైన నవరాత్రి

గురుదేవుల శ్రీచరణాలకు మనము మంత్రలేఖన సాధన, చైత్రనవరాత్రి సాధనల కంటే శ్రేష్ఠమైన దానిని ఇవ్వలేము. ఈసారి వస్తున్న చైత్రనవరాత్రులు శతాబ్ది సంవత్సరములో వస్తున్నాయి కనుక ఇవి ప్రత్యేక విశిష్టతను సంతరించుకొన్నాయి. ఈ సంవత్సరము మనము ఎన్నో కార్యక్రమాలు చేయవలసివుంది. ఆధ్యాత్మిక ఊర్జ (శక్తి) మనకి చాలా అవసరం. ఈ నవరాత్రులలో అనుష్ఠానమంతా చేయలేకపోయినా ప్రతి సాధకుడు కనీసం ఎంతోకొంత సాధన చేయాలనే సంకల్పం తీసుకొని పూర్తిచేయాలి. మంత్రజపంతో భావనకు అత్యధిక ప్రాధాన్యమున్నది. జపంతోపాటు ధ్యానమును కూడా జోడించగలిగితే ఎన్నో రెట్ల శక్తి వస్తుంది. వ్రత నియమాలను కూడా పాటించగలిగే శక్తిసామర్థ్యాలు ఉత్పన్నమౌతాయి. కోట్లాది మంత్రలేఖనములు జరుగుతున్నాయి. దానితోపాటే మంత్రజపం కూడా జరుగుతున్నది. ఈ జపం కూడా నవరాత్రి సాధనలో జరుగుతున్నది. దానితోపాటే గురుదేవులు వ్రాసిన సాహిత్య స్వాధ్యాయం కూడా జరుగుతున్నది. దీని పరిమాణం చాలా విలక్షణంగా వుంటుంది.

## పుణ్యమును ఎలా పంచాలో మేము నేర్పించాము

గురుదేవులు మూడు మాలల జపము అనే విధానం ద్వారా పుణ్యమును ఎలా పంచాలో మనకు నేర్పించారు. పుణ్యము మరియు కీర్తి పంచేకొద్దీ పెరుగుతాయి, కూడబెట్టుకుంటే తరిగిపోతాయి. మనకు గురుదేవులు **ఒకమాల ఆత్మకళ్యాణము కొరకు, రెండవమాల లోకకళ్యాణము కొరకు, మూడవమాల సమిష్టిగత విపత్తులను తొలగించమని దైవీసత్తాను ప్రార్థించేందుకు** చేయాలని నిర్దేశించారు. గురుదేవులు ప్రతి నిత్యమూ జపం చేసి ప్రతి నిత్యమూ పంచేసేవారు. ఎంత సంపాదించారో అంతకంటే ఎక్కువే పంచారు. ఆయన 24 లక్షల 24 పురశ్చరణల తపస్సును యుగపరివర్తన కొరకు సురక్షితంగా ఉంచారు. మరి మనము కూడా మన గురుదేవులకు నిజమైన శిష్యుల వలె తయారై పుణ్యమును పంచే భావముతో లోకకళ్యాణము కొరకు నియమిత జపమును చేసి ఆయన చరణాలకు సమర్పించాలి. జపమును భావవిహ్వాలతతో చేయాలి. ఇతరుల మేలు కొరకు చేసే సాధనలో ఖచ్చితంగా తనమేలు కూడా ఇమిడివుందని గ్రహించాలి.

## గాయత్రీ పరివార్ యొక్క కీర్తిని పెంచాలి

ఏ వ్యక్తియైనా తన కుటుంబము యొక్క కీర్తిని పెంచే పనులే చేస్తాడు. అప్పుడు అతని ఒక్కడిది మాత్రమే కాక అతని కుటుంబం యొక్క కీర్తికూడా పెరుగుతుంది. నిజాయితీపరుడైన ఒక దుకాణదారుడివల్ల అతని వంశము గురించి అందరికీ తెలుస్తుంది. ఒక గ్రామంనుండి ఒక ఐ.ఎ.ఎస్ ఆఫీసర్ తయారైతే ఆ గ్రామం యొక్క కీర్తి చుట్టుపక్కలంతా పాకిపోతుంది. గాయత్రీపరివార్‌కు చెందిన కార్యకర్త ఎవరైనా తపశ్చర్య, సమాజసేవ, సదాలోచనలను వ్యాపింపచేయుట వంటి ఉపయోగపడే కార్యక్రమాలు చేస్తే గాయత్రీపరివార్ యొక్క కీర్తి ఇనుమడిస్తుంది. ఈ శతాబ్దిసంవత్సరంలో మనము మన గాయత్రీ పరివార్ యొక్క కీర్తిప్రతిష్టలను పెంచే పనులు చేసిచూపించాలి. గురుసత్తా వాక్కులను మనము నిలబెట్టాలి మీ అంతరంగమును ఎప్పటికప్పుడు సరిదిద్దుకుంటూ కృతకృత్యులవాలి.

## ఈ సంవత్సరం తీసుకుంటున్న నూతన సంకల్పాలు

ఈ శతాబ్దిసంవత్సరం విప్లవాత్మకమైనది. రచనాత్మక కార్యక్రమాలకు ఒక కొత్త దిశను ఇవ్వబోతున్నది. ఈ

మనం ఉన్న పరిస్థితులకు మనమే కారణం, ఇతరులు కాదు.

సంవత్సరంలో సప్తక్రాంతులను (సప్తవిప్లవాలు) దేశంలోని వివిధ స్థానాలలో క్రియాన్వితం చేయాలి. విద్యావిస్తరణ కార్యక్రమాన్ని ప్రజలందరి వద్దకు చేర్చాలి. ఇవన్నీ ఎవరు చేస్తారు? ఎవరైతే గురుదేవుల అంగఅవయవములుగా మారారో ఆయన తపస్సు ద్వారా సంపాదించిన పుణ్యములో భాగస్వామ్యులైనారో వారు చేస్తారు.

ఈ వసంతపర్వము నాడు కొన్ని అతి ముఖ్యమైన ఘోషణలు చేయబడ్డాయి. దీని ద్వారా మిషన్ పని అనేకరెట్ల వేగంతో ఎన్నో మలుపులు తిరగడం చూస్తారు.

1. శాంతికుంజ్ యుగతీర్థములో, దేవసంస్కృతి విశ్వ విద్యాలయములో, ఆవల్‌ఖేడాలో నూతన నిర్మాణాలు జరుగుతాయి.
2. ప్రతి ప్రాంతములోనూ స్మృతి ఉద్యానవనాలు తయారుచేయబడతాయి.
3. పావనమైన గురుపూర్ణిమ రోజుల్లో (జూలై 15,16,17) ఒకేసారి ఒక కోటి వృక్షములు దేశమంతటా నాటబడతాయి.
4. గురుసత్తాపై రాసిన భజనలతో, పాటలతో ఒక్కో ప్రాంతంలో ఒక్కోచోట **'ఒక సాయంత్రం గురుదేవుల పేరుతో'** కార్యక్రమాలు జరుపబడతాయి.
5. విచారక్రాంతి ఎక్స్‌ప్రెస్ అనే పేరుతో నలభై రోజుల పాటు దేశమంతటా 'భారతీయరైల్వే' వారి సహకారంతో యాత్రా ప్రణాళిక తయారవుతున్నది.
6. గురుదేవుల స్మృత్యర్థం ఒక పోస్టల్‌స్టాంపు ఈ శతాబ్ది సంవత్సరంలో ఆవిష్కరింపబడుతుంది.
7. సంవత్సరమంతా దేశంలో ధ్యానశిబిరాలు మరియు రాష్ట్రజాగరణ కొరకై దీపయజ్ఞములు జరుపబడతాయి.
8. పరమపూజ్య గురుదేవుల జీవితముపై తయారుచేయబడ్డ వ్యాఖ్యానములు కేంద్రము ద్వారా నిర్వహించబడతాయి.
9. గురుసత్తా మీద ఒక సీరియల్ తయారుచేయబడుతున్నది. పవిత్రమైన ఆయన జన్మదినం (ఆశ్వయుజ కృష్ణ త్రయోదశి) రోజున అది ఆవిష్కరింపబడుతుంది.
10. గురుసత్తా జీవితములోని వివిధ పార్శ్వములను ఆధారంగా చేసుకొని పది పుస్తకములు వ్రాయబడుతున్నాయి. అవి ప్రచురణకు సిద్ధంగా వున్నాయి. ఇవి శతాబ్ది సంవత్సర ప్రత్యేక ప్రచురణలు. ఇవన్నీ కలిపి వేరుగా ఒక పుస్తకము ప్రచురింపబడుతుంది. ఇందులో ఎన్నో విలువైన ఉత్తరాలు, అనుభూతులు ప్రచురింపబడతాయి.

పరమపూజ్య గురుదేవుల జన్మశతాబ్ది సంవత్సర ప్రణాళిక మొత్తం యువతరంమీదనే ఆధారపడివుంది. గురుదేవులు మనకి సత్కర్మలు చేస్తూ సదుద్దేశముల కొరకే జీవిస్తున్నామనే విశ్వాసాన్ని కలిగించారు. ఇది అన్నింటికంటే చాలా గొప్పది. ఇలా తయారైనవారు ఎక్కడికి వెళ్ళినా, ఏ దేశంలో ఉన్నా అక్కడ కూడా గురుసత్తా పనే చేస్తారు. **అనుదానములు వర్షించబోతున్న ఈ సంవత్సరంలో మనం ఎంతవరకు సిద్ధంగా ఉన్నామని మనల్ని మనం ప్రశ్నించుకోవాలి. ఆ అనుదానములను స్వీకరించగలిగే స్థితిలో ఉన్నామా? ఏదేమైనా ఈ అవకాశాన్ని మాత్రం పోగొట్టుకోవద్దు.**

*– అఖండజ్యోతి, మార్చి 2011*
*అనువాదం : శ్రీమతి వల్లీశ్రీనివాస్*

## దేశం కోసం సామూహిక బలిదానం

ఫ్రాన్స్, ఇటలీల మధ్య యుద్ధం జరుగుతున్నది. ఇటలీలో ఎక్కువ లోతు, తక్కువ వెడల్పు వున్న ఒక నది ఉండేది. గ్రామ ప్రజలు ఆ నదిని దాటటానికి ఖర్జూరపు చెట్ల కర్రలతో వంతెన నిర్మించుకున్నారు. ఫ్రాన్స్‌సేన ఆ వంతెనను దాటి ఇటలీలో ప్రవేశించాలని ప్రణాళిక వేసుకున్నట్లు గ్రామస్థులకు తెలియడంతో వారు వంతెనను విరగ్గొట్టాలని నిశ్చయించుకున్నారు. గొడ్డళ్ళు తెచ్చి వంతెనను విరగ్గొట్టే ప్రయత్నంలో ఉండగా ఆ విషయం ఫ్రాన్స్ సైన్యానికి తెలిసి, వారి ప్రయత్నాన్ని ఆపాలని వారిపై గుళ్ళ వర్షం కురిపించసాగేరు. గ్రామస్థులు తుపాకి గుళ్ళకు బలియై ఆ నదిలో పడిపోయేంతవరకు పని ఆపనే లేదు.

ఈ విధంగా యువకులతో సహా మొత్తం గ్రామస్థులంతా చనిపోయారు. ఒక వృద్ధుడు మాత్రం మిగలగా అతడు అతి కష్టం మీద వెళ్ళి కర్ర వంతెన చాలా వరకు విరిగిపోయినట్లు గమనించి కొద్దిగా పట్టున్న భాగం మీద శక్తినంతా కూడదీసుకుని ఒక గెంతున బలంగా దూకాడు. దానితో కర్ర వంతెన పూర్తిగా విరిగి వంతెనతో సహ వృద్ధుడు కూడా నదిలో పడిపోయాడు. ఈ విధంగా గ్రామ జనాభా మొత్తం మరణించినప్పటికి వారు లక్ష్యాన్ని సాధించి ఫ్రాన్స్ సైన్యం గ్రామంలోకి ప్రవేశించకుండా చేశారు. ఇది సామూహిక గౌరవాన్ని పెంచే మహోన్నత కార్యక్రమం.

– ప్రజ్ఞాపురాణం నుండి

**వ్యతిరేక భావావేశ ఆలోచనలు రక్తాన్ని విష పదార్థాలతో నింపుతాయి.**

ఆరోగ్యమే మహాభాగ్యం - 5

# హోమియో వైద్య సేవ

**నేను గత రెండు సంవత్సరములుగా "అల్సరేటివ్ కొలైటిస్" అనే వ్యాధితో బాధపడుతున్నాను. డాక్టర్‌గారు ఈ వ్యాధి నివారణకై Mesacal O.D. టాబ్లెట్లు ప్రతిరోజూ రెండింటిని జీవితాంతం తీసుకోవాలన్నారు. ఇందుకొరకు హోమియో వైద్యంలో ఈ అల్సరేటివ్ కొలైటిస్‌కు తగిన మందులు ఉంటే సూచిగలరు.**

**– సి. హెచ్. చంద్రశేఖర్‌రెడ్డి, కలువాయి**

అల్సరేటివ్ కొలైటిస్ అనేది పెద్దప్రేగులకు వచ్చే అల్సర్ దీనికి ప్రత్యేకంగా ఒక కారణము అనేది ఇంకా తెలియలేదు.

వంశపారంపర్యముగా; మానసిక ఒత్తిడి; ఇన్ఫెక్షన్లు; ఫుడ్ అలర్జీలు.

పైన పేర్కొన్నవి కొన్ని కారణాలు. ఈ వ్యాధి లక్షణాలు :

విరేచనాలు బంక, రక్తంతో కూడి ఉంటాయి; కడుపులో నొప్పి; నీరసము; బరువు తగ్గుట; శరీరములో నీటిశాతము తగ్గుట.

ఇంతేగాక జీర్ణవ్యవస్థ సంబంధితం కాకుండా వేరే లక్షణాలు కూడా కొంతమందికి ఉంటాయి.

చర్మంపై పొక్కులు; కీళ్ళ నొప్పులు; కీళ్ళు ఎర్రబడటం; కాలేయంకి సంబంధించిన లక్షణాలు.

పై లక్షణాలు ఉన్నవారికి సిగ్మాయిడోస్కోప్, కొలనోస్కోపీ పరీక్షకి పంపి దానిద్వారా అల్సరేటివ్ కొలైటిస్‌ను నిర్ధారణ చేస్తారు.

ఈ వ్యాధి ఉన్నవారు ఆహార నియమాలు సరిగ్గా పాటించాలి.

**అల్సరేటివ్ కొలైటిస్ వ్యాధిగ్రస్థులు తినవలసిన ఆహార పదార్థాలు:**

- పెరుగు, మజ్జిగ, పన్నీరు, సోయాపాలు
- క్యాలీఫ్లవర్, క్యారట్, ఆలుగడ్డ, గుమ్మడికాయ, వంకాయ, సొరకాయ
- అరటిపండు, బొప్పాయి, ఆపిల్, సపోట, పుచ్చకాయ
- కాచి వడగట్టిన నీరు, తక్కువ పాలతో టీ, నారింజరసం, దానిమ్మ రసం, బత్తాయి రసం, నిమ్మరసం.
- నానబెట్టి పొట్టు తీసిన బాదంపప్పు, ఎండు ద్రాక్ష.
- అన్నం, గోధుమపిండి, జొన్నపిండి, శనగపిండి.
- నెయ్యి, రిఫైన్డ్ నూనె, కొబ్బరినూనె, వెన్న
- పెసరపప్పు, శనగపప్పు, మినపప్పు
- ఉడకబెట్టిన గుడ్లు 1–2 వారానికి, రోస్టెడ్ చికెన్.

**తినకూడని పదార్థాలు :**

- పాలు, ఐస్‌క్రీమ్, పాలతో చేసిన స్వీట్స్
- క్యాప్సికం, మెంతికూర, చిలగడదుంప, పచ్చికూరల సలాడ్, బెండకాయ, క్యాబేజి
- ద్రాక్ష, మామిడిపండు, జామకాయ
- మద్యం, కాఫీ, మిల్క్‌షేక్, కూల్‌డ్రింక్స్
- జీడిపప్పు, వాల్‌నట్, పల్లీలు, బెల్లం
- పచ్చిమిర్చి, వెనిగర్, టమోట సాస్, పచ్చళ్ళు
- పాప్‌కార్న్
- నువ్వుల నూనె, ఆవనూనె
- రాజ్మా, కందిపప్పు
- చేపలు, మాంసం

వ్యాధి ఎక్కువగా ఉన్నప్పుడు అనగా మలంలో బంక, రక్తం బాగా పడుతున్నప్పుడు క్రింది పదార్థాలు తినకూడదు.

- పీచు పదార్థం ఎక్కువగా ఉండేవి
- క్యాబేజి, మొలకెత్తిన గింజ ధాన్యాలు
- క్యాలీఫ్లవర్
- మొక్కజొన్న
- పొట్టుతో కూడిన గోధుమపిండి, దంపుడు బియ్యం
- టమాటో
- పచ్చి ఉల్లిపాయ
- మీగడ

ఆహార నియమాలు పాటించడం ఈ వ్యాధిగ్రస్తులకు చాలా ముఖ్యం.

- 8–10 గ్లాసుల నీటిని త్రాగాలి
- ఆహారాన్ని తక్కువ మోతాదులో ఎక్కువసార్లు తినాలి.

మీ లక్షణాలను బట్టి సరైన కాన్‌స్టిట్యూషనల్ హోమియో మందు వాడినచో ఈ వ్యాధి ఉపశమనం పొందవచ్చు. మీరు

**మన సమస్యలను పరిష్కరించే బాధ్యత మనదే, ఇతరులది కాదు.**

లెటరులో తెలిపిన లక్షణాలను బట్టి మీకు క్రింది మందులను సూచిస్తున్నాము. (ఈ మందులు అల్సరేటివ్ కొలైటిస్ వ్యాధిగ్రస్తులందరికీ వర్తించవు. తమ తమ లక్షణాలను బట్టి హోమియో వైద్యులు మందులను సూచిస్తారు). సల్ఫర్ 200 అనే మందును 4-5 పిల్స్ ఒక మోతాదు వేసుకోవాలి. 3 రోజుల వరకు మరే ఇతర మందులు వాడరాదు. నక్స్‌వామికా 200 ఈ మందు ప్రతిరోజు రాత్రి పడుకోబోయే ముందు ఒకసారి (4-5 పిల్స్) వేసుకోవాలి. ఇలా 15 రోజులు వాడి మరల వైద్యులను సంప్రదించండి.

## వేసవి తాపాలు

వేసవికాలం అనగానే స్కూల్‌కి సెలవులు. పిక్నిక్‌లు, ప్రయాణాలు, మామిడిపండ్లు అన్నీ గుర్తుకువస్తాయి. వేసవి కాలంతో పాటే కొన్ని ఆరోగ్య సమస్యలు కూడా వస్తాయి. ఈ శీర్షికలో సాధారణంగా వేసవిలో వచ్చే ఆరోగ్య సమస్యలు వాటికి ఇంట్లోనే హోమియో మందులతో చేసుకునే చికిత్సా విధానాలు మీకు అందిస్తున్నాము. హోమియో మందులు చాలా సరళమైనవి మరియు ఎటువంటి దుష్ఫలితాలు లేనివి కావున అందరూ ఎటువంటి సంకోచము లేకుండా ఈ మందులు వాడవచ్చు.

**వేసవిలో సాధారణంగా వచ్చే ఆరోగ్య సమస్యలు :**

- వడదెబ్బ
- కలుషిత నీటిని త్రాగటం ద్వారా, కలుషిత ఆహారం ద్వారా వచ్చే వ్యాధులు
  - గ్యాస్ట్రో ఎంటిరైటిస్: వాంతులు మరియు విరేచనాలు
  - టైఫాయిడ్
  - జాండిస్
- గొంతుకు సంబంధించిన ఇన్ఫెక్షన్లు
- వైరల్ ఇన్ఫెక్షన్లు
- శరీరంలో నీటిశాతం తగ్గటం వలన వచ్చే బాధలు
- దోమకాటు వలన వచ్చే రోగాలు మలేరియా; డెంగ్యూ; చికన్ గున్యా

**వేసవికాలం ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి తీసుకోవలసిన జాగ్రత్తలు :**

- ఎండలోకి వెళ్ళేటప్పుడు చమట పీల్చుకొనే కాటన్, నూలు వస్త్రాలు ధరించాలి.
- చేతులు పొడవుగా ఉండి టోపికాని గొడుగు కాని ధరించటం చాలా ముఖ్యం.
- కాచి వడబోసిన నీటిని మాత్రమే త్రాగటం చాలా మంచిది. బయటి నీరు త్రాగేటప్పుడు అవి శుభ్రమైనవా కాదా అని తెలుసుకొని త్రాగాలి. వీలైనంత వరకు ఇంటి నుండే కాచి వడబోసిన నీటిని తీసుకెళ్ళటం మంచిది.
- వేసవిలో చల్లటి నీటిని, జూస్, ఐస్‌క్రీమ్, కూల్‌డ్రింక్స్ త్రాగటం చాలామందికి అలవాటు. కాని ఒకేసారి వేడిలో ఇంత చల్లటివి త్రాగినా తిన్నా ఈ ఉష్ణోగ్రతలలో తేడా ఒకేసారి వచ్చినప్పుడు గొంతులో ఇబ్బందులు మొదలవుతాయి. అందువలన ఒకేసారి చాలా చల్లని వాటిని త్రాగవద్దు.
- ఆఫీసులలో, ఇంట్లో ఎ.సి. నుండి బయటికి ఎండలోనికి కూడా నేరుగా వెళ్ళవద్దు. కాసేపు ఎ.సి. నుండి బయటకు వచ్చి నీడలో కొంతసేపు ఉండి తరువాత ఎండలోకి వెళ్ళాలి. ఎందుకంటే అకస్మాత్తుగా వచ్చే ఈ ఉష్ణోగ్రతల తేడాను శరీరం తట్టుకోలేదు.
- రోజుకు 8-10 గ్లాసుల శుద్ధమైన నీటిని త్రాగాలి.
- ఎండాకాలంలో చమటలు ఎక్కువగా ఉంటాయి కావున శరీరంలో మంచి నీరు, లవణాలు ఎక్కువగా పోతాయి. నీటి కోసం నిమ్మరసం, జూసులు, మజ్జిగ మొ॥నవి తాగితే మంచిది.
- ఎండాకాలంలో దోమలవలన మలేరియా, డెంగ్యూ, చికన్ గున్యా వంటి వ్యాధులు కూడా ఎక్కువగానే ఉంటాయి. ఈ వ్యాధులు రాకుండా దోమకాటు నుండి రక్షించుకునే చర్యలు తీసుకోవాలి. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. దోమతెరలు, మస్కిటో రిపెల్లెంట్ క్రీమ్‌లను వాడాలి.
- ఈ కాలం బయటి త్రాగే జూస్‌లు, చెరుకురసం వంటి వాటివలన కూడా ఫుడ్ పాయిజనింగ్ అయ్యే ప్రమాదం ఉంది. కాబట్టి సాధ్యమైనంత వరకు ఇంటిలోనే తయారు చేసుకోవడం ఉత్తమం.
- పండ్లను బాగా కడిగిన తరువాతే జ్యూస్ చేసుకోవాలి.

పైన పేర్కొన్న జాగ్రత్తలు పాటిస్తే వేసవికాలంలో వచ్చే సాధారణ ఆరోగ్య సమస్యలు 80% రాకుండా చూసుకోవచ్చు.

హోమియో మందులు తరుణ వ్యాధులలో చాలా బాగా పనిచేస్తాయి. ఈ కాలంలో వచ్చే పై సమస్యలకు ఇంట్లోనే వాడుకొనే హోమియో మందుల గురించి వివరిస్తున్నాము.

**వడదెబ్బ :** వడదెబ్బ ఎండాకాలంలో సంభవించే బాధ. పరిసరాలలోని అధిక ఉష్ణోగ్రతకు గురికావడం వల్ల శరీర

**ఆలోచనలు శక్తితో చైతన్యవంతంగా ఉంటాయి.**

ఉష్ణోగ్రత నియంత్రణ సరిగా పనిచేయక చెమట పోయడం ఆగి, ఉష్ణోగ్రత అధికమై ఇతర లక్షణాలతో బాటు మూర్ఛ, మరణం సంభవించవచ్చు.

**వడదెబ్బ తగలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు :**

➢ ఎండలో ఎక్కువగా తిరగరాదు. అవసరమై వెళ్ళవలసి వస్తే నెత్తికి గొడుగు లేదా టోపి రక్షణగా వాడాలి.

➢ తగినన్ని నీళ్ళు తాగాలి.

➢ వేసవిలో వదులైన నూలు దుస్తులు ధరించాలి.

➢ కారం, మసాలా పదార్థాలు తినడం తగ్గించాలి.

**వడదెబ్బ తగిలినప్పుడు పాటించవలసిన నియమాలు :**

➢ రోగిని నీడపట్టున చేర్చాలి. దుస్తులను వదులుగా చేసి తడిగుడ్డతో ఒళ్ళంతా తుడవాలి.

➢ రోగికి తగినంత గాలి ఆడేటట్లు చేయాలి. రోగి చుట్టూ గుమిగూడకూడదు.

➢ వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే చల్లబరచాలి.

➢ వీలయితే రోగిని చల్లని నీటిలో ముంచాలి (టబ్ వంటివి లభిస్తే) చల్లటి, తడి బట్టలలో చుట్టాలి. చల్లని తడి బట్టతో ఒళ్ళంతా అద్దుతూ ఉండాలి.

➢ రోగి ఉష్ణోగ్రత $101^0$ సెంటిగ్రేడ్‌కు పడిపోయినప్పుడు చల్లని నీటిలో నుంచి తీసేసి చల్లటి గదిలో సౌకర్యంగా పడుకోబెట్టాలి.

➢ ఉష్ణోగ్రత మళ్ళీ పెరుగుతున్నట్లయితే మళ్ళీ పై విధంగా సూచించినట్లు చేస్తూ పోవాలి.

➢ రోగి త్రాగగలిగితే చల్లని పానీయాలు ఇవ్వాలి.

➢ వైద్యులను సంప్రదించాలి.

➢ పచ్చి మామిడి ముక్కలను నీళ్ళలో ఉడకబెట్టి అందులో నీళ్ళు, పంచదార కలుపుకుని త్రాగితే వడదెబ్బ తీవ్రత నుండి ఉపశమనం లభిస్తుంది.

➢ బల్లడోనా-200 కొందరు వడదెబ్బకు గురైనప్పుడు తీవ్రంగా జ్వరం వస్తుంది. కీళ్ళు బాగా ఎర్రబడతాయి. వీరికి బెల్లడోనా-200 మందును ప్రతి అరగంటకు లేదా గంటకు ఒకసారి చొప్పున తరచూ ఆ రోజంతా వేస్తే వడదెబ్బ ప్రభావం తగ్గిపోతుంది.

➢ గ్లోనైన్-200 వడదెబ్బకు చాలా మంచి మందు. ఇది ప్రతి 15 ని॥లకు ఒకసారి చొప్పున రోగి లేచేవరకు ఇవ్వాలి.


<u>సలహాల కొరకు సంప్రదించవల్సిన చిరునామా</u>

**డా॥ టి. నీలవేణి,** బి.హెచ్.ఎమ్.ఎస్.
ఆర్.ఎన్..జి. అడ్వాన్స్‌డ్ హోమియో క్లినిక్
ఇ.నెం. 3-211, యశోద గార్డెన్స్ దగ్గర,
శాంతినగర్, కూకట్‌పల్లి, హైదరాబాద్ - 500 072.
ఇ-మెయిల్: drneelaveni@gmail.com


ఈ శీర్షిక హోమియో వైద్య విధానం మీద అవగాహన పెంచుకోవడానికే దయచేసి స్వంత వైద్యం ప్రయత్నించవద్దని మనవి.

## అధ్యక్ష పదవికి అర్హతలు

నది పూర్తిగా నిండి వేగంగా ప్రవహిస్తున్నది. ఒడ్డున ఉన్న ఇద్దరు పిల్లలు పొరపాటున నీటిలో కొట్టుకుపోతున్నారు. ఆ పిల్లల తల్లి ఒడ్డునుండి కేకలు వేస్తున్నది. కాని ప్రాణాలకు తెగించి ఉరకలు వేస్తున్న నదిలోకి దూకి ఆ పిల్లలను రక్షించే సాహసవంతులు లేరెవ్వరు అక్కడ. లిప్తకాలంలో ఒక యువకుడు మెరుపులా వచ్చి అమాంతం నదిలోకి దూకి పిల్లలను వీపుమీద ఎక్కించుకొని, ప్రవాహానికి ఎదురీది ఒడ్డున చేరుకున్నాడు. పనికిరాని పరామర్శలతో, అక్కరలేని పరిశీలనతో క్షణకాలం వృధాచేయక అవసరాన్ని గుర్తించి కార్యరంగంలోకి దూకిన యువకుడు ఎవరో కాదు జార్జి వాషింగ్టన్. ఈయన అమెరికా అధ్యక్షుడు కావటానికి కలిగి ఉన్న అర్హతలు ఇటువంటివేగాని ఓట్లు, కోట్లు కాదు.

భగవంతుడు మనిషిని దీనునిగా, హీనునిగా నిర్వీర్యునిగా సృష్టించలేదు. మహోన్నతమైన సంస్కారాలు ప్రతి ఒక్కరికి ప్రసాదించాడు. కాని ఈ అనంతమైన సంస్కార సంపదను ఎవరు ఎంతవరకు ఉపయోగించుకున్నారో, దానిని బట్టే వారి జీవితాలు ఉంటాయి. ఉదారులు మనకు ఎంతో ఈయవచ్చు. వారిచ్చినంతమాత్రాన మనం గొప్పవాళ్ళం కాలేము. దానిని సక్రమంగా వినియోగించుకోవడం కూడా తెలియాలి. ఉన్నదాన్ని ఉపయోగించుకోవడాన్ని బట్టి వ్యక్తి గొప్పవాడు కాగలడు కాని లభించిన దాన్ని బట్టి గొప్పవాడు కాలేడు.

– ప్రజ్ఞాపురాణం నుండి

**ఆత్మబలాన్ని మించిన బలం లేదు.**

# వేమన వేదం-జీవన నాదం - 6

నిత్యసత్యాలను, నిర్మొహమాటంగా, నిర్భయంగా వెలువరించ బడటంతోపాటు, చీకటిని తొలగించే దీపం ఎలా మార్గదర్శనం చేస్తుందో అదేవిధంగా జీవితసత్యాన్ని అర్థవంతంగా చెప్పిన ఘనత వేమనది. ఈ "దేశికవిత" ను తన ప్రసన్నధారతో ప్రాచుర్యంలోకి వేమన తెచ్చాడు

**ఎంత కడుగనోటి యెంగిలి పోవునే**
**ఎల్లకాలమందు నెంగిలితగున**
**ననుదినంబు చూడ నన్నృతమాడెడు నోరు**
**విశ్వదాభిరామ వినురవేమ !**

ఈ పద్యంలో అబద్ధమాటడం ఎంత నీచమైనదో తెల్పుతూ, అసత్యాలు పలికే అలవాటు ఉన్నవాడు, ఎంగిలి బ్రతుకును గడుపుతున్నట్లేనని నిర్ద్వంద్వంగా చెప్పాడు వేమన.

మహాభారతంలో వ్యాసుల వారు తెల్పిన సత్య మహిమను నన్నయ్య ఇలా చెప్పారు. **"సుతశతంబుకంటె నొక సూనృత వాక్యము మేలు సూడగన్"** అని వందమంది పుత్రులు చేసే మేలుకంటే ఒక్క సత్యవాక్యము చేసే మేలు చాలా గొప్పది.

అలాగే మరో సందర్భంలో వేయి అశ్వమేధయాగాలు ఇచ్చే ఫలితంకంటే ఒక్క సత్యనిష్టే చాలా గొప్పది అని చెప్పారు. సత్యవ్రతం ఎంత మహిమకలదో, అంత కష్టాన్ని కూడా కల్గిస్తుంది. అందుకే ఎన్ని కష్టాలు ఎదురైనా, 'సత్యనిష్ట' కే అంకితమైన హరిశ్చంద్రుడు **"సత్య హరిశ్చంద్రుని"గా** ధృవతారగా మారాడు.

పై పద్యంలో నోటిలోని నాలుక నరంలేనిది, ఎలాబడితే అలా మాట్లాడుతుంది. దానిని అదుపులో పెట్టుకోవడం వివేకవంతుల లక్షణం అన్న భావాన్ని గ్రహించాలి.

**"సత్యాన్నాస్తి పరోధర్మః"** అన్న శృతి వాక్యాన్ని బట్టి సత్యమును మాట్లాడే అలవాటు చేసుకోవాలి. అబద్ధం ఎంత అందంగా ఉన్నా, తర్వాత అది చెప్పినవాడి బండారం బయటపడినపుడు, అంతకంటే భయంకరమైన విషయంగా మరొకటి ఉండదన్పిస్తుంది. అందువల్ల 'ఎంగిలి' ఎంతనీచమైనదో అంతటి నీచమైనదే అబద్ధం చెప్పడం కూడా. అందువల్ల అసత్యాలు పలకడం అన్న అలవాటు తగదని వేమన పేర్కొన్నాడు. లోకంలో ప్రతి ఒక్కరూ ఇతరుల మెప్పును కానీ, విమర్శనుకానీ లెక్కించకుండా, తన మార్గంలో తాను సాగిపోతూ, తన లక్ష్యాన్ని చేరుకునే ప్రయత్నం చెయ్యాలి. అంతేగాని ఇతరులు పొగిడినపుడు పొంగిపోవడం, తెగిడినపుడు కృంగిపోవడం చేయడం తగదు. మన లక్ష్యాన్ని సాధించినపుడు, గతంలో మనలను విమర్శించినవారే మనకు చేరువకాగలరు. ఈ నిజాన్ని వేమన ఇలా చెప్పారు.

**ఓగునోగుమెచ్చు నొనరంగనజ్ఞాని**
**భావమిచ్చి మెచ్చు పరమలుబ్ధు**
**బందిబురదమెచ్చు, పన్నీరు మెచ్చునా?**
**విశ్వదాభిరామ వినురవేమ !**

**"యద్భావం తద్భవతి"** ఎవరికి ఏ భావము మనస్సులో ఉండునో వారు అందరినీ అదే భావంతో పరికిస్తారు. పచ్చకామెర్ల రోగికి లోకమంతా పచ్చగా అగుపించినట్లే, చెడ్డవాడు చెడ్డవాడిని, లోభి మహాలోభిని, అజ్ఞాని మరో అజ్ఞానిని మెచ్చుకుంటాడే తప్ప, యదార్థాన్ని, సత్యాన్ని మెచ్చుకోడు. పంది ఎలా అయితే తన స్వభావానికి తగిన బురదను ఇష్టపడుతుందే తప్ప పన్నీరును ఇష్టపడదు. పన్నీటి సుగంధం కన్నా బురదలోని దుర్గంధాన్నే ఆస్వాదిస్తుంది. కాబట్టి మంచితనాన్ని, మంచిని మెచ్చుకునేవారు తక్కువ సంఖ్యలో ఉన్నప్పటికీ, మంచికి ఉన్న విలువ ఎప్పటికీ తరగదు.

మరో కోణంలో చూస్తే, భగవద్గీతలోని "నిష్కామకర్మ" ను వేమన ఈ సందర్భంలో గుర్తుచేస్తాడు. **"కర్మణ్యేవాధికారస్తే, మాఫలేషు కదాచన"** అన్న శ్లోక భావాన్ని అన్వయించుకోమని చెప్పాడు. కర్మయందే నీకు అధికారము కలదు. ఫలితమునందు కాదు. అంటే ఎవరు నిందించినా, బాధపడకుండా, ఎవరి మెప్పుకోసం ప్రాకులాడకుండా ఉంటాడో అతడే "నిష్కామయోగి". కాబట్టి మంచి పనులు చేసేటప్పుడు పైన చెప్పిన పద్యంతోబాటు, భర్తృహరి శ్లోకం కూడా గుర్తుంచుకోవాలి.

**నిందంతు, నీతి నిపుణాః, యదివాస్తువన్తు**
**లక్ష్మీః సమావిశతుగచ్ఛతువా యదేష్టమ్ ।**
**అద్యైవామరణమస్తు, యుగాంతరేవా**
**న్యాయాత్ పథః పదంన ప్రవిచలంతి ధీరాః ॥**

ధీరులు తాము నమ్మిన న్యాయాన్ని, ధర్మాన్ని ఆచరించే యత్నంలో ఎటువంటి ఆటంకాలు, అవరోధాలు నీలాపనిందలు, ఆర్థికపరమైన అడ్డంకులు, మృత్యుభయాన్ని కూడా లక్ష్యపెట్టక తమ ధర్మాన్ని ఆచరిస్తారు. కాబట్టి మనం ఆచరించే పనిని ఇతరులు మెచ్చుకోకపోయినా పర్వాలేదు. నలుగురికి మంచి జరిగితే చాలు అన్న ఆలోచన కలిగి ఉండాలి.

స్నేహాన్ని, సహజీవనాన్ని ఎలాగడపాలో వేమన ఇలా వివరించారు.

**కాని వాని తోడఁగలసి మెలంగిన**
**హానివచ్చునెంతవానికైన**
**కాకిగూడి హంస గష్టంబు పొందదా!**
**విశ్వదాభిరామ వినురవేమ ॥**

**శరీరం ఆలోచనలకు అనుగుణంగా స్పందిస్తుంది.**

మైత్రీ బంధం చాలా గొప్పది. ఇతరులలోని మంచి గుణాలను చూసి, వారి సాంగత్యంలో కొన్ని లక్షణాలైనా అలవర్చుకోవాలనుకుని స్నేహాన్ని ఆచరించాలి. ఇతరులు అవలక్షణాలతో, అభ్యంతరకరమైన ప్రవర్తన కల్గి ఉంటే, ఖచ్చితంగా ఆ వ్యక్తితో చెలిమిని తెంచుకోవాలి. లేదంటే మన ఉనికికే భంగం వాటిల్లుతుంది.

ఇనుము అగ్నితో చెలిమి చేయడం వల్ల (కర్మాగారాలలో) సుత్తి దెబ్బలు తగిలి తన ఆకృతిని కోల్పోయి, వేరే ఆకారాన్ని దాలుస్తుంది. గాలి పూలతో స్నేహం చేస్తే ఆ మలయమారుత సౌరభాన్ని అందరూ ఆస్వాదిస్తారు. అంతేగాని దావాగ్నితో స్నేహం చేయడంవల్ల అందరి దూషణ, తిరస్కారాలను పొందుతుంది.

ఉత్తమ స్నేహితుడు, దానశీలి, స్నేహంకోసం ప్రాణమిచ్చిన కర్ణుడు దుష్టమైత్రివలన "దుష్టచతుష్టయం"లో ఒకడిగా పరిగణింపబడి, అపఖ్యాతిపాలయ్యాడు. అర్జునుడు శ్రీకృష్ణ భగవానుని సాన్నిహిత్యంలో జగద్విఖ్యాత వీరుడయ్యాడు.

కాబట్టి రాజహంసలు కూడా, పిండమును భుజించే కాకులతో స్నేహం చేస్తే వాటి ఔన్నత్యాన్ని కోల్పోయి, నీచత్వాన్ని పొందుతాయన్న సత్యాన్ని వేమన వివరించాడు.

కులము కన్నా గుణము ముఖ్యమన్న లోకధర్మాన్ని వివరిస్తూ, గుణవంతులున్న వంశమే నిజమైన వంశము. ఒక్క దీపం చాలు, చుట్టూ ఉన్న చీకటిని తొలగించడానికి. ఒక్క మేఘం చాలు. శూన్యమైన ఆకాశానికి కూడా పరమార్థాన్ని కల్పించడానికి. వెయ్యి నక్షత్రాలు ఉన్న కానరాని కాంతి, ఒక్క చంద్రుడి వల్ల కలుగుతుంది. ఆ భావాన్నే ఇలా చెప్పాడు.

**కులములోన నొకడు గుణవంతుడుండెనా**
**కులము వెలయు వాని గుణము చేత**
**వెలయు వనములోన మలయజంబున్నట్లు**
**విశ్వదాభిరామ వినురవేమ !**

ఇక్ష్వాకు వంశంగా పిలువబడే సూర్యవంశం, రఘు మహారాజు ఔన్నత్యం వల్ల రఘువంశంగా ప్రసిద్ధి చెందింది. యయాతి, శర్మిష్ఠలకు జన్మించి "పురువు" తన యౌవ్వనాన్ని తండ్రికి ధారపోసి వంశానికే వన్నె తెచ్చాడు. ఆ వంశం పురువంశంగా, క్రమంగా కురువంశంగా మారింది. భీష్ముడు, రాముడు వంటి ఎందరో మహనీయులు జన్మించడం వల్ల వంశమే కాదు లోకాలు కూడా తరించాయి. రాక్షసుడైన హిరణ్యకశ్యపునకు ప్రహ్లాదుడు జన్మించి, ఆ వంశానికి వన్నె తెచ్చాడు.

ఎన్నో వృక్షాలు ఉన్నప్పటికీ వనానికి "మలయజం" (గంధపు చెట్టు) వల్ల ఎలా సౌరభం వస్తుందో, ఒక్క ఉత్తముని వల్ల వంశం విరాజిల్లుతుంది.

కావున ప్రతిపుత్రుడు తన ప్రవర్తనవల్ల తల్లిదండ్రులకు, తోబుట్టువులకు, అన్నితరాలకు మంచిపేరు ప్రతిష్టలు కలిగేలా ప్రవర్తించాలి. శకుంతల, దుష్యంతులకు జన్మించిన భరతుని చిహ్నంగా భారతదేశానికి పేరు రావడం ఆ మహనీయుని ఆదర్శపాలనను తలపింపచేస్తోంది.

అలాగే 'వేమన' అభిప్రాయం ప్రకారం గుణము కల్గినవాడు ఏ కులంలో జన్మించినప్పటికీ ఉత్తముడే. గుణ ప్రధానమైనదే కులము. బోయవాడైనప్పటికీ నారద అనుగ్రహంతో రామాయణాన్ని రచించిన వాల్మీకి, భారతాన్ని రచించిన వేదవ్యాసుడు (మత్స్యకారుల కులమునందు జన్మించినప్పటికి) యాదవుడైనప్పటికీ శ్రీకృష్ణ భగవానుడు బోధించిన భగవద్గీత నిత్యస్మరణీయం, సదా ఆచరణీయం. కావున అభ్యుదయవాది అయిన వేమన బోధించిన సామాజిక తత్త్వసారాన్ని గ్రహించి, పాటించడమే నేటి మానవుల విధి.

ఈ భావాలను అర్థం చేసుకోకుండా, తమ చిత్త వృత్తి ప్రకారం నడుచుకునే వారికి మరోవిధంగా ఈ క్రింద సూచించిన పద్యంలో హితబోధ చేసారు.

**కులములోన నొకడు గుణహీనుడుండెనా**
**కులము చెడును వాని గుణమువలన**
**ఎలమి చెఱుకునందు నెన్నుపుట్టినరీతి**
**విశ్వదాభిరామ వినురవేమ !**

చెడుగుణములు కలవాడు ఒక్కడు ఉంటేచాలు మొత్తం వంశమంతా అపకీర్తి పాలౌతుంది. కుండలోని పాలు విరిగిపోవడానికి ఒక్క ఉప్పురాయి ఎలా కారణమో అలాగే ఒక దుష్టుడు వంశనాశకుడు మాత్రమే కాక, లోకకంటకుడుగా మారి, అందరిని హింసించి కష్టాలు కల్గిస్తారు.

ఎంతోగొప్ప మహర్షి అయిన కశ్యపునికి జన్మించిననూ, తమ చెడ్డగుణాల వల్ల రాక్షసులు తమ వంశానికి అప్రతిష్ట తెచ్చారు.

విశ్వవోసుబ్రహ్మకు జన్మించినప్పటికీ, రావణుడు పరకాంత పట్ల వ్యామోహంతో వంశనాశనానికి కారకుడయ్యాడు.

చెఱుకుగడ ఎంతో తియ్యగా ఉంటుంది. కానీ ఆ గడ మధ్యలో ఎన్ను (చేదుగుణం కల్గిన భాగం) ఉంటే ఆ మాధుర్య ఆస్వాదనకు ఎలా భంగం అవుతుందో అలాగే దుర్జనుడైన పుత్రుని వల్ల వంశనాశనం కల్గుతుంది.

కాబట్టి ప్రతి ఒక్కరూ తాము చేసే ప్రతి పనిపైనా వంశ ప్రతిష్ఠ ఆధారపడి ఉందన్న సత్యాన్ని గ్రహించి, సక్రమంగా ప్రవర్తించాలి అని వేమన పద్యాలు బోధిస్తున్నాయి. వాటిని ఆచరించడమే మన కర్తవ్యంగా భావిద్దాం.

– సాధన నరసింహాచార్య

**కోపంతో బి.పి. పెరుగుతుంది.**

"అష్టసిద్ధి నవనిధి కే దాతా । సబ్ సమర్థ గాయత్రీ మాతా"

# గాయత్రీ మాతా విగ్రహ ప్రతిష్ట

## గుంటూరు జిల్లా, నర్సరావుపేట మండలం, లక్ష్మీపురం గ్రామంలో

మార్చి 18 మరియు 19 తేదీలలో (2011), లక్ష్మీపురం గ్రామము, నర్సరావుపేట రూరల్ మండలం, గుంటూరు జిల్లాలో డా॥ మారెళ్ల శ్రీరామకృష్ణ మాష్టారి సమక్షములో. వేదమాత, దేవమాత, విశ్వమాత మరియు అష్ట సిద్ధి నవనిధి కే దాత సబ్ సమర్థ గాయత్రి మాత విగ్రహ ప్రతిష్ట, లక్ష్మీపురం గ్రామంలో జరిగినది.

కాకాని గ్రామ పంచాయతీ శివారు గ్రామమైన లక్ష్మీపురం 50 గృహాలు కలది. ఇది కాక హరిజనుల కాలనీ కూడా ఉన్నది. ఈ చిన్న గ్రామములో గురు స్త్రీ మూర్తులతో గాయత్రీ మహిళా మండలి స్థాపితమై గత 5 సం॥ల నుండి పని చేయుచున్నది. వీరిలోనున్న సమర్పణ, సేవా, దృఢ సంకల్పములు వీరిని గాయత్రి మందిర నిర్మాణము వైపు ప్రేరేపించినవి. తత్ఫలితముగా గత 3 నుండి 4 సంవత్సరములు తదేక దీక్షగా ఆ నలుగురు మహిళా కార్యకర్తలైన వెంకటలక్ష్మి, నాగమణి, కృష్ణవేణి శ్రీమతి అనిత, నాయకత్వములో... లక్ష్మీపురం చుట్టు ప్రక్కలనున్న 24 గ్రామాలలో క్రమపద్ధతిలో రాత్రివేళల సత్సంగములు నిర్వహిస్తూ వచ్చారు. దీనితో ఆయా గ్రామాలలోని ప్రజలు ప్రభావితులై, గాయత్రీ మందిర నిర్మాణమునకు కావలసిన సంపూర్ణ సహాయ సహకారములనందించుటకై ముందుకువచ్చి అనితను ఆమె సహచరులను ప్రోత్సహించిరి. దీనికి తోడు గ్రామములోనున్న హరిజనవాడలోని ప్రజలు కూడా గాయత్రీ మాత పట్ల విశ్వాసమునొంది, వారి వంతు సేవలనందించుటకు స్వచ్ఛందముగా ముందుకు వచ్చిరి. శ్రీమతి అనిత బృందము ఆర్థిక సేవలతోపాటు, తమ శ్రమ శక్తిని కూడా ఆలయ నిర్మాణమునకై వెచ్చించుట మిగుల ఆదర్శ ప్రాయము. ఇవన్నీ ఒక ఎత్తుకాగా, శ్రీమతి అనిత గారి, గాయత్రీ సాధనా శక్తి మరియు ఆమె బృందము సాధనా శక్తులు, ఈ మందిర నిర్మాణానికి వలసిన దైవీశక్తుల తోడ్పాటును అందించినవని చెప్పుటకు ఈ క్రింది విషయమే గొప్ప తార్కాణం.

మందిర నిర్మాణ వ్యయముతో దుర్గ నవరాత్రివేళ ఒక రోజు ఉదయాన్నే 7 గంటలకు ఒక నడి వయస్కురాలైన స్త్రీ యాచనకై లక్ష్మీపురం చేరినది. ఆమె గ్రామాన్ని ఆనుకొని ప్రవహించుచున్న వంట కాలువలో స్నానమాచరించి, తడి బట్టలతో అందుబాటులోనున్న అరటి చెట్టు నుండి ఆకును తీసికొని నేరుగా శ్రీమతి అనిత ఇంటికి చేరుకొని, ఆకలిగానున్నది. భోజనము వడ్డించండి" అని కోరినదట. ఇంటిలోనివారు పొలము పనులకు వెళ్లుటకై ఆహారాన్ని ఉదయాన్నే సిద్ధము చేసిరి. దానిలో నుండి వడ్డించారు. ఆ యాచకురాలు తాను భుజించే ముందు ఇంటిలోని వారందరిని పిలచి తలకొకముద్ద అన్నాన్ని పెట్టబోగా యాచకురాలనెడి భావనతో ఆమె నుండి తీసికొనుటకు నిరాకరించిరి. శ్రీమతి అనితను, పద్మ అనెడి పేరుతో పిలచి, తానుతిన్న ఎంగిలి విస్తరణను తాను తీయనని, పద్మ తీయాలని చెప్పి వెళ్లిపోయినదట. ఆ తదుపరి కొన్ని నెలల తరువాత శివుని దర్శించుటకై శ్రీశైలం అనిత తన సహచరులతో వెళ్ళినది. ఇంతలో ఒక స్త్రీ వచ్చి అనిత చేతిలో అరటి పండు పెట్టి వెళ్లిపోయినదట. అంతలోనే ఆ ప్రక్కనే మూసి ఉన్న ఆలయ తలుపులు తెరువబడగా, అనిత బృందం సునాయాసముగా గుడిలో ప్రవేశించి శ్రీశైల భ్రమరాంబ మల్లిఖార్జున దర్శనం గావించుకొనివచ్చిరి.

**ప్రాణ ప్రతిష్టా ప్రక్రియ వివరము :** 18వ తేదీ సాయంత్రము 6 గంటలకు, గ్రామములోనున్న ఆంజనేయ స్వామి మందిరములో ఉంచిన, వినాయకుని మరియు గాయత్రీ మాత విగ్రహాలను, కలశములతోపాటు ఊరేగించి, విగ్రహ ప్రతిష్ట చేయవలసిన ప్రదేశానికి తీసికొనివచ్చిరి.

19వ తేది ఉదయం ఖచ్చితంగా సూర్యోదయ సమయాన వినాయకుని మరియు గాయత్రీ మాత విగ్రహాలను, నిర్దేశించిన ప్రదేశములపై, ఆయా దేవతల తామ్ర యంత్రాలను ముందుగా స్థాపించి, దానిపై మూర్తులను ఆశీనుల గావించిరి.

దేవాలయ ద్వారానికి ఎదురుగానున్న స్థలములో 70 ఇటుకలతో యజ్ఞ కుండములను నిర్మించి దానిపై 508 ప్రమిదలనుంచిరి. దీపయజ్ఞానికి ముందు పూజ్యులు డా॥ మారెళ్ల శ్రీరామకృష్ణ మాష్టారు గాయత్రి సాధనతో లభించెడి అష్టసిద్ధులు మరియు నవనిధుల గురించి సవివరముగా తెలియజేసిరి. అటు పిమ్మట దక్షిణ భారత ప్రధాన సంచాలకులు గాయత్రీ పరివార్ శ్రీ అశ్విని సుబ్బారావుగారు ప్రజ్ఞా పురాణ కథలను అత్యంత మనోరంజకముగా వీనుల విందుగా ప్రవచించిరి. దీనికి పూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య ప్రజ్ఞా గీతాలను జోడించి

**ఆలోచనలలో మార్పులు తెచ్చుకొని అనారోగ్యాన్ని బయటకు నెట్టివేయవచ్చు.**

పూల్ సింగ్ తన గాత్రంతో, చంద్రశేఖర్ వాయిద్య సహకారముతో కార్యక్రమాన్ని రక్తి కట్టించి, వచ్చిన వారిని ఆనందింపజేస్తూ భూమిపై స్వర్గావతరణకు అనుసరించవలసిన మార్గాన్ని తెలిపారు.

గ్రామ ప్రజల ఉత్సాహాన్ని మరియు కేవలము నలుగురు మహిళా మణులు కలసి వారి సంకల్పముతో కొలది కాలములోనే గాయత్రీ మాత మందిరాన్ని నిర్మించి, ఇతరులను మార్గదర్శకులుగా నిలచిన వారి దీక్షా దక్షతలకు ముగ్ధులై, శ్రీ ఈ అశ్విని సుబ్బారావు గారు అశ్విని ఛారిటబుల్ ట్రస్టు తరపున, ట్రస్టు ఛైర్మన్ హోదాలో గ్రామాభివృద్ధికై 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని సభాముఖముగా ప్రకటించుట అత్యంత ముదావహం.

తదుపరి శ్రీ పరమానంద ద్వివేది మరియు హీర్‌సింగ్ రాజపురోహిత్ గార్లు దీపయజ్ఞాన్ని నిర్వహించారు.

అటు పిమ్మట దేవాలయము ముందున్న ఏక కుండీ ద్వారా గాయత్రీ యజ్ఞాన్ని విగ్రహ దాతలతో చేయిస్తూ షట్కర్మలు పూర్తి గావించి, తరువాత గాయత్రీ మంత్రోచ్చారణ ప్రారంభించి విగ్రహాల ప్రతిష్ఠా కార్యక్రమాన్ని ప్రారంభించారు.

వినాయకుడు మరియు గాయత్రీ మాత విగ్రహాలకు ఐదుగురు కన్యలతో దశవిధ స్నానములు అనగా యజ్ఞ భస్మం, మట్టి, ఆవు పేడ, ఆవు మూత్రం, ఆవు పాలు, ఆవు పెరుగు, ఆవు నెయ్యి, దర్భలు, హవన ద్రవ్యం మూలికలతో మరియు తేనెతో పూర్తి కావించిరి. అటు పిమ్మట నూతన వస్త్రాలంకరణతో సర్వాభరణములు ధరింపజేసి, హారతి ఇస్తూ తెరను తొలగించిరి.

తరువాత గాయత్రీ యజ్ఞాన్ని పూర్తి గావించిరి. 10 గంటలకు 24 కుండములతో గాయత్రీ మహా యజ్ఞాన్ని శ్రీ పరమానంద ద్వివేది మరియు హీర్‌సింగ్ రాజపురోహిత్ గార్లు పూర్తి చేయించిరి.

తరువాత శ్రీరామకృష్ణ మాష్టారు మరియు శ్రీ అశ్విని సుబ్బారావుగార్లు ప్రవచించిరి. ఆలయ స్థల, విగ్రహాల దాతలను వేదికపైకి పిలచి వారిని శ్రీరామకృష్ణ మాష్టారు మరియు శ్రీ అశ్విని సుబ్బారావుగార్లు వారిని ఆశీర్వదించి, సత్కరించిరి.

వెంకటలక్ష్మి, నాగమణి, కృష్ణవేణి, దండా బ్రహ్మానందం (గాయత్రీ మాత విగ్రహ దాతలు); బ్రహ్మనాయుడు (పాలు, పెరుగు దాత), రావెళ్ళ సత్యనారాయణ (రూ. 10,000/-); వెంకట్రావు (రూ. 5,000/-); మారినేని సత్యనారాయణ (స్థల దాత); కొమ్మలపాటి రమేష్‌బాబు (వినాయక విగ్రహ దాత);

గుడి నిర్మాణం కొరకు సుమారుగా రూ. 5 లక్షలు వెచ్చించిరి. అంతా చందాల రూపంలో వసూలు చేసిరి.

## హైదరాబాదులో 108 కుండముల గాయత్రీ మహా యజ్ఞము

2011 ఏప్రిల్ 29,30 మరియు మే 1 తేదీలలో 108 కుండముల గాయత్రీ మహా యజ్ఞము పి.ఎన్.ఎమ్. హైస్కూలు కూకట్‌పల్లి, హైద్రాబాదు ఆవరణలో జరుపుటకు, గాయత్రీ చేతనా కేంద్రము సంకల్పించినది.

**కార్యక్రమ వివరాలు :**

29.04.2011 సాయంత్రం కలశయాత్ర మరియు దీప యజ్ఞము – ప్రజ్ఞాపురాణ కథా కార్యక్రమం.

30.04.2011 ఉదయం 108 కుండముల గాయత్రీ మహా యజ్ఞము – **ఆదరణీయ డా॥ ప్రణవ్ పండ్యా, విశ్వ గాయత్రీ పరివార్ ప్రధాన సంచాలకుల ప్రవచనం,** సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు

01.05.2011 ఉదయం గాయత్రీ మహా యజ్ఞ పూర్ణాహుతి, పూజ్య గురుదేవుల జన్మశతాబ్ది ప్రచవనం.

అందరికీ ఇదే మా హృదయపూర్వక ఆహ్వానము.

## గాయత్రీ మాత విగ్రహ ప్రతిష్ఠ

**"గయాన్ త్రాయతి ఇతి గాయత్రి" అంటే ప్రాణముల రక్షించేది గాయత్రీ అని అర్థము**

గాయత్రీ మాత విగ్రహ ప్రతిష్ట 6,7 మరియు 8 తేదీలు, మే నెల 2011న కొత్తపాలెం గ్రామము, చెరుకూరు పోస్టు, పర్చూరు మండలం, ప్రకాశం జిల్లాలో శాంతికుంజ్ హరిద్వార్ ప్రతినిధులతో నిర్వహించబడును. పూజ్యులు డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాష్టారు ప్రవచించెదరు. తదుపరి శ్రీ అశ్విని సుబ్బారావు, దక్షిణ భారత ప్రధాన సంచాలకులు గారి ప్రజ్ఞా పురాణ కథా కార్యక్రమం. అందరికీ ఇదే మా హృదయపూర్వక ఆహ్వానము.

07.05.2011 కలశయాత్ర మరియు దీపయజ్ఞం

08.05.2011 108 కుండముల గాయత్రీ మహా యజ్ఞం

**ఇట్లు**

**గాయత్రీ ప్రజ్ఞా పీఠము,** కొత్త పాలెం.

మనో మాలిన్య ప్రభావంతో విచక్షణా జ్ఞానాన్ని కోల్పోతాము.

వార్తలు

# రాష్ట్రంలో జరిగిన వివిధ కార్యక్రమాలు

## నెల్లూరులో భారతీయ సంస్కృతి జ్ఞాన పరీక్ష 2010-11 బహుమతి ప్రదానోత్సవం

భారతీయ సంస్కృతి జ్ఞాన పరీక్ష 2010-11 సంవత్సరానికి సంబంధించిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమము 2 మార్చి, 2011 ఆదివారము నాడు నెల్లూరులో దాదాపు 110 పాఠశాలల విద్యార్థులు 1400 మంది వారి తల్లిదండ్రులు హాజరుకాగా అత్యంత నేత్రపర్వముగా జరిగినది. ప్రతి తరగతిలో ప్రతి పాఠశాలలో పరీక్షలో ప్రథమ, ద్వితీయ మరియు తృతీయ స్థానములు పొందిన బాల బాలికలందరికి బహుమతులనందించిరి. అట్లే జిల్లాలో ప్రథమ, ద్వితీయ మరియు తృతీయ స్థానమునలంకరించిన వారికి బహుమతులతో సత్కరించిరి.

సభకు జిల్లా విద్యాశాఖాధికారియైన శ్రీ ప్రసన్నాంజనేయులు ముఖ్య అతిథిగా విచ్చేసి, మరుగునపడి పోవుచున్న భారతీయ సంస్కృతిని తిరిగి వెలుగులోనికి తెచ్చి పూర్వపు వైభవాన్ని తీసుకురావడానికి గాయత్రీ పరివార్ చేయుచున్న కృషిని అభినందించుతూ, తమ వంతు సహకారాన్ని పూర్తిగా అందిస్తామని చెప్పడం అత్యంత ముదావహం.

జిల్లా స్త్రీ శిశు సంక్షేమ ప్రాజెక్టు డైరెక్టర్ గారైన శ్రీ శారద గారు రెండవ ముఖ్య అతిథగా విచ్చేసి, బాల బాలికల నాశీర్వదించుతూ గాయత్రీ పరివార్ కృషిని అభినందించారు. వీరేకాక, జిల్లా ఫోరమ్ కన్వీనర్‌గారైన కరుణకుమారిగారు మరియు జిల్లా రెసిడెన్షియల్ పాఠశాలల కన్వీనరుగారైన శ్రీ వై.యానాదిగార్లు బాలబాలికలనాశీర్వదించి భారతీయ సంస్కృతి పరిరక్షణకై గాయత్రీ పరివార్ చేయుచున్న కృషిని అభినందించారు.

జిల్లా భారతీయ జ్ఞాన పరీక్ష కన్వీనరుగారైన శ్రీమతి భువన గాయత్రీ పరివార్, తదితర ప్రముఖ కార్యకర్తలైన శ్రీ రమణమూర్తిగారు, రామచంద్రయ్యగారు మరియు తిరునారాయణ, భాస్కరనాయుడు, సిద్దారెడ్డి మున్నగువారి సహాయ సహకారములతో ఈ కార్యక్రమాన్ని మరియు యావత్ పరీక్షా కార్యక్రమాన్ని పటిష్టముగా నిర్వహించుట అత్యంత శ్లాఘనీయం. నెల్లూరు గాయత్రీ పరివార్ టీమ్‌ను గాయత్రీ చేతనా కేంద్రము అభినందించుచున్నది. వారు సంకల్పించిన 2011-12 లక్ష్యమైన 10వేల మంది విద్యార్థిని విద్యార్థులతో వ్రాయించుటలో వారు కృతార్థులు కావలయునని కోరుకొనుచూ, పూజ్య గురుదేవులు మరియు మాతాజీల వారికి కావలసిన సాధన సంపత్తులనందించి ఆశీర్వదించవలసినదిగా చేతనా కేంద్రం ప్రార్థించుచున్నది.

తిరునారాయణగారి వందన సమర్పణతో కార్యక్రమాలు ముగిసినవి. శ్రీ సిద్దారెడ్డిగారు ఆహుతులకు ప్రసాదవితరణ గావించిరి.

## కొలకలూరు గ్రామములో 108 కుండములు గాయత్రీ మహా యజ్ఞము

28, 29 మరియు 30 జనవరి, 2011న 108 కుండముల గాయత్రీ మహా యజ్ఞము కొలకలూరు గ్రామము, కొలకలూరు (మం॥), గుంటూరు జిల్లాలో జరుపబడినది. 108 కలశములతో కలశయాత్ర సాగినది. సాయంత్రం దీపయజ్ఞం చుట్టు ప్రక్కలనున్న దాదాపు 50 గ్రామాల నుండి విచ్చేసిన మహిళామణులతో కన్నుల పండువగా, దేదీప్యమానంగా చేసిరి. 20వ తేదీన యజ్ఞము శాంతికుంజ్ వరిష్ఠ కార్యకర్త శ్రీ పరమానంద ద్వివేదిగారి సారథ్యంలో జరిగినది. పూజ్యులైన డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాష్టారి దివ్యాశ్శీస్సులతో, మంగళాశాసనములతో యజ్ఞము పూర్తియైనది. సాయంత్రం శ్రీ పరమానంద ద్వివేదిగారి ప్రజ్ఞాపురాణ ప్రవచనం జరిగినది. దీనికి గాయత్రి పరివార్ వరిష్ఠ కార్యకర్తలైన శ్రీ ఫూల్‌సింగ్ గారి ప్రేరణా గీతాలు, చంద్రశేఖర్ తబల సహకారముతో కార్యక్రమం మరింత రక్తి కట్టినది.

30వ తేదిన 108 యజ్ఞములతో పూర్ణాహుతి కార్యక్రమము పూజ్యులు రామకృష్ణ మాష్టారు మరియు పరమానందద్వివేది గార్ల సారథ్యంలో కన్నుల పండువగా, వీనుల విందుగా, జయఘోషలతో ముగిసినది. 6000 మంది పాల్గొనిరి. రూ. 12,000/-ల సాహిత్య విక్రయం జరిగినది.

కొలకలూరు నుండి శ్రీ వెంకట్రావు, ముత్తయ్య, జగన్మోహన రావు, నాగేంద్రం, సాంబయ్యగార్లు, తెనాలి నుండి అనిల్ కుమార్, మల్లిఖార్జున, జయప్రద, వసంతలక్ష్మి, శ్రీలక్ష్మి, లలితగార్లు, తూములూరు, గరువుపాలెం, కొల్లిపర నుండి కోటిరెడ్డి, సుబ్బారావుగార్లు, పెదరావూరు సుబ్బారావు, సూర్య ప్రకాశరావు, బసంత్‌గార్లు, యడ్లపల్లి రజని, దుండిపాలెం యుగసంధి గీత బృందగానం వారు, చదలవాడ పూర్ణచంద్రరావు, నిడుముక్కల మున్నగువారనేకులు విశేష సహాయ సహకారములందించి యజ్ఞము నిర్విఘ్నంగా జరుగుటకు తోడ్పడిరి. అందరికి పూజ్య గురుదేవుల వందనీయ మాతాజీల దివ్యాశ్శీస్సులు లభించుగాక. చేతనాకేంద్రము వారినందరిని అభినందించుచున్నది.

**ఆదరణ, ఆప్యాయత, జాలి, దయ ఇతరులలో మానసిక స్థిరత్వాన్ని అందిస్తాయి.**

## పాత గుంటూరులో

09.03.2011న పాత గుంటూరు పట్టణములోని యాదవ హైస్కూలు ప్రాంగణములో 9 కుండముల గాయత్రీ మహా యజ్ఞము నిర్వహించారు. గత 5 సం॥ల నుండి ఆనవాయితీగా, విద్యార్థులందరికి, ఉపాధ్యాయులందరికి సద్బుద్ధిని, సదాలోచనలను, సత్ప్రవర్తనలను కోరుకొనుచూ ఈ యజ్ఞ పరంపరను నిర్వహించుచూ భారతీయ సంస్కృతిని సజీవముగా కాపాడుట తమ వంతు కర్తవ్యాన్ని పాటించుచున్న స్కూలు యాజమాన్యాన్ని, గాయత్రీ చేతనాకేంద్రము మనసారా అభినందించుచున్నది. పరమపూజ్య గురుదేవులు మరియు వందనీయ మాతాజీల ఆశీస్సులు వారందరికి సర్వవేళలా సర్వావస్థలయందు లభించుగాక.

## విద్యానగర్‌లో

06.03.2011 హైదరాబాద్ విద్యానగర్‌లోని A.T.I కాలేజి క్వార్టర్సులో శ్రీ సుధీర్, సుజాత గార్ల ఆధ్వర్యంలో పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞమును శ్రీమతి సుబ్బులు, శ్రీ నారాయణ రావు, గీతారాధిక గార్లు నిర్వహించారు. సుమారు 70 మంది పరిజనులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో 300 రూపాయల సాహిత్యం విక్రయం జరిగింది. జన్మశతాబ్ది గాయత్రీ మంత్రలేఖన పుస్తకాలు వ్రాయుటకు 24 మంది తీసుకున్నారు. యుగశక్తి గాయత్రి పుస్తకములు యజ్ఞ ప్రసాదంగా ఇవ్వబడ్డాయి. జనవరి, ఫిబ్రవరి నెలలలో జన్మశతాబ్ది సందర్భంలో 200 గాయత్రి పరివార్ క్యాలెండర్లు శ్రీమతి సుబ్బులు గారి ఆధ్వర్యంలో పంచబడ్డాయి.

## దిల్‌సుఖ్‌నగర్‌లో

హైదరాబాదులోని దిల్‌సుఖ్‌నగర్‌లోని శ్రీరామకీర్తన ప్రజ్ఞాపీఠం నందు (040-24069011) గాయత్రి జయంతి నుండి ప్రతి నిత్యం ఉదయం 7 గంటలకు గాయత్రి యజ్ఞం నిర్వహించబడుతున్నది. యజ్ఞంతోపాటు వివిధ సంస్కారాలు కూడా నిర్వహించబడుతున్నాయి. ఈ కార్యక్రమములో శ్రీ సతీష్ పటేల్, శ్రీమతి విజయ, శ్రీమతి సరస్వతీ, శ్రీ వెంకటరావు, శ్రీ వెంకటేశ్వర రావుగార్లు ముఖ్య పాత్ర వహిస్తున్నారు.

వసంత పంచమి సందర్భమున ఫిబ్రవరి 6,7,8 తేదీలలో వివిధ కార్యక్రమాలు జరిగాయి. 6వ తేదీ పంచకుండీ గాయత్రీ యజ్ఞం, 7వ తేది 40 మంది సాధకులతో అఖండ గాయత్రీ జపం, జ్ఞానరథయాత్ర నిర్వహించబడినవి. 8వ తేది యజ్ఞ కార్యక్రమంలో 1000 గాయత్రీ మంత్ర ఆహుతులు సమర్పించబడినవి.

శతాబ్ది మంత్రలేఖన కార్యక్రమంలో 1100 మంత్రలేఖన పుస్తకములు ఉత్సాహవంతులైన పరిజనులకు పంచబడ్డాయి. ప్రజ్ఞా పీఠ నిర్వహణకు శ్రీ విశ్వనాథ్, శ్రీ రాహుల్, శ్రీ సుబ్రమణ్యం, శ్రీ ఆంజనేయులు, శకుంతల గార్లు విశేషంగా సహకరిస్తున్నారు.

## కామారెడ్డిలో

పూజ్యగురుదేవుల జన్మశతాబ్ది సందర్భమున కామారెడ్డి గాయత్రి ప్రజ్ఞాపీఠం వారు 2011 మార్చి నెలలో ప్రచార నిమిత్తం పూజ్య గురుదేవుల సద్వాక్యాలు (5000), ధైర్యం విడువకండి పుస్తకాలు (5000) 2011 గాయత్రి చేతనా కేంద్రం క్యాలెండర్లు (6000) కామారెడ్డిలో, చుట్టుప్రక్కల గ్రామాల యందు పంచిపెట్టారు. ఇటువంటి శ్రద్ధాపూర్వక కార్యక్రమములు చేస్తున్న కామారెడ్డి గాయత్రి ప్రజ్ఞా పీఠం వారికి అభినందనలు.

## విజయవాడలో

ఫిబ్రవరి 6,7,8 వసంత పంచమి సందర్భమున ఫిబ్రవరి 6వ తారీఖున 108 కలశములతో శోభాయాత్ర; 7వ తారీఖున ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు అఖండ జపం తదనంతరం దీపయజ్ఞం; 8వ తారీఖున 12 కుండముల గాయత్రీ మహా యజ్ఞం నిర్వహించారు. సుమారు 600 మంది పరిజనులు ఈ యజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్నారు.

13.02.2011 డా॥ పి.శ్రీనివాస్ గారి వివాహం గాయత్రీ పరివార్ కార్యాలయం సంపన్నమయింది.

త్రికుండీ గాయత్రీ మహా యజ్ఞములు 02.01.2011, 27.02.2011, 18.02.2011 న నిర్వహించబడినాయి. ఫిబ్రవరి నెలలో 18 గృహములలో గాయత్రీ యజ్ఞములు నిర్వహించ బడినాయి.

## గాయత్రీ మహా యజ్ఞాలు

గాయత్రీ చేతనా కేంద్రం, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో శ్రీ జిల్లా వెంకట నారాయణ గారు ఈ క్రింది ప్రదేశములలో గాయత్రీ యజ్ఞాలను, సంస్కారాలను నిర్వహించిరి.

మహబూబ్‌నగర్ జిల్లా చౌదపల్లి గ్రామములో 40 దినముల హనుమాన్ దీక్ష బూనిన వారిచే పూర్ణాహుతి వేళ 5 కుండముల గాయత్రీ మహా యజ్ఞము నిర్వహించారు. 600 మంది పాల్గొన్నారు.


జనవరి 15వతేది శంషాబాద్‌లో పుంసవన సంస్కారం, యజ్ఞము అట్లే పి.జె.ఆర్.నగర్ ప్లాట్ నంబరు 102లో బాలికల వసతి గృహమునందు ఫిబ్రవరి 13న యజ్ఞము. అట్లే కంబాలపల్లి గ్రామం, వరంగల్ జిల్లాలో ప్రతాపరుద్రునిచే నిర్మింపబడిన శివాలయ జీర్ణోద్ధరణ పూర్తికావించినవేళ గాయత్రీ మహా యజ్ఞము నిర్వహించారు.

**మనోమాలిన్యం వ్యాధి నిరోధక వ్యవస్థను సవ్యంగా పనిచేయనివ్వదు.**

**అక్షరాల ఆట**

# పదగాయత్రి-6

*నిర్వహణ :* **సాధన నరసింహాచార్య**



### పదగాయత్రి-5 సమాధానాలు

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| (1) శ్రీ | (2) నా | (3) థు | (4) డు | X | (5) స | (6) న | (7) ప |
| (8) ఖ | చి | త | ము | X | (9) రా | యు | ర |
| (10) ర | గ | ర | న | X | X | (11) గా | మే |
| X | (12) నం | ఉ | X | (13) ము | (14) గ | రం | (15) శా |
| (16) ప్ర | X | X | (17) ము | ల | జ | గా | గం |
| X | (18) స్వీ | X | ని | X | X | X | గ |
| ల్పం | క | (19) సం | X | (20) ఆ | స | X | వి |
| (21) క | ర్త | వ్య | ప | రా | (22) యు | ణు | డు |

పేరు : ..................................................

చిరునామా : ..........................................

..........................................................

...................... పిన్ కోడ్ : ......................

ఫోన్ నెం : ..........................................

## ఆధారాలు

### అడ్డం

1. శివపార్వతులు కళ్యాణం జరిగే పర్వదినం (6)
5. రెండు నిలువులో దానికి ఈ అక్షరం చేరిస్తే ఆధ్యాత్మిక / ధార్మిక ప్రసంగం (1)
6. హంస (అటు నుండి) (4)
7. సూర్యుడు (3)
10. చెల్లాచెదురైన ఛాయా కవిత్వం (3)
11. 'వేగమున' అనే అర్థంలోనిదే మొదటి అక్షరం తొలగిపోయింది (3)
13. భక్తుడు కోరుకునేది (2)
14. రాజకీయాలలో ఈ పోరాటాలు తరచు కన్పిస్తాయి. (అటునుండి) (2)
15. తిన్న ఇంటి ....... లెక్కించరాదు (2)
16. చెదిరిన మానము (3)
17. పక్షపాతం (3)
18. ఒక నది (3)
19. అమృతం కొరకు దేవతలు, దానవులు చేసిన యత్నం (8)

### నిలువు

1. పంచమ వేదం (6)
2. వచనము ఆద్యంతాలు (2)
3. ఒక రకమైన నృత్యం (క్రింద నుండి) (3)
4. తల్లక్రిందులైన విభావరి (2)
8. తెలుగు ..... కారములు (2)
9. పేదవాడు ఆద్యంతాలు (క్రింద నుండి) (2)
12. పురుషార్థాలలో మొదటి మార్గం (క్రింద నుండి) (5)
13. చెదిరిన కిటికి (4)
15. తిరగబడి, దీర్ఘం పోయిన సహవాసం (3)
16. అటు, ఇటైనా నువ్వు+నేను (3)
17. ఆదిలేని పైరవి (క్రింద నుండి) (2)
20. దేవతల ఉద్యానవనం (క్రింద నుండి) (6)

### సవరణ

పదగాయత్రి-5లో 16 అడ్డానికి ఆధారంగా ఇచ్చిన అక్షరాల సంఖ్య '1' కి బదులుగా '4' అని ప్రచురించబడినది. 3 నిలువు ఆధారంలో కూడా 'రేవు' స్థానంలో 'రేఫ' అని ఉండాలి. కల్గిన అసౌకర్యానికి చింతిస్తున్నాము.

### నిబంధనలు :

1. *సమాధానాలు "కీ"తో సరిపోవాలి.*
2. *కూపన్లు చేరవలసిన చివరి తేది 18-04-2011*
3. *పత్రికలో పైన ఇచ్చిన కూపన్‌నే పంపవలెను.*
4. *దిద్దుబాట్లు / కొట్టివేతలు / తుడుపులు ఉండరాదు.*
5. *తెల్లకాగితాలు / జిరాక్స్ కాపీలు అనుమతించబడవు.*
6. *అన్ని కరెక్టు అయిన ఎంట్రీలు ఎక్కువ సంఖ్యలో ఉన్నచో లాటరీ ద్వారా ఎంపికచేసి* ***ప్రథమ బహుమతి రూ.100/-లు, ద్వితీయ బహుమతి రూ.50/-లు*** *ఇవ్వబడును.*
7. *తపాలశాఖవారి ఆలస్యానికి పత్రిక బాధ్యత వహించదు.*
8. *బహుమతుల విషయంలో తుది నిర్ణయం సంపాదకులదే. ఎలాంటి వివాదాలకు తావులేదు.*
9. *పేరు, చిరునామాలు స్పష్టంగా, పిన్‌కోడ్‌తో ఫోన్‌నెంబరుతో సహా వ్రాయాలి.*

### పదగాయత్రి-5 విజేతలు

మొదటి బహుమతి : **పి. సీత,** బాపట్ల

ద్వితీయ బహుమతి : **సి. నందగోపాల్,** విశాఖపట్నం

**వివరణ:** 'కీ' ప్రకారము 16 ఆధారములో ప్రియం అను సమాధానం ఉన్నది. అయితే ఇష్టం అను సమాధానం 'కీ' కి దగ్గరగా ఉన్న కారణంగా దానిని పరిగణనలోనికి తీసుకుని లాటరీ పద్ధతిలో విజేతలను ప్రకటిస్తున్నాము.

**ఎంట్రీలు పంపవలసిన చిరునామా**

**పదగాయత్రి C/o. యుగశక్తి గాయత్రి, అశ్విని హౌస్ ప్రక్కన, గాయత్రీ చేతనా కేంద్రం, మూసాపేట, హైదరాబాద్-18.**